ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
23-5-'51

విషయానుక్రమణిక
23 మే 1951

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిపత్రిక 4 అణాలు	ప్రతి బుధవారము ప్రకటింపబడును	సంపుటము 43 సంచిక 36 23-5-51

Founder : K. NAGESWARA RAO

ఖర సంవత్సర వైశాఖ బహుళ తదియ బుధవారము

చీనాతో వ్యాపారంపై నిర్బంధాలు

★ [సూర్యనారాయణ] ★

చీనా దేశానికీ, ఉత్తర కొరియాకీ యుద్ధానికి పనికివచ్చే ఏ వస్తువులనూ ఎగుమతి చెయ్యరాదని సర్వదేశాలకూ ఆదేశమిస్తూ అమెరికా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సమిష్టిచర్యల సంఘం, రాజకీయసంఘం, సర్వసభ్య సమావేశాలు ఆమోదించాయి. భారత ప్రతినిధి బి. యన్. రావుగారు తీర్మానానికి ప్రతికూలంగా వోటు చేశారు. దక్షిణ కొరియాను కమ్యూనిస్టుల అధీనంనుంచి తప్పించడం మాత్రమే ఐక్యరాజ్యసమితి లక్ష్యమని ప్రకటించడం అవసరమని రావుగారన్నారు. కాని ఎవరూ ఈ మాట వినిపించుకోలేదు. చీనా కమ్యూనిస్టు ప్రభుత్వంపైన దురాక్రమణ నేరం మోపినప్పుడు, ఆ తీర్మానానికి ప్రతికూలంగా వోటుచేసిన ఆసియా దేశాలలో కొన్ని దేశాల ప్రతినిధులు, యుగోస్లావియా, ఇస్రాయల్ ప్రతినిధులు ఈ తీర్మానానికి అనుకూలంగా వోటు చెయ్యడంతో, అంతంతమాత్రంగా ఉన్న ఆసియా దేశాల సమిష్టి విధానం కాస్తా భగ్నమైపోయింది.

ఈ తీర్మానం ఈ రీతిగా ఆమోదం పొందడంతో, అన్యరాజ్యాలపైన అమెరికన్లు తెస్తున్న ఒత్తిడి చక్కగా పని చేస్తున్నట్లు స్పష్టపడుతోంది. ఇది ఈ రీతిగానే మరికొంతకాలం కొనసాగినట్లయితే, ఇంక ఇతర దేశాల ప్రభుత్వాలను అమెరికా తన చెప్పుచేతల్లోకి తెచ్చుకుని యుద్ధసన్నాహ కార్యక్రమంలో మరింత వేగంతో పురోగమించగలదు.

అమెరికన్ సెనేట్‌లో మార్షల్ ఆర్థిక సహాయప్రణాళిక చర్చకువచ్చినప్పుడు, ఈ సంవత్సరం ఖర్చును ఆమోదిస్తూ సెనేట్ ఒక షరతు విధించింది. చీనా దేశానికి యుద్ధానికి పనికివచ్చే వస్తువుల్ని ఎగుమతి చెయ్యకుండా నిషేధించే దేశాలకే ఆర్థిక సహాయం ఇవ్వాలని నియమం విధించింది. ఈ ఒక్క దెబ్బతో ప్రస్తుత తీర్మానానికి సర్వసభ్య సమావేశంలో 47 వోట్లు కురిశాయి. యుగోస్లావియా కూడా మాట్లాడకుండా అనుకూలంగా వోటు చేసింది.

బ్రిటిష్‌వారికి చెందిన హాంకాంగ్ నుంచి యుద్ధానికి పనికివచ్చే సామగ్రి చీనా దేశానికి పంపబడుతోందని జనరల్ మెకార్థర్ కాంగ్రెస్ కమిటీలో ఆరోపించగానే, అమెరికాలో బయలుదేరిన అలజడికి భయపడి బ్రిటన్ లొంగివచ్చింది. అయితే యుద్ధావసర వస్తువుల ఎగుమతిని నిషేధించడానికి ఒప్పుకుంటూ, బ్రిటిష్ ప్రతినిధి గ్లాడ్విన్ జెబ్ వ్యాపారాన్ని పూర్తిగా నిషేధించడం మాత్రం ఎన్నడూ వీలుపడదని స్పష్టపరిచాడు. కాని ఇంతవరకూ వచ్చిన తరవాత చీనాతో వ్యాపారాన్ని నిషేధించాలని అమెరికా ఒత్తిడి తేవడానికి ఆట్టే రోజులు పట్టదని న్యూస్టేట్స్‌మన్ ఎండ్ నేషన్ పత్రిక అభిప్రాయం. అక్రమవ్యాపారంలో ఆరితేరిన చీనాదేశస్థులు తూర్పుఆసియాలో అన్నిదేశాలలోనూ వ్యాపించి ఉన్నారు. అందువల్ల యుద్ధావసర వస్తువుల ఎగుమతిని నిషేధిస్తూ తీర్మానం చెయ్యడంతో సరిపోదు. అమెరికన్ నౌకలు చీనాసముద్రంలో వచ్చిపోయే నౌకల్ని సోదా చెయ్యడానికి ప్రయత్నించవచ్చును. ఇందుకు రష్యన్ నౌకలు అంగీకరించడం అసంభవం. అప్పుడేమౌతుంది? రెండుపక్షాల నౌకాబలాలమధ్య యుద్ధం సంభవించవచ్చును. లేదా, యుద్ధావసరవస్తువులు రవానా కాకుండా జాగ్రత్తపడే నిమిత్తమేనని చెప్తూ, చీనాతో అసలు ఏ దేశమూ వ్యాపారం చెయ్యరాదని అమెరికా ఒత్తిడి తేవచ్చును. ఈ రెండింటిలో ఏది జరిగినా తూర్పు ఆసియాలో, ముఖ్యంగా జపాన్, మలయా, ఇండోచీనా, సయాం, ఇండొనీషియా, మున్నగు దేశాలలో అశాంతి

సంభవించకమానదు. చీనాతో వ్యాపారం ఈ దేశాలకు అవసరం. భారతదేశం చీనా దేశంనించి ఆహారధాన్యాలు తెచ్చుకుంటోంది. వ్యాపారంపై పూర్తిగా నిషేధం విధిస్తే ఇది నిలిచిపోతుంది. అమెరికా ఆహారాన్ని తానివ్వకపోగా, చీనాదేశంనించి కూడా భారతదేశానికి ఆహారం రానివ్వకూడదని పట్టుదలతో ఉన్న సంగతి అందరికీ తెలిసినదే. ఏవిధంగానైనా భారతదేశాన్ని లొంగదీసి తను యుద్ధవ్యూహంలోకిలాగాలని అమెరికాయత్నం. దీనికోసం భారతదేశంలో కరువులు వచ్చి వేలాదిగా ప్రజలు మరణించినా అమెరికా చింతించదని అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల ఉపన్యాసాల్నిబట్టే స్పష్టపడుతోంది.

వ్యాపారంపైన నిషేధం విధించబడినట్లయితే హాంకాంగ్ తమ కింక దక్కదని బ్రిటిష్‌వారికి తెలుసును. నీటికీ ఆహారానికీ కూడా హాంకాంగ్ చీనాపైనే ఆధారపడి ఉందని జెబ్ చెప్పారు. వ్యాపారం నిషేధించేపక్షంలో నీరు, ఆహారం కొరకై, ప్రజలు తిరుగుబాటు చెయ్యకమానరు. అందువల్లనే యుద్ధావసరవస్తువుల నిషేధం వరకూ బ్రిటిష్ ప్రభుత్వం అమెరికన్ల ఒత్తిడికి లొంగిందనీ, ఇంకా లొంగిపోవడం అంటే హాంకాంగ్‌కి నీళ్లు వొదులుకోక తప్పదనీ జెబ్ చెప్పాడు. జపాన్‌దేశం బొగ్గు చీనానించే తెచ్చుకుంటోంది, జపాన్‌కి చీనాతో వ్యాపారం బాగా వృద్ధయింది. ఈ నిషేధ తీర్మానంవల్ల జపాన్‌కి నష్టం అధికం. అందువల్లనే తీర్మానంఆమోదించబడిన 24 గంటలలో అమెరికన్ ప్రభుత్వం జపాన్‌తో ఆర్థికపు టొడంబడిక సూచించింది. ఈ ఒడంబడిక ప్రకారం జపాన్‌కి చీనాతో వ్యాపార నిషేధంవల్ల కలిగే లోటుపాట్లను అమెరికా సర్దుకోవాలి.

ఈ నిషేధతీర్మానంఫలితంగా రబ్బరు తగరం ధరలు పడిపోయాయి. అంటే పశ్చిమయూరప్ అమెరికాల ఆయుధ నిర్మాణకార్యక్రమంలో లాభాలన్నీ అమెరికన్ పరిశ్రమల యజమానులికే లభిస్తాయన్నమాట. పశ్చిమ యూరోపియన్లకి లభించవు. రబ్బరు తగరాల ధరల పెరుగుదలవల్లనే చాలవరకు బ్రిటిష్‌ప్రభుత్వం అమెరికాతో వ్యాపారం చెయ్యగలిగింది. ఇంక ఆ ఆధారంకూడా బ్రిటన్‌కి పోయినట్లే. ★

డియర్ పింక్

★

హల్లో, హలో, మిస్టర్ పింక్!
గుడ్ మోర్నింగ్ మిస్టర్ పింక్!
నీ పక్కనెవరు మై డియర్ పింక్!
ఈజిట్ అవర్ బ్లడీ యాంక్?

పాపం చాలా మారిపోయావోయ్.
మరీ అంత వెలిసిపోయావేం భాయ్?
నీ పక్క నెవరది మిస్టర్ జయ్?
ఈజిట్ శ్రీజుత్ సర్వోదయ్?

ఇంతకీ ఏమిటి నీ కార్యక్రమం?
అసలు నీలో నీకే లేదు నమ్మకం.
నువ్వనుకున్నదెలా సాధించాలని?
నీ కాళ్ల కింది నేల నమ్మదగిందేనా అని.

ఎన్నికల్లో గెలుద్దామనే నువ్వ?—మైగాడ్!
ఒక వేళ గెలిచినా ఏంలాభం, కామ్రేడ్?
ఏ మార్పైనా వస్తుందిటోయ్ పైనుంచి?
ఏ మార్పైనా రావాలి గడ్డని పెల్లగించి.

అన్నట్టు డబ్బు కిబ్బందిగా ఉందిటగా?
అయినా ఏంఫర్వా లేదటగా?
ఇదిగో నిజం చెప్పు మిస్టర్ జయ్!
నీ పక్కన హూ ఈజ్ దట్ గయ్?

ఐతే వెనక్కా, ముందుకా నువ్వెళ్లటమ్?
ఎటైనా, నువ్వెళ్లే వేపు లేరులే జనమ్.
నువ్వు కాదు మా పడవకి సరంగు.
మేం కనిపెట్టేశాం నీ అసలు రంగు.

జేబులో డాలర్లేమిటి పింకీ?
ఏమన్నా ముట్ట జెప్పాడా యాంకీ?
ఇదుగో నిజంచెప్పవోయ్ మిస్టర్.
ఆర్ యు మియర్లీ హిజ్ డస్టర్?

—సవ్యసాచి—

డైరీ

సోమవారం, మే 14:

—యుద్ధానికి పనికివచ్చే వస్తువులు వేటినీ చీనాదేశానికి ఎగుమతి చెయ్యరాదని అన్ని దేశాలకూ ఆదేశమిస్తూ ఐక్యరాజ్యసమితి సమిష్టిచర్యల సంఘం తీర్మానంచేసింది.

—నూనెపరిశ్రమను తొందరపడి స్వాధీన పరుచుకోవద్దనీ, రాజీ మార్గాలను అన్వేషించాలనీ అమెరికన్ ప్రభుత్వం పర్షియా ప్రభుత్వాన్ని హెచ్చరించింది.

—పర్షియా నూనె పరిశ్రమను స్వాధీన పరుచుకోవలసిన ఆయిల్ కమిటీ సభ్యుడొకడు బ్రిటిష్ ప్రభుత్వం నిరోధించినట్లయితే మూడో ప్రపంచయుద్ధాన్ని రెచ్చగొట్టినట్లవుతుందని హెచ్చరించాడు.

—ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగిపోయినందువల్ల పశ్చిమ యూరప్‌లో ఆర్థిక దుస్థితి ఏర్పడగలదని ఎకనమిక్ కోఆపరేషన్ ఎడ్మినిస్ట్రేషన్ అమెరికన్ కాంగ్రెస్‌కు నివేదించింది.

—పురుషులతో సమానంగా స్త్రీలకు రాజకీయ స్వత్వాలనిస్తూ ఐక్యరాజ్యసమితి కమిటీ మూడు నిబంధనల తీర్మానం ఒకటి చేసింది.

—భారతదేశంనుంచి పంపబడిన వస్త్రం జేళ్లు సింగపూర్‌లో గిడ్డంగులు పట్టడం లేదని సింగపూర్ వార్త.

—వస్త్రోత్పత్తివృద్ధి కార్యక్రమంలో ప్రభుత్వానికి తోడ్పడని మిల్లుల్ని ప్రభుత్వం వశపరుచుకోడానికి వెనుదియ్యదని మంత్రి హరికృష్ణ మెహతాబ్ పత్రికా ప్రతినిధులతో అన్నారు.

—ఈ సంవత్సరం ఎనిమిదిన్నర లక్షల జేళ్లు పత్తిని దిగుమతి చెయ్యడానికి భారత ప్రభుత్వం నిశ్చయించినట్లు పార్లమెంటులో ప్రకటించబడింది.

—బొంబాయి బజారులో వెండి ధర హఠాత్తుగా తగ్గినందువల్ల, బులియన్ మార్కెట్ ప్రమాదస్థితిలో ఉందని బొంబాయి బులియన్ ఎసోసియేషన్ ప్రకటించింది.

—తమ అధీనంలో ఉన్న విద్యుచ్ఛక్తి సరఫరా కేంద్రాలను మద్రాసుప్రభుత్వం స్వాధీనం చేసుకోడం అక్రమమంటూ రాష్ట్రంలోని పది మున్సిపాలిటీలు మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

మంగళవారం, మే 15:

—చీనాకు యుద్ధవస్తువుల ఎగుమతిని నిషేధించాలని అమెరికన్ సెనేట్ ఐక్యరాజ్య సమితిని ఆదేశించింది.

—అమెరికన్, బ్రిటిష్, ఫ్రెంచి సైనికాధిపతుల రహస్యసమావేశం సింగపూర్‌లో ప్రారంభమయింది. దూరప్రాచ్య దేశాలలో మిలిటరీ చర్యలలో సహకారం సాధించడం ఈ సమావేశం ఉద్దేశం.

—పర్షియా నూనెపరిశ్రమ సందర్భంలో బ్రిటిష్‌ప్రభుత్వం అవలంబించనున్న విధానాన్ని గురించి అమెరికన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది.

—చీనాదేశంనించి పారిపోయి బర్మా చేరిన పదివేలమంది జాతీయ చీనా సైనికులను బర్మానుంచి పంపించివెయ్యవలసిందని బర్మా ప్రభుత్వం అమెరికన్ ప్రభుత్వాన్ని కోరినట్లు వాషింగ్టన్ వార్త.

—భద్రతామండలి యుద్ధవిరామ తీర్మానానికి సిరియా, ఇజ్రాయల్ ప్రభుత్వాలు రెండూ సమ్మతించాయి.

—ఇజ్రాయల్ పార్లమెంటు సమావేశంలో ఉండగా పార్లమెంటు భవనాన్ని దగ్ధం చెయ్యడానికి యత్నం జరిగింది.

—కొమరూప్ జిల్లా సరిహద్దులో (అస్సాం) 33 చతురపు మైళ్ళ మేర భూభాగాన్ని (దేవనగరి అనే పట్టణంతో సహా) భూటాన్ రాజ్యానికి ఒప్పగిస్తూ ఒక శాసనం భారత పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబడింది.

—సిమెంటుపై కంట్రోల్ తొలగించవలసిందని దక్షిణభారత వాణిజ్యసభ చేసిన విజ్ఞప్తిని భారత ప్రభుత్వం నిరాకరించింది.

—వెండి ఎగుమతిని భారత ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. అయితే వెండి వస్తువుల ఎగుమతి పూర్తిగా నిషేధించబడలేదు.

—చేనేతవస్త్రం ఎగుమతికి కొత్త లైసెన్సింగ్ పద్ధతిని భారతప్రభుత్వం ప్రకటించింది.

—నేటితో మద్రాసు రాష్ట్రంలో చేనేతవారి సత్యాగ్రహం ప్రారంభమై మాసం పూర్తయింది. సత్యాగ్రహులసంఖ్య నానాటికీ పెరుగుతోంది.

—దక్షిణభారత రైల్వే కార్మిక సంఘాధ్యక్షుడు యం. కళ్యాణసుందరంగారిని మద్రాసు హామీపైన విడుదలచెయ్యాలని హైకోర్టు ఉత్తరువు చేసింది.

—కాంగ్రెస్‌లో ఐక్యత సాధించడం కోసం ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ప్రత్యేక సమావేశం జరపాలని కొందరు సభ్యులు సూచించారు.

బుధవారం, మే 16:

—కొరియాలో కమ్యూనిస్టులు తిరిగి ఉద్ధృతంగా దాడి ప్రారంభించారు.

—కమ్యూనిస్టు చీనాపైన పూర్తి వ్యాపార నిర్బంధం అసాధ్యమని బ్రిటిష్ ప్రతినిధి సర్ గ్లాడ్విన్ జెబ్ న్యూయార్క్‌లో చెప్పారు.

—హాంకాంగ్‌నించి చీనాకు రబ్బరు ఎగుమతులు నిలిపివేయబడినాయి.

—ఉత్తర అట్లాంటిక్ పాక్టు దేశాల ప్రతినిధులు సైనిక వ్యూహాలనుగురించి రహస్యంగా లండన్‌లో చర్చించారు.

—జపాన్ ఆర్థికాభివృద్ధికీ, సైనికబలాభివృద్ధికీ జపాన్ అమెరికాలమధ్య ఆర్థిక సహకారంతో ఒక ప్రణాళికను గురించి ఒప్పందం కుదిరింది.

—ఇరాక్ విమానదళం సిరియా రక్షణకు వినియోగించబడుతుందని ఇరాక్ ప్రధాని ప్రకటించాడు.

—ప్రపంచ ఆరోగ్యసంస్థలో జపాన్, జర్మనీ, స్పెయిన్‌లు ప్రవేశపెట్టబడినాయి.

(48-వ పేజీ చూడండి)

యూరప్‌లో అమెరికా ప్రచారం

★

మోర్టిమర్ ఒక్‌స్ట్రాఫ్

[రష్యనులు అమెరికాను జయించిన వైనాన్ని గురించి 1980 ప్రాంతాల ఎవరో ఒకరు రాయబోతారు. ఆ రచన ఊజ్జాయింపున ఈవిధంగా ప్రారంభమవుతుంది: "ఒకదేశపు ప్రజ వైజ్ఞానికంగానూ, నైతికంగానూ మరొక దేశపు ప్రజను ఇంతగా లోబరుచుకున్న నిదర్శనం ప్రపంచచరిత్రలో ఎక్కడా లేదు. రష్యనులు చేసిన ప్రతిదానికీ మనం విరుద్ధంగా చేశాం. ఆఖరుకు (మన) మతసిద్ధాంతాలు కూడా తలకిందులు చేసిన రష్యన్ సిద్ధాంతాలే - అమెరికాలో క్రైస్తవుడు ఆచరించవలసిన తొలిధర్మం శత్రువును ప్రేమించడం కాదు, కమ్యూనిస్టులను ద్వేషించడం- ఆతరవాత, సాధ్యమైతే, వారి కొరకు ప్రార్థించడం" -1949 ఆగస్టు: అంట్లాంటిక్ మంత్లీలో" ఆర్చిబాల్డ్ మక్‌లీష్]

మార్షల్ సహాయం ప్రారంభమైన కాలంలో ఆ సహాయం పొందే ప్రభుత్వాలు, అమెరికాకోరిక పై, "యూరప్ పునర్నిర్మాణానికిగాను అమెరికా ఇస్తున్న సహాయ సహకారాల" విషయమై ఆయా దేశాలలో వార్తలు విస్తరింపజేయడానికి తోడ్పడగలమని మాట ఇచ్చాయి. ఈ వాగ్దానాన్ని పురస్కరించుకొనే ఇ. సి. ఏ. (ఇకనమిక్ కో - ఆపరేటివ్ ఎడ్మినిస్ట్రేషన్ - మార్షలు ప్రణాళిక ననుసరించి యూరప్‌లో అమెరికన్ ప్రభుత్వం స్థాపించిన ఆర్థికసహాయ నిర్వహణ కార్యాలయం) వారు ఒక ప్రచారశాఖను ఏర్పాటుచేశారు. ప్రచ్ఛన్నయుద్ధం వెంట రోషాలు పెరిగినకొద్దీ ఈ ప్రచారశాఖ యొక్క పరిణామం ఆందోళనాజనకంగా తయారయింది.

ఆదిలో దీని గొంతుక సౌమ్యంగానూ, వినయంగానూ ఉండేది. "పునర్నిర్మాణోద్యమం గురించి సాధ్యమైనంతమందికి తెలియజేయడం ప్రచారంయొక్క ప్రథమ కర్తవ్య"మని 1948లో ఇ. సి. ఏ. (అమెరికన్) కాంగ్రెసుకు నివేదించింది. కాని మరుసటి సంవత్సరం కాంగ్రెసుకు అందచేసిన నివేదికలో "ఔద్ధత్యంతో కూడుకున్న వార్తాప్రచార కార్యక్రమం" అవలంబించడం అవసరమని సూచన చేయబడింది. ఈ దశవరకు ఆశయాలు ఆర్థికరంగాన్ని అధిగమించలేదని చెప్పవచ్చు. "సహాయం పొందే ప్రభుత్వాలను ఉత్సాహపరచి కార్యోన్ముఖులను చేయడం ఇ. సి. ఏ. యొక్క లక్ష్యమని ప్రకటించబడింది. కాని 1950 జూనునాటికల్లా (ప్రచారంలో) రాజకీయధోరణి ప్రవేశించింది. ఇ. సి. ఏ. కాంగ్రెసుకు పంపిన నివేదికలో ఈవిధంగా ఉన్నది.

"పునర్నిర్మాణాభివృద్ధి సాగినకొద్దీ దాని ప్రభావం అనేక రాజకీయవ్యవహారాలపైనా, రాజకీయ వ్యవహారాలప్రభావం పునర్నిర్మాణాభివృద్ధిపైనా ప్రసరించసాగింది...దీనిమూలంగా ఇ. సి. ఏ. ప్రచారంలో కొన్ని మార్పులూ, సంస్కరణలూ చెయ్యవలిసివచ్చింది. మార్షల్ ప్రణాళిక అమెరికా విదేశాంగవిధానంలో ఒక ముఖ్యాంశమని ఈసరికి యూరప్‌లోని ప్రజాసామాన్యం గుర్తించింది. ఇకముందు దానివిషయం అదే దృష్టితో వ్యవహరించాలి. కనుక, సహాయంపొందే ప్రభుత్వాలు స్నేహభావంతోనూ, సహకారదీక్షతోనూ ఉన్నప్పటికీ అనేక ప్రాంతాల వార్తాప్రచారబాధ్యతను ఇ. సి. ఏ. మాత్రమే నిర్వహించవలసి ఉంటుంది."

శాంతిసమయంలో ఒక ప్రభుత్వం (అమెరికాప్రభుత్వం) ఇతర దేశాలలో ఇంత భారీగా రాజకీయ ప్రచారయంత్రాన్ని నెలకొల్పడం కనీ వినని విషయం. దీనికిగాను మంజూరయిన ఖర్చు 1949 లో 3,60,000 పౌనులు. 1950 లో ఈ ఖర్చు 18,00,000 పౌనులకూ, 1951 లో సుమారు 45,00,000 పౌనులకూ పెరిగింది. దీనిఫలితంగా తమ ప్రచారం ఏదో రూపంలో పశ్చిమ యూరప్ ప్రజలలో పదింట తొమ్మిదిమందికి అందుతున్నట్టు ఇ. సి. ఏ. చెప్పుకోగలుగుతున్నది. అదికాక ఇ. సి. ఏ. యొక్క "ప్రథమ కర్తవ్యం" ఏనాడో వెనుకపడిపోయింది. కమ్యూనిజంగురించి యూరోపియనులు ఏమనుకోవాలని అమెరికా భావిస్తున్నదో తెలియజేయడానికి మోటు సాధనంగా ఇ. సి. ఏ. ప్రచారం ప్రస్తుతం వినియోగపడుతున్నది.

అనేకమంది యూరోపియనులకూ, కొందరు అమెరికనులకూ కూడా కలగగల సందేహం లేవంటే, ఏ అధికారాలను పురస్కరించుకుని ఇ. సి. ఏ. ప్రస్తుత ప్రచారం ఈ స్వరూపం ధరించింది? ఈ ప్రచారానికీ, జనరల్ ఐసెన్‌హోవర్ కార్యాలయంవారు ఏర్పరచబోయే ప్రజా వ్యవహారశాఖకూ ఉండగల సంబంధం ఎటువంటిది? ఇ. సి. ఏ. సంస్థయొక్క ఆయుర్దాయం మరికొంతకాలం పొడిగించే పక్షాన, అట్లాంటిక్ ఒడంబడిక దేశాలు తమ పునరాయుధధారణాప్రచారం తామే చేసుకోవడానికి కార్యాలయం ఒప్పుకొంటుందా లేక ఆ పని తానే చేసిపెడుతుందా? ఈ ప్రశ్నలకు ఇప్పటివరకూ బాధ్యతాయుతమైన సమాధానాలు లేకపోవడంచేత, "స్వాతంత్ర్యరక్షణ" అన్నపదాన్ని తనకు తానే నిర్వచించుకొని ఇ. సి. ఏ. పని సాగించే ధోరణిలో ఉన్నట్టు కనబడుతుంది.

ఇటీవలి ధోరణులు కొన్ని ఆందోళనకరంగా ఉన్నాయి. ఉదాహరణ: ఇటీవల ఫ్రెంచి కామెరూన్స్‌లో జరిగిన స్వతంత్ర ట్రేడ్ యూనియన్ల అంతర్జాతీయ ఫెడరేషన్ సమావేశంయొక్క ఫలితాలను గురించి రేడియోప్రసంగం వ్రాయమని ఇ. సి. ఏ. అధికారి ఒకాయన ఒకానొక స్వతంత్ర రచయితను కోరాడు. ఏవిధంగా వ్రాయాలని రచయిత అడిగగా, అధికారి, "మార్షల్ సహాయాన్ని పేర్కొనవలసిన అవసరం లేదు. ఈ నల్లవాళ్లు (ఆఫ్రికనులు) తమ కార్మికులను ఎలా సంఘటితపరుస్తున్నదీ ఉన్నది ఉన్నట్టు చెప్పడమే మన ఉద్దేశం. అయితే ఈ సమావేశాన్ని భగ్నం చేయడానికి కమ్యూనిస్టులు ఎలా ప్రయత్నించారో మీకు తెలిసేఉంటుంది. అది మాత్రం వివరించాలి," అని సమాధానం చెప్పాడు. అంటే, ఈప్రసంగంలో ప్రధానాంశం కమ్యూనిస్టు వ్యతిరేకప్రచారమన్నమాట; ఆఫ్రికాకార్మికులూ, వారి సమస్యలూ, సక్రమమూ అక్రమమూ అయిన వారి కోరికలూ అప్రధానాంశాలు.

ఇ. సి. ఏ. కార్మిక ప్రచారాన్ని విస్పష్టంగా వివరించమని కోరగా ఇదే అధికారి ఈవిధంగా చెప్పాడు: "యూరప్

ప్రజలకు కార్మికులనుగురించీ, స్వతంత్ర ట్రేడ్ యూనియన్ అభివృద్ధినిగురించీ సాధ్యమైనన్ని వార్తలు ఇవ్వడమే." ఇది కూడా ఏమంత విస్పష్టంగా లేదని తోచింది కాబోలు ఆ అధికారి ఈవిధంగా అన్నాడు: "ఒక్క ముక్కలో చెప్పాలంటే తూర్పు పడమరల మధ్య ఘర్షణ అన్నమాట." ఇ. సి. ఏ.కు చెందిన మరొక అధికారి - ఒకటవ పార్లమెంటు డైరెక్టరు - మరింత కుండపగలేసి మాట్లాడుతూ ఇటీవల పారిస్ లో కొందరు అమెరికన్ల, యూరోపియన్ల సమక్షాన ఈ విధంగా చెప్పాడు: "ఇప్పుడు నా కెంతో ఆనందంగా ఉంది. ఇక ముసుగులో గుద్దులాట లేమీ లేవు. ఇక బాహాటంగా కమ్యూనిస్టులతో తలపడవచ్చును." ఇ.సి.ఏ.కమ్యూనిస్టులతో తలపడేటందుకు అవలంబించే సాధనాలలో ఒక టేమిటంటే *L'humanite* పత్రికకు ప్రతిగా మరొక పత్రిక స్థాపించి, ఆ పత్రిక చెప్పే విషయాల నే తల్లకిందులుగా ఈపత్రికచేత చెప్పించడం.

ఇ. సి. ఏ. వర్తమాన ప్రచారధోరణి కేవలం ఈ ఉదాహరణమాదిరిగా ఉండక పోవచ్చు. కాని ఈప్రచారమంతటా అమెరికాలో ఉన్న గుడ్డిఉద్రేకమూ, ఉన్మత్త మనస్థితీ ప్రతిబింబిస్తోంది. మార్షల్ పథకం యొక్క ప్రధానాశయాలలో "పునర్నిర్మాణానికి" స్థానం లేకుండాపోయింది గనక, ఇప్పటి అమెరికా గొంతుకను తమ ప్రజలకు వినిపించే బాధ్యతనుండి యూరప్ ప్రభుత్వాలు విమోచనం వాంఛించవచ్చు. అమెరికా ప్రభుత్వశాఖలు తమ దేశంలో తమ చిత్తం వచ్చిన ప్రచారం చేసుకోవడానికి ఎట్టి ఆక్షేపణా ఉండదు. కాని తొలి మార్షల్ పథకాన్ని బట్టి యూరప్‌లో విదేశీ ప్రభుత్వం (అమెరికా) ఇంత వివాదాస్పదమైన, ఉద్రేకపూరితమైన ప్రచారాన్ని పత్రికలద్వారానూ, రేడియోద్వారానూ, ఫోటోలద్వారానూ, సినిమా చిత్రాలద్వారానూ సాగించడానికి ఎట్టి ఆధారమూ లేదు. ఇంత బొంగురుపోయిన గొంతు మౌనం వహించడం మంచిది.

(—న్యూస్టేట్స్‌మన్ అండ్ నేషన్. మే 5)

★

పిల్లల్ని కనే సమస్య:

★

శ్రీ వల్లభనేని నారాయణరావు

పెళ్లయి ఒక నెల్లాళ్లయినా గడవకముందే
పెళ్లానికి నాకూ ఒక పెద్ద సమస్య.

పిల్లల్ని కందామా వద్దా? అని.
పెళ్లామన్నది: "పిల్లలు లేకుండా యెల్లా? ఎబ్బె!
గల్లంతుగ పిల్లలతో నే
యిల్లెప్పుడు కలకలలాడును."

నేనంటిని: "పిల్లలు లేకుంటే యెంతసుఖం!
నేనూ నువ్వే యింట్లోవుంటే, మరి యెవ్వరు లేకుంటే
మన యిల్లే రాజ్యం అయితే, నువ్వేదాన్లో రాణివి అయితే
నేనప్పుడు రాజును అయితే"......

చప్పరించి పెళ్లా మప్పుడు, చెప్పినన్ను దెప్పిం దిట్టులు:
"అబ్బో! ఓయబ్బో! మీ
అబ్బకూడ యిట్లే అంటే
మీ అమ్మ కూడ ఊ కొట్టుంటే,
మీ రెక్కడుండి వుందురో గద మరి!"

నాకు మండి నేనిట్లంటిని: "నీకు బుద్ధిలేకేగానీ
నే పుట్టక పోయేవుంటే, నీకు మొగుడి నవకేపోతే
ఏ బాధా లేకేపోవును." "ఎందుకండీ అట్లావాగుడు?
ఏం లాభం యీ మాటలతో? ఏదోఒకటి తేల్చే సేసుకు
కందామో, లేకుందామో, కంటే కలిగే బాధలవేవో
కనకుంటే కలిగే చింతలవేవో,
అన్నీ తేల్చుకు ఆచరించుదాం" అని ఆదేశించెను పెళ్లాం.

అపుడావరించె ఆలోచనలను, అటాయిటా మొగ్గడమంటూ,
ఆలోచనలను అల్లుకుపోతే, అటుకొన్నీ యిటుకొన్నీ మరి!
అన్నీ అవసరమే అవుతున్నయ్, అటో యిటో మొగ్గడమెట్లా?

★ అదీ - ఇదీ ★

ఇటలీ :

ఇటలీలో ఈ రోజున 20 లక్షలమంది నిరుద్యోగు లున్నారు. యూరప్‌లో మరే దేశంలోనూ ఇంతమంది ఉద్యోగహీనులు లేరు. ఫాసిస్టు పాలనకాలంలోకంటె వారి సంఖ్య రెండింతలైంది. ఫాసిస్టు ప్రభుత్వం నిరుద్యోగతను తగ్గించటానికి ఆయుధనిర్మాణ కార్యక్రమంలాంటివి అమలుచేసేది. ఈ రోజున కూడా మిగతా అట్లాంటిక్ రాజ్యాలతోపాటు ఇటలీకూడా పునరాయుధ ధారణ కార్యక్రమం అమలు చేయవచ్చు. దీనివల్ల నిరుద్యోగసమస్య కొంత తగ్గినా, ద్రవ్యోల్బణం, జీవనస్థాయి ఇంకా కిందికి పోవటం ప్రారంభమవుతుంది.

యుద్ధానంతరంనుంచీ ఇటలీలో పరిస్థితులు చాలా మారిపోయాయి. ఉద్యోగం దొరకటం దేవుడిదయమీద ఆధారపడి వుంటుందని ఇప్పుడు ప్రజలు నమ్మటం లేదు. దీనివల్ల వామపక్షాలు బాగా బలపడ్డాయి. సాంఘిక, ఆర్థిక సంస్కరణల వల్ల జీవితం మారుతుందని వారు ప్రజాబాహుళ్యానికి నమ్మకం కలిగించారు. దక్షిణ ఇటలీలో ఒకప్పుడు బానిసత్వంలో మగ్గుతూ, మన కర్మ ఇంతేఅని నిట్టూర్చే రైతులు ఈనాడు బంజరుభూములను బలాత్కారంగా లాక్కొని వ్యవసాయం చేస్తున్నారు. దీన్నిబట్టే ఇటాలియన్ల మనస్తత్వంలోవచ్చిన మార్పును గ్రహించవచ్చు. (నేషన్-ఏప్రిల్ 7)

రాజకీయ పగ్గాలు :

ఇండియాకు మిలియన్ టన్నుల ధాన్యం ఉచితంగానూ, మరో మిలియన్ టన్నులు ఋణంగానూ ఇవ్వదలచిన బిల్లును అమెరికన్ సెనేటు చర్చిస్తున్న సందర్భంలో రిపబ్లికన్ సెనేటరు జార్జి ఐకెన్ ఈ ముక్కలన్నాడు: "ఇండియాలో పౌరహక్కుల కార్యక్రమం అమలు జరపాలని ఈ బిల్లులో ఒకభాగం కోరుతున్నది. జాతి, మత, రాజకీయ విభేదాల విచక్షణ లేకుండా ఈ ధాన్యాన్ని ప్రజలకు పంచాలని బిల్లులోని ఆ నిబంధన కోరుతున్నది. అలాంటి పౌరహక్కుల కార్యక్రమం అమెరికాలో అమలుచెయ్యాలని తలపెడితే ఆమోదించని ఈ సెనేట్ ఇండియాలో దాన్ని అమలు చేయించాలని ఎందుకు కోరుతున్నది?

(వాషింగ్టన్ వార్త - మే 14)

పేదలను పిండే ప్రయత్నాలు

పన్నుల భారం పేదలపైకి తోయడానికిగాను (అమెరికాలోని) అనేక రాష్ట్ర రాజధానులలో కొద్ది మాసాలుగా యత్నాలు సాగుతున్నాయి. రాబడిమీద విధించబడే పన్ను నూరింట 25 వంతులు మించకుండా చూడడానికి వెస్టర్న్ టాక్స్ అసోసియేషన్ అనే సంస్థ ఒకటి సాగించిన యత్నం ఆరు సంవత్సరాలక్రితమే ఒకసారి భగ్నమయింది. రాష్ట్ర శాసనసభలు జరుగుతున్న మాంటానా, మినెసోటా మొదలైన అనేక రాష్ట్రాలలో ఈ సంఘం ఇప్పుడు మళ్ళీ అదే యత్నాన్ని సాగిస్తున్నది. పన్నులను పరిమితంచేస్తూ రాజ్యాంగ సవరణ జరపడానికిగాను ఉన్న రాష్ట్రప్రభుత్వాలలో మూడింట రెండువంతుల సంఖ్యచేత ప్రతిపాదన చేయించాలని ఈ సంఘం యత్నం. రాబడిపై నాలుగోవంతు మించి పన్ను వేస్తే వ్యాపారసంస్థలకూ "నిరుత్సాహం"జనిస్తుందనీ, ఉత్సాహం పెంచాలంటే పన్నులు పరిమితం చెయ్యాలనీ వారి వాదం.

పేదలను పిండే ఈ ప్రయత్నం 1943 లో తీవ్రదశ అందుకున్నది. 17 రాష్ట్రాలు ప్రతిపాదనను ఆమోదించాయి. కాని 1945 లో అయిదు రాష్ట్రాలు ప్రతిపాదనను ఉపసంహరించుకోగా ఈ ప్రయత్నం విఫలమయింది. ఇది చాలా హేయమైన ప్రతిపాదన. 1945 లో ఈ ఆలోచన బట్టబయలయినప్పుడు, శక్తినిబట్టి పన్నులు కట్టే ప్రజాస్వామిక సిద్ధాంతాన్ని భగ్నంచెయ్యడానికి ఈ ప్రయత్నం జరుగుతున్నదని స్పష్టమయింది. కాంగ్రెసు ద్వారా ఎన్నడూ సాధ్యంగాని రాజ్యాంగ సవరణ రాష్ట్ర శాసనసభల ద్వారా సాధించాలని చూస్తున్నారని 1945 లో బయటపడడమే (ప్రయత్న వైఫల్యానికి) చాలింది. రాజ్యాంగ సవరణ రాష్ట్రాలలో మూడింట రెండువంతులు కోరితే జరుగవచ్చు. కాని ఈ పద్ధతి ఎన్నడూ అమలు జరగలేదు. ఈ విధంగా పన్నులు పరిమితం చేసినట్టయితే ప్రభుత్వానికి పన్నుల రాబడిలో 1500 కోట్ల డాలర్లు తరుగు ఏర్పడుతుంది. ఈ లోటును పూడ్చాలంటే తక్కువ రాబడులవారిపై పన్ను పెంచీ, ఎక్సయిజు పన్నులు హెచ్చించీ, అన్ని వస్తువులపైనా అమ్మకపుపన్ను వేసీ లోటు భర్తీచెయ్యాలి. కొద్దిమందికి మరింత సౌఖ్యాలుచేకూర్చగలందులకై అనేక లక్షల జీవనప్రమాణాలను తగ్గించాలని వెస్టర్న్ టాక్స్ అసోసియేషన్ ప్రయత్నిస్తున్నది. ఇట్టి ప్రయత్నాన్ని రాష్ట్ర శాసనసభలు భగ్నంచేయడం మంచిది.

—31 మార్చి "నేషన్" సంపాదకీయం.

బ్రిటిష విదేశాంగ నీతి

...రక్షణకూ, "కమ్యూనిజమును నిగ్రహించే" విధానానికీ ముడిపెట్టడంవల్ల ఆయుధోత్పత్తికి పరుగులు తీయడమూ, బలాబలాల పోటీ ప్రారంభమయాయి. సగం ప్రపంచాన్ని వశపరచుకున్న కమ్యూనిస్టు ప్రభుత్వాలతో వ్యవహరించే సరిఅయిన విధానం మరేదైనా కావచ్చు గాని ఇది మాత్రం తప్పపద్ధతి. సోషలిస్టు పార్టీ అని చెప్పకొనే పార్టీ దీనిని అనుసరించడం స్వయంనాశనానికీ, నైతిక పైజ్ఞానిక పతనానికీ దారితీస్తుంది.

గ్రీసు, ఇండోచైనా, చైనా, కొరియా, మధ్యప్రాచ్యంలోని ఆంగ్లో అమెరికను స్వార్థమూ, ఆఫ్రికాలో అమెరికా విస్తరణ మొదలైన అనుభవాలు చూస్తే ఈ పద్ధతి విప్లవనిరోధక మైనదీ, అక్రమ జోక్యంతో కూడుకున్నదీ, దురాక్రమణాయుతమైనదీ, సామ్రాజ్యవాద వాసనగలదీ అని తేలిపోతోంది.

లేబరువామపక్షంవారూ, ఆ పక్షాన్ని నడిపే నాయకులూ ఎదుర్కొనవలసిన ప్రధాన సమస్య ఇదే. బ్రిటిషు విదేశాంగ విధానంలోనుంచి "కమ్యూనిజమును నిగ్రహించడం" ఎత్తివేసి, కమ్యూనిస్టు దేశాలతో కమ్యూనిస్టేతర దేశాలు మంచిగా కాలక్షేపం చేసే పద్ధతి ప్రధానాంశంగా ప్రవేశపెడితేనే తప్ప విజయం మాట అటుంచి మనుగడే అనుమానాస్పదమై పోతుంది. విభేదాల పరిష్కారమూ, కమ్యూనిజముగురించి రాజీపద్ధతి అవలంబించడమూ ప్రపంచసమస్య అని బ్రిటను సూచించాలి. మనం దేన్ని రక్షిస్తామన్నది మన విదేశాంగ విధానంద్వారా నిర్ణయమవుతుంది గనక మన విదేశాంగవిధానంతో అమెరికా కలిసివచ్చినంత మేరకే మనం రక్షణవిషయంలో అమెరికా చెప్పచేతల్లో ఉంటామనే సూత్రం అమలు జరగాలి. ఈ సూత్రం అమలు జరగనిపక్షాన దూరప్రాచ్యంనుంచి మన బలాలు ఉపసంహరించడానికీ, అట్లాంటిక్ ఒడంబడికనుంచి బయటికి వెళ్ళడానికీ, శాంతిని సాధించడం విషయంలో అమెరికా మనతో ఏకీభవించని పక్షాన అమెరికన్ విమానబలాన్ని (బ్రిటను నుండి) స్వదేశానికి పంపివెయ్యడానికీ మనం సిద్ధపడాలి.

—మే 12 "న్యూస్టేట్స్‌మన్ లో" కే. జిలియాకస్.

కథానిక:

సెక్సువిజ్ఞానం

శ్రీ భమిడిపాటి వెంకటరావు

సీను వాళ్లవూరు హైస్కూల్లో ఫస్టు ఫారం చదువుకొనే రోజుల్లో అతని యింటికి ఎదురుగుండా ఒక సూపరువైజరుగారుండేవారు. ఆయన కుమార్తె శ్రీలక్ష్మి కూడ ఆ హైస్కూల్లోనే 5వ క్లాసు చదువుతూండేది. అమ్మాయి అప్పట్లో చిన్నపిల్లవటంచేత పరికిణీలు, గౌన్లు తొడుగుకొని బడికి వచ్చేది. సీనుకూడ అప్పుడు చిన్న ఫేంట్లు అర్ధచేతుల లాల్చీలు తొడుగుకొనేవాడు. సీను, లక్ష్మి ఇద్దరూ అందమైనవాళ్లే, వారిద్దరూ కలిసి కాకపోయినా ఒకేసారి బడికి వెళ్లేవారు. సీను అమాయకంగా 'లక్ష్మిని నాకిచ్చి వాళ్లమ్మ పెండ్లిచేస్తానన్నది' అనేవాడు. ఎప్పుడైనా సీను అమ్మ లక్ష్మితో 'మా అబ్బాయిని పెళ్లి చేసుకుంటావా' అని అడిగితే ఆ అమ్మాయి అమాయకంగా నవ్విన రోజులుకూడ లేకపోలేదు.

ఆ సంవత్సరం వేసంకాలంలో లక్ష్మి వాళ్లనాన్నకు హిమగిరి బదిలీ అయింది. చాలాకాలంవరకు లక్ష్మి అతని జ్ఞాపకపథమునుండి తప్పింది. ఈ మధ్యకాలంలో ఎప్పుడూ అతను లక్ష్మిని తలచలేదు. కారణం అతనిబాల్యములోని అనుభూతులు అమాయకవాతావరణానికి సంబంధించినవి కాబట్టి.

ఈసంవత్సరం సీను అదే హైస్కూల్లో ఫైనలు పరీక్షకు కూర్చున్నాడు. మనిషికూడ కొంచెం పొడవుగాను, బలంగాను తయారయ్యేడు. అప్పుడే అతనిలో యువకచిహ్నాలు కనిపిస్తున్నాయి. ఈ మధ్య అతను పత్రికలు, నవల్సుకూడ చదువుతున్నాడు. సెక్సుపత్రికలంటే అతనికి ప్రత్యేకాభిమానము.

ఒకనాడు అతను ఏదో పత్రికలోని ఒక కథ చదివేడు. చిన్నప్పుడు క్లాసు మేట్సు అయిన ఇద్దరు యువతీ, యువకులు ఒక రైల్వే కంపార్టుమెంటులో కలిసికుంటారు. మాటల సందర్భంలో 'తన భర్త కావలసినంత ఆస్తివదలి పరలోకయాత్ర చేసేడని చెపుతుంది. కొంతసేపు యిద్దరూ మనసిచ్చి మాట్లాడుకుంటారు. తరువాత యువతి, యువకుని తన ఊరు రమ్మని ఆహ్వానిస్తుంది. యువకుడు అంగీకరిస్తాడు. ఇద్దరూ యువతి ఊరువద్దనున్న స్టేషనులో దిగుతారు. తరువాత ఒకనాడు వారిద్దరూ టాకీసులో ఒకరి ప్రక్క నొకరు కూర్చునిపోతూంటే ఆ కథారచయిత చూసి తాను చూసినవి పాఠకులకు బహూకరిస్తున్నానని ఉపసంహరించుకొంటాడు."

ఈ కథ చదివితే అతడికి చిన్నప్పటి లక్ష్మి జ్ఞాపకం వచ్చింది-ఇప్పుడామె ఎక్కడుంది? ఎలాగుంటుంది? ఎంత పొడవుంటుంది? ఆమెకు పెండ్లి అయిందా? తానింకా జ్ఞాపకం ఉంటాడా? భర్త.

ఈ విధంగా ఆలోచిస్తూంటే అంతరాయంగా వాళ్లమ్మ "ఒరే సీనూ మన ప్రక్క సందులోని గురునాథంగారింట్లో ఏమైనా ఖాళీలున్నాయేమో కనుక్కోనిరా?" అని చెప్పింది.

సీను అడిగేడు "ఇల్లెవరికమ్మా?" అని.

"వారికేరా? మన యింటికి ఇదివరకు ఎదురుగా ఉన్న సూపరువైజరుగారికి. వారికి మళ్లీ ఈ వూరు బదిలీ అయిందిట. అతని భార్య పాతస్నేహాన్ని పురస్కరించుకొని నా చేరికలో ఎక్కడైనా ఇల్లు చూడమని రాశేరు" అని చెప్పింది వాళ్లమ్మ.

సూపరువైజరుగారంటే నిర్ఘాంతపోయి అనుమాననివృత్తికోసం అడిగేడు "అంటే లక్ష్మివాళ్లనాన్నేకదా అమ్మా" అని. మళ్లీ పొరపాటుపడ్డవాడికి మల్లే నోరు నొక్కుకొన్నాడు.

"వాళ్లేరా అబ్బీ అప్పుడే మరచిపోయేవా?" అంది.

"అన్నట్లు మన ప్రక్కయింటి ప్రక్కయింట్లోనివారు ఈ వేళ ఖాళీచేస్తున్నారు కాదమ్మా, ఆ యిల్లు కనుక్కోనిరానా?" అన్నాడు.

"బాగా జ్ఞాపకం చేశేవు. మన యింటి ప్రక్కనుంటే తరచు కష్టసుఖాలు మాట్లాడుకోవచ్చు. వాళ్ళ ఆడవాళ్లు చాల మంచివారుకూడాను. పోయి త్వరగా కనుక్కోనిరా?"

సీను ఒక్క గెంతులో పైకి దాటేడు.

2

ఆ వేళ సీను, మిత్రుడు రామారావుకోసం చూస్తూ తనవీధిఅరుగుమీద కూర్చొన్నాడు. అప్పుడే మేడదిగి వచ్చి, తన యింట్లోకి ఒక అందమైన యువతి చిన్నపిల్లను నడిపించుకొని వెళ్లుతున్నాది. మంచి చీర, నిడుపాటి ఉంగరాల కురులు అవీని! ఆ అమ్మాయిని తానిదివర కెక్కడో చూసినట్లుంది. కాని జ్ఞాపకం రాలేదు. ఆ వేళ సాయంత్రం యింటికి వచ్చేక తల్లి నడిగేడు. "ఆ అమ్మాయెవర"ని.

"అప్పుడే మరచిపోయేవుట్రా ఆ పెద్దపిల్ల శ్రీలక్ష్మి. సూపరువైజరు గారి పెద్దమ్మాయి, రెండవది వాళ్ల చెల్లెలు." చెప్పింది.

వెంటనే మేడమీదకు వెళ్లి మంచి బట్టలు వేసుకొని చిత్తుగా ముస్తాబై సూపరువైజరుగారి యింటివైపు బయలుదేరేడు. ఆ అమ్మాయి చిన్నపిల్లను ఆడిస్తూ యితన్ని చూసి మొఖము అటు తిప్పింది. సీను గమనవేగాన్ని తగ్గించి పోజు మార్చి మళ్లీ చూసేడు. ఈసారి ఆ అమ్మాయి పెడమొగం పెట్టలేదు. చూపులతోటే సీను ఆ కొద్దిచోటు అతిక్రమించేడు. సీను తిరుగు ప్రయాణంలోకూడ ఆమెవేపు అదోలా చూసేడు. ఆమెనుంచికూడ జబాబు ముట్టిందని భావించుకొన్నాడు. ఆ మరునాటినుంచి అతనికి వీలయినప్పుడల్లా కార్యక్రమ మదే!

ఒకనాడు అతను భోంచేస్తూంటే ప్రక్కింటి మీనాక్షి మజ్జిగకు వచ్చి వాళ్లమ్మను లక్ష్మికి పెళ్లి అయిందా అని అడిగింది. సీను జబాబుకు చెవులు నిక్కబొడుచుకొని వాళ్ళమ్మవేపు చూసేడు.

నిరుడేడు అయిందిటండి. లక్ష్మిభర్తకు పట్నంలో 300 రూపాయిలు జీతంఅంట" అని చెప్పింది. మీనాక్షి "దేనికేనా పెట్టిపుట్టాలమ్మా పురుషుని అదృష్టం స్త్రీ పూర్వజన్మసుకృతాలమీద ఆధారపడి ఉంటుంది. లక్ష్మి క్రిందటి జన్మలో బంగారుపూవులతో పూజ చేసిందేమో. ఎవరు చూసొచ్చేరు" అని నిష్క్రమించింది.

సీను నోటినుండి పిడచ జారింది. అన్నం సయించటంలేదు. వాళ్లమ్మ చూసి "ఏమిరా బాబూ తిండి తినలేకపోతున్నావు" అని అడిగింది. వంట్లో బాగులేదన్నాడు. అయితే వదిలేయ్. బలవంతంగా తినకు. అటూయిటూ తిరగక మేడమీద కుదురుగా కూర్చో; కాఫీచేసి పైకి పంపిస్తా"

నని చెప్పింది వాళ్ళమ్మ. బడిగంటలు వినిన విద్యార్థిలాగ సీను వాళ్ళమ్మనుండి తప్పుకొని మేడెక్కేడు.

శ్రీ లక్ష్మికి పెండ్లి అయిందా? మరి భర్త వుంటే తనవేపు చూస్తున్నా దేం? అమ్మ అబద్ధం చెప్పిందా? చెప్పదే. కాగా ప్రక్కింటి మీనాక్షితో పరాయిపిల్ల-శ్రీ లక్ష్మినుగురించి వేళాకోళంగా చెబుతుందా? శ్రీ లక్ష్మి భర్త 300 రూపాయిల జీతగాడా? తనో! యింకా చదువు స్కూలు ఫైనలే. అతని కేదో జ్ఞాపకంవచ్చి మళ్ళీ పాతప్రేమకథలు తిరగేసేడు. పెండ్లి అయినవారుకూడా కొన్ని సందర్భములలో పక్కదారులు తొక్కుతారు ఆ కథానికలలో! అదృష్టవశాత్తు శ్రీ లక్ష్మి కూడా పై శ్రేణికి చెందవచ్చునేమో?

పెద్ద విరామం చేసుంటా ఆ అమ్మాయి యింటికేసుకుని గోడా తిరుగుతోనే ఉన్నాడు. ఆ అమ్మాయి ఇతన్ని వింతగా చూస్తూవుంది. ఆ చూపుల్ని బట్టి శ్రీ లక్ష్మి తన్ను ప్రేమిస్తున్నట్లు గ్రహించుకొన్నాడు. అతని ప్రేమ అసాధ్యారము, ప్రదేశము జరుగకోవలసిన ఘట్టం వరకూ కూడ వచ్చింది.


3

'కేశాళ పూలాగ సుబ్బరాజుగారు జట్కామీద కేంపు వెళ్ళేరు. మరి మూడు రోజుల వరకూ రారు! అని సీను బంట్రోతు మల్లన్నద్వారా తెలుసుకొన్నాడు. రాజుని కాయడాన్కి మరి మంత్రి లేడు. కాగా గుర్రము, బంటుమాత్రమే మిగిలేరు. మెల్లిగా ఈ గుర్రము, బంటును తప్పించుకొని తన మంత్రిని ముందుకు త్రోసి 'త్రోసి రాజు ఆటకట్టు' అంటే యింక ఆట కట్టుడే పోవలసిందే. ఉపాయాన్వేషణకోసం తన రూములో కూచొని ఆలోచిస్తూన్నాడు. ప్రక్కగదినుండి రెండు గొంతుకలు వినిపిస్తున్నాయ్. ఒకటి వాళ్ళ అమ్మది. రెండవది లక్ష్మిఅమ్మది. లక్ష్మి అమ్మ అనుగుతున్నాది. "ఈ వేళ మా ఆయన కేంపు వెళ్ళేరు. సినీమాకు వెళదామా?" సీను అమ్మ "వెళదాం. మీ లక్ష్మికూడ వస్తుందా?" అని అడిగింది.

"ఊహు, ఒంట్లో బాగులేదట. రానంది. వాళ్లు చెన్నపట్నంలో చూసేరుట. ఇంటి దగ్గర ఎవరూ లేరు. పైగా ఈ రోజుల్లో కేవలము బంట్రోతుల్ని నమ్మి పూర్తిగా ఊరుకోకూడదు." అని చెప్పింది.

తరవాత సీనుఅమ్మ అతని గదివగ్గరకు వచ్చి మేము సినిమాకు వెళుతున్నాం. నేను వచ్చేవరకూ ఉంటావా? లేక అన్నం పెట్టుకుతింటావా?" అని అడిగింది. సీను "ఊ" అని ఊరుకున్నాడు. తొందరలో ఈ 'ఊ'కు అర్థం ఆమె అడగలేదు. వాళ్లు నిష్క్రమించేరు.

ముందుగా మల్లన్నద్వారా ఒక ప్రేమలేఖ పంపిద్దామనుకున్నాడు. కాని బాగా జ్ఞాపకంవచ్చింది. తానిదివరకు చదివిన ఒక ప్రేమకథలో ప్రేయసీ ప్రియులిద్దరూ ఒక బంట్రోతుద్వారా ఒకరికొకరు ప్రేమలేఖలు పంపించుకుంటారు. బంట్రోతు వాటిని బట్వాడా చేసినట్టే నటించి అవకాశం చిక్కగానే ఆ యువతిని పొందగోరి ఆమెతో తన దాహం తీర్చమంటాడు. ఆ యువతి నిర్ఘాంతపోయి తన తండ్రితో చెబుతానని బెదిరిస్తుంది. దానికి వాడు జంకక తన జేబులోని ప్రేమలేఖలు తీసి తన కొప్పుకోకపోతే అందరికీ "టాముటాము" కొడతానని భయపెట్టి ఆమెతో తన అవసరం తీర్చుకొంటాడు. ఈ కథ చదివిన సీను మల్లన్న



ద్వారా బట్వాడాపద్ధతి అవలంబించలేదు.

బాగా ముస్తాబై క్రిందికి దిగి వెళ్ళేసరికల్లా బాగా చీకటిపడింది. సూపరుసైజరుగారి వీధి అరుగుమీద మల్లన్న కునుకుపాట్లు పడుతున్నాడు. సీను పాడిని తట్టి మా అమ్మ మీ అమ్మగారు కలిసి సినీమా కెళ్ళేరు. లైటు పట్టుకొని నిన్ను హాలుదగ్గరకు రమ్మన్నారు అని చెప్పి ప్రక్కసందులోకి వెళ్ళేడు. మల్లన్న సమయం దొరికిందే చాలు ననుకొని బయలుదేరేడు. వీడూ అలా పోగానే ప్రక్కసందునుంచి వచ్చి సూపరుసైజరుగారింట్లో దూరేడు. శ్రీలక్ష్మి మంచంమీద కూచొని లేసు అల్లుతున్నది.

ఇతన్ని చూసి లేచి నిలబడి అడిగింది "ఎవరు మీరు?"

"నేను నేనే. మరచిపోయేవా?"

"లేదు. రోజూ నావేపు వికారంగా చూస్తూఉంటావు నీవే కదూ?"

"క్రొత్తగా మాట్లాడుతున్నావ్! నేను చిన్నప్పుడు నీతో బడికి వచ్చేవాడినికదూ! నన్ను సీను అంటారు జ్ఞాపకం ఉందా?"



"సరేలే ఎందుకు వచ్చేవ్?"

"నీకోసరం!"

"నాకోసరమా! ఎందుకు?"

"నువ్వు కావాలి!"

"నేనా!"

"అవును."

"ఎందుకు?"

నోరు పిడచ కట్టుకుపోయింది. ఈ 'ఎందుకు'కు ఏ విధంగా సమాధానం చెప్పాలి ఆలోచిస్తున్నాడు. నా భాష, నా బాధ యింకా ఈమె గుర్తించలేదేమో! బహుశా శ్రీలక్ష్మి సెక్సుకథలు చదివుండదు. ఎంత పొరపాటు? ఆలోచిస్తున్నాడు.

శ్రీలక్ష్మి కోపంగా "ఏమి టాలోచిస్తున్నావ్?"

జబాబు రాలేదు. మళ్లీ ప్రశ్న "ఆలోచించుకోకుండానే వచ్చేవా?"

ఈసారి సీను ప్లేటు మార్చేడు. సూటిగా ప్రశ్నించేడు.

"నీ భర్త బాగుంటాడా?"

"ఏదో నీకంటె కొంచెం నయం కనుక. ఆయన గురించి నీ కెందుకు?"

ఈ దెబ్బతో బాగా క్రుంగిపోయేడు. అయినా ఆయనలోని సెక్సుసాహిత్యం అతన్ని ప్రోత్సహించి తిరిగి ప్రశ్న లడిగేలా చేయగలిగింది.

"నీభర్తకు మానవత్వం ఉందా?"

"మానవత్వం అంటే నీలాంటిది లేదు. ఏదో సాంసారికంగాను ఘరానాగాను, మనిషిలేందుకు మాత్రం ఉంది." నీ కిలాంటి ప్రశ్నలు వెయ్యవలసిన అవసరం ఏమొచ్చింది!"


"ఏమీ లేదు. నీ సాఫల్యి బట్టే నీ భర్తతో నీ కేదోసరమైన ఏదో లోపముంటే తీరాలని తెలుసుకోన్నా. అందుకరించే అడుగుతున్నాను. కానీ నీ భర్త రోజూ ప్రేమతోటే మొఖం కడుగుతాడా?" అని అడిగేడు.

"దేవుని దయవల్ల నాభర్తలో యింత వరకూ ఏవిధమైన లోపమూ లేదు. చిలకా గోరింకల్లా ఉంది మాదాంపత్యం. చూస్తూ వుంటే నీకు పిచ్చిపట్టినట్లుంది. అయినా నాభర్త లోపం నీకెందుకు?"

"శ్రీలక్ష్మి నిన్ను నేను ప్రేమించేను. యింకా ప్రేమిస్తున్నాను. అందుకని".

"మా అమ్మ నాన్నకూడా నన్ను బాగా ప్రేమిస్తున్నారు. అయితే వా రెప్పుడూ యిలాంటి ప్రశ్న లడగలేదు."

(19-వ పేజీ చూడండి)



క్రొత్తగా క్లాసులో కాలు పెడుతూ - గడపఅంచుకు చెప్పుకాలు తగిలి కొంచెం ముందుకు తూగాడు, నళినీకాంతం. అంతకు ముందు నిమిషంనించీ నిశ్శబ్దంగా వున్న క్లాసంతా నవ్వులతో మారుమోగిపోయింది. నళినీకాంతానికి చెమట్లు పట్టాయి. అదే క్రొత్తగా చార్జీ పుచ్చుకొని పంతులు వుద్యోగంలో ప్రవేశించటం. మెల్లగా అవమానభరిత హృదయంతో వొచ్చి కుర్చీలో కూర్చొని తల దించేసుకున్నాడు. పిల్లలకేసి చూడాలంటే మహా చెడ్డభయంగా వుంది. మళ్ళీ క్లాసు నిశ్శబ్దవాతావరణంలో మునిగింది. వెనక బెంచీలో కూర్చొన్న చిలిపివెధవ చలపతి 'మ్యావ్' అని పిల్లి కూతకుమల్లే అరిచాడు. ఇంకోసారి క్లాసు నవ్వులతో, కేరింతలతో ప్రతిధ్వనించింది. అతికష్టంమీద తలెత్తి చూశాడు, నళినీకాంతం; వీళ్లు తనని ఎగతాళి చేస్తున్నారు అని గ్రహించింతరువాత. చలపతి బెంచీలోంచి లేచి - 'సైలెన్సు, సైలెన్సు' అంటున్నాడు - ఇది మరీ దుర్భరంగాతోచింది, నళినీకాంతంకి. క్లాసులో గోలసద్దు మణిగింది. రెండోవరుస బెంచీలలో వెనుక బెంచీలో వున్న మాయమాధవుడు వుండివుండి 'కిచకిచ' అని అన్నాడు ఎలకకిమల్లే. క్లాసంతా ఘొల్లున నవ్వింది. తిరిగి చలపతి లేచి 'సైలెన్సు, సైలెన్సు' అన్నాడు. నళినీకాంతానికి వొంటినిండా పురుగులు పాకుతున్నట్లైంది. క్లాసింత అసభ్యంగా, అల్లరిగా వుంటుం దనుకోలేదు. క్రొత్తమాష్టర్ని మొదట్లో ఎంతో ఆప్యాయంగా, గౌరవప్రదంగా చూస్తారని అనుకున్నాడు. అదేమి లేదు. ఎగతాళి. అదరగొట్టటం. నళినీకాంతానికి కోపం ముంచుకు వచ్చింది. చివాలున కుర్చీలోంచి లేచి డ్రాయర్ని గుద్దుతూ—

'సైలెన్సు, ఏమిటి వెధవ అల్లరి' అన్నాడు, గంభీరంగా. మొదట్లో వున్న వొణుకు కాస్త పోయింది.

'ఉత్తవెధవలండీ మాష్టారూ, క్లాసంతా; కొత్త మాష్టారుదగ్గర ఎలా మసులుకోవాలో తెలీదు. తలా నాలుగు చరచండి దారికి వొస్తారు' అన్నాడు చలపతి బెంచీలోంచి లేవకండానే, కూర్చుని దర్జాగా. నళినీకాంతానికి వాడిమీద ద్వేషం రగులుతున్నది. తనవైపు వకొల్లా పుచ్చుకొని అలా వినయవిధేయతల్ని చంపుకొని కూర్చొని దర్జాగా అనటం - మాష్టార్ని అసమర్థుడుగా చేసి అనటంలాగా తోచింది, నళినీకాంతానికి.

'నువ్వేమీ మాట్లాడక్కర్లేదు' బిగ్గరగా

అన్నాడు, నళినీకాంతం చలపతిని వుద్దేశించి.

'ఓహో! ఈ మాటలకే మాష్టారుగారికి కోపం వొచ్చిందిగామోసు – తప్పు, తప్పు ఇహ అనకులెండి' అన్నాడు చలపతి – ఆ వాక్యాన్ని ఎంతవరకు వెకిలిగా అనేందుకు అవకాశం వుందో అంత వెకిలిగా అంటూ.'

'వీళ్ల నేం చేయాలి?' అని తనను తాను కఠినంగా ప్రశ్నించుకున్నాడు నళినీకాంతం. జవాబు అంత కఠినంగా రాలేకపోయింది.

నళినీకాంతం చాల నియమాలుకల మనిషి. ఛార్జీ పుచ్చుకోనేప్పుడు తన వుద్యోగ ధర్మాన్ని ఖచ్చితమైన పద్ధతుల్లో నిర్వర్తించాలి అని తన మనస్సులో అనుకున్నాడు. అంతేకాకుండా సడలని దీక్షతో పిల్లలకు పాఠాలు సక్రమంగాచెప్పి, పిల్లల్ని బాగుచేసి పేరు తెచ్చుకోవాలనికూడా అనుకున్నాడు. ఈ రెండు వాంఛలూ అతనిలో కొంత తృప్తినీ, అభిమానాన్నీ రేకెత్తించినయ్ అప్పుడు. కానీ వీటిన్నానే పరిస్థితుల మార్పువల్ల క్రౌర్యాన్ని తెచ్చుపెట్టుకోవాల్సిన అగత్యం కలిగేప్పటికి నళినీకాంతానికి మొదట తాను స్కూలును గురించీ, చదువుకొనే పిల్లల్ని గురించీ వూహించిన సదభిప్రాయాల్ని తుడిచిపెట్టుకోవటం తేలికైంది. చలపతిని మనస్సులో పెట్టుకున్నాడు. కాని అదే వుద్యోగంలో చేరిన మొదటిరోజు కావటంతో ఏవిధమైన దండన విధించటానికి ఆస్కారం లేకపోయింది.

'పంతులుగారూ! తమ దేవూరో శెలవిస్తారా?' అన్నాడు మాయమాధవుడు పక్క వినయంతో.

తన దేవూరైతే వీళ్ల కెందుకు? అసలు మాష్టరు వ్యక్తిగత విషయాలు వీళ్లకు దేనికి? ఇవి కనుక్కునేందుకేనా స్కూలుకు రావటం? నళినీకాంతం 'కొత్తగావచ్చిన అందరి మాష్టర్లనీ యిలాగే యేడిపిస్తారా?' అన్న నీచాభిప్రాయానికి 'ఫీల్' అయ్యాడు.

'ఫూల్స్! ఆ సంగతంతా మీకు దేనికి?' విసుగ్గా అన్నాడు నళినీకాంతం.

'తెలుసుకుందామని' మొదట బెంచీలోని సూర్యనారాయణమూర్తి అన్నాడు మాయమాధవుడికి వూతాన్నియిస్తూ.

'అక్కర్లేదు. చదువుకోవటం మినహాయించి మాష్టర్ల సంగతి మీకు అనవసరం' నళినీకాంతం గట్టిగా.

క్లాసులో చిన్నికోలాహలం బయలుదేరింది. మధ్య బెంచీలవాళ్లు గుసగుసలు ఆరంభించారు. రెండో బెంచీలోవాళ్లు ముందున్న డస్కులమీద తలలు వాల్చి ముసిముసినవ్వులు నవ్వుతున్నారు. వెనుక బెంచీలో కొంతమంది సినిమా పాటల్ని ఆలాపన చేస్తున్నారు. క్లాసును మాస్తుంటే నళినీకాంతానికి 'మార్కెట్టు'లోని సందడి స్ఫురించింది. ఇలా అల్లరిచేయటం వీళ్లకి ఆచారంగా వొస్తున్నట్టు గమనించాడు. డ్రాయరును గుద్ది 'సైలెన్సు' అన్నాడు. కాని అల్లరి ఆగలేదు. తనమాట వినటం లేదన్న ఉడుకుమోతుతనం అధికమైంది, నళినీకాంతానికి. మాష్టర్ని 'మాష్టరు'గా చూడటాన్ని ఎప్పట్నుంచి వొదులుకున్నారో ఈ విద్యార్థులు–అర్థం కాలేదు.

చలపతి లేచి 'సైలెన్సు' అన్నాడు. అల్లరి ఆగింది. నళినీకాంతంవంక 'నా పలుకుబడి చూడు' అన్నట్టు నవ్వుతూ కూచున్నాడు, చలపతి. నళినీకాంతం గొప్ప అవమానాన్ని ఇంతమంది పిల్లలమధ్యలో పొందుతున్నట్టు బాధపడ్డాడు. హెడ్ మాష్టరుకు రిపోర్టిస్తే – ఎందుచాతనో అసమర్థంగా అనిపించింది. టైం చూసుకున్నాడు 'పీరియడు' అవటానికి యెంత వ్యవధి వుందోఅని. ఇంకా అరగంట వుంది.

అటెండెన్సు వొచ్చింది. సుబ్బారావు అని పిలిచాడు. మొట్టమొదట 'ప్రజెంట్ సార్' అని అతను క్లాసులోవుంటే అతనే చెప్పాలి. కాని అతను అలా చెప్పనేలేదు. పైగా లేచి ప్రశ్న–పేర్లు పిలవకూడదండీ! నంబర్లు పిలవండీ సార్' అని అన్నాడు. ఎలా పిలిస్తేయేం? ఏం కొంప మునిగింది? ఇంతలోకే లేచి సలహా యివ్వాలీ మాష్టరుకి.

'సరే అలాగే నంబర్లని పిలిచాడు. నళినీకాంతం ఒన్–టు–త్రీ...అట్లా B. ఫార్టియెయిట్ వరకూ పిలిచాడు. అందరూ 'ప్రజెంట్ సార్'అని పిలిచారు. అనుమానంవేసి నళినీకాంతం క్లాసులోని విద్యార్థుల్ని లెక్కపెట్టాడు. నలభైమంది వున్నారు. ఆశ్చర్యంవేసింది. మరి అందరూ 'ప్రజెంట్ సార్' అన్నారే. తేలిందేమిటంటే – రానివాడి నంబరుకుకూడా వొచ్చినవాడు 'ప్రజెంట్ సార్' అనటం జరిగింది. తల వొంచుకొని అటెండెన్సు వేసుకోవటంలో మాష్టర్ని విద్యార్థులు చేసే పచ్చిమోసం ఇది. ఇటువంటి మోసాలకు అలవడ్డ మాష్టర్లు నంబరువారీగా కూచోబెట్టి నిలుచోని 'ప్రజెంట్ సార్' అనిపించటమో, పేరుని నిదానంగా పిలవటమో జరుపుతారు. కొత్తకనుక నళినీకాంతానికి ఇటువంటి మోసాలు విద్యార్థుల్లో అమల్లోవుంటమనేది యెరగడు. మళ్లా పిలిచి అటెండెన్సు సరిచేద్దామా అనుకున్నాడు. కాని అన్ని నెంబర్లను దిద్దటంవల్ల ముందుగా అంత గుడ్డిగా ఎందుకు వేశావన్న గూటింపు హెడ్మాష్టరునించి వొస్తుందేమోనని జంకాడు, నళినీకాంతం.

ఇప్పుడొచ్చిన చిక్కేమిటంటే, ఇక ముందునించీ ఆ క్లాసుకే క్లాసుటీచరు, నళినీకాంతం. అడుగులో హంసపాదమన్నట్టు–మొదట్లోనే ఆ క్లాసువల్ల అసహ్యాన్ని పొందాడు. అయినా ఆ క్లాసుని యే విధంగానైనా బాగుచేయాలని నిశ్చయించుకున్నాడు, నళినీకాంతం.

'ఇంగ్లీషు టెక్స్టు యిటివ్వు' అన్నాడు నళినీకాంతం ముందు బెంచీలో కూర్చొన్న సీతారామస్వామిని.

యిచ్చాడు. పొయిట్రీపోర్షను తీసి ఒక విద్యార్థిని ఫలానా పొయిట్రీలెసన్ చదవమన్నాడు. వాడు ఆ లెసన్ చదవటానికి పడ్డశ్రమ అంతాయింతా కాదు. ప్రతివర్డ్ కీ తప్పులుపోవటమే! విసు వేసింది, నళినీకాంతానికి. కూర్చోమన్నాడు. ఇంకో విద్యార్థిని జరిగినపాఠంలో ఒక ప్రశ్న వేశాడు. జవాబు చెప్పలేకపోగా, వాడు కూర్చొనివుండే 'నాకు తెలీదండీ!' అని ధీమాగా అన్నాడు. ఇట్లా దాదాపు పాతికమంది విద్యార్థులవరకూ ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేదు. అప్పుడు తెలిసింది, నళినీకాంతానికి ఆ తరగతి విద్యావిధానం ఎటువంటి హీనస్థితిలో వున్నదీ. చలపతి అన్నాడు:

'జరిగిన పాఠాల్లో ప్రశ్నవేసి విద్యార్థుల్ని కష్టపెట్టే ఆచారం ఇంతవరకు వొచ్చిన పంతుళ్లలో లేదండీ!'

నళినీకాంతం నిర్ఘాంతపోయాడు. అయితే మాష్టర్లెందుకు? స్కూలెందుకు? చదువెందుకు? చలపతి అబద్ధాలు ఆడుతున్నాడనిపించింది, నళినీకాంతానికి. ఈ విధానమే కనుక మాష్టర్లలో పాకిపోతే చెప్పిన పాఠాల్ని చదవాల్సిన అవసరం విద్యార్థులకు కనపడదు.

'అదంతా నాకవసరంలేదు. నే చెప్పే పాఠాల్ని ఏ రోజు కారోజు కచ్చితంగా చదవాల్సిందే. నే నడిగిన ప్రశ్నలకు జవా

ణులు చెప్పనివత్తులలో తగినశిక్ష విధిస్తాను' అని అన్నాడు నళినీకాంతం.

'ఏం శిక్ష విధిస్తారు – తలలు కొట్టి వెంటే స్తారా? వెండికి గుండు తగిలిస్తారా? ఎండలో నిలబెడతారా? సరికి బెత్తాలతో వొళ్లంతా వాయగొడతారా?' అని నుక్క తిప్పుకోకుండా అన్నాడు, మాయమాధవుడు.

నళినీకాంతానికి ఉద్రేకం వొచ్చింది. తననీ, తన విధానాన్నీ గేలిచేస్తున్నట్టు భావించాడు.

'షటప్! ఫ్రూడిక్ వాగకు. దెబ్బలు తగలగలవు'

'ఇంతవరకు మేము ఏ మాష్టరు దగ్గరా పల్లెత్తు మాటకానీ, చిన్నం ఎత్తు దెబ్బగానీ తినలేదు. మీదగ్గర దెబ్బలు తినే దౌర్భాగ్యంకూడా మాకు పట్టదు' అన్నాడు చలపతి. క్లాసుకంతా వాడే లీడరు. పంతులుమాటకంటే వాడిమాటే ముఖ్యం విద్యార్థులకు.

ఈ విద్యార్థుల్లో 'పంతులు' అన్న పెద్ద మనిషికి ఎంత విలువుందో ఒక్క నలభై అయిదునిముషాల 'పీరియడ్'లోనే అర్థం అయింది నళినీకాంతానికి. వీళ్లని నయానో, భయానో సక్రమమార్గానికి తేవాలని దృఢంగా నిర్ణయించుకున్నాడు, నళినీకాంతం. నళినీకాంతం చాల పట్టుదల గల మనిషి.

2

సాయంత్రం అయిదు గంటలకు నళినీకాంతం యింటికి వొచ్చాడు, బుర్రలో అనేక ఆలోచనల్ని స్థాపించుకొని. క్రిందకు దించిన పంచిపాళీ పంచబొంగుకు తల తగిలి దిమ్మరపోయాడు నళినీకాంతం. ఆ యింటికి అలవాటు పడకపోవటాన, సరిగ్గా పంచదగ్గర కొచ్చేప్పటికి వంగి నడవకపోతే పంచబొంగులు తలకు పొడుచుకుంటాయి అన్న జ్ఞాపకం అట్టడుగున పడిపోయింది. తలని సవరించుకుంటున్నాడు నళినీకాంతం. ఇదంతా భార్య చూసి అల్లంత దూరాన వుంటే—

'అఁ! తగిలిందీ-మీకుకూడా! అసలే నలుగురుచూసే పాటిదాన్ని అనిపించుకొనే నా తలకే ఆ బొంగులు పొడుచుకొంటూంటే చెట్టంత ఎత్తున వున్న మీకు తగలటం అబ్బురమా? అదికాక-మీ కలతగలాలనిందిలే—నా మాట వింటేగా. ఎందుకూ ఈ పెదవ వుద్యోగం ఈ వూళ్ళ వెంట అడుక్కుతినటం-' అని తన పాఠం ఆరంభించింది.

'ఉండవే నీవు మరీనూ. మానవుడై ఈ భూమిమీద పుట్టింతరువాత [illegible] చేసి లోకానికి వుపయోగపడాలి' అన్నాడు నళినీకాంతం.

'ఈ కబుర్లన్నీ నాదగ్గర చెప్పకండి. మనం దేశసేవకు ప్రాణాల్ని అర్పిస్తామా? తేమిటీ?'

'అదేమన్నమాట. అంతపనీ చేయకపోతే-మన తాహతుకు తగ్గది చేదాం?'

'ఇవన్నీ నాకు నచ్చవు. నామాట వినండి. మన కెం తక్కువ, వూరు కాని వూరులో, అద్దె యిళ్ళల్లో పడివుండి ఉద్యోగం చేసి జీవించటానికి. పొలం పుట్రా చూసుకోకపోయినా ఆ కవుళ్ల వాళ్లు యిచ్చేది చూసుకొని పోగుచేసుకొని హాయిగా బ్రతకొచ్చు' అన్నది నళినీకాంతం భార్య. మొదట్నుంచీ ఆమెది ఇదే వాదన. ఆమెదృష్టిలో ఈ చిన్న చిన్న వుద్యోగాలు చేసేవాళ్ళు కేవలం బ్రతకలేక చేస్తారని. అటువంటిది బ్రతకటానికి అన్ని అవకాశాలున్న తన భర్త ఈ వుద్యోగం చేయట మేమిటి?

'నీకు తెలియదులే-' అన్నాడు నళినీకాంతం భార్య గోడును వినటానికి వోపిక లేక.

'అదుగో యేమీ సమాధానం చెప్ప చేతకాకపోతే, ఆమాటంటారు! ఈ తల కొయులు పగలగొట్టుకొంటూ ఈ వూరిళ్లలో వుంటే ఖర్మ మన కెందుకు? మన వూళ్లో నిక్షేపమైన స్వంతయిల్లు లేకనా?'

'ఇది పాతగోలే' అనుకొని వూరుకున్నాడు నళినీకాంతం. అతను దీంట్లో కల్పించుకొంటే గోల విపరీతస్థితికి వొస్తుందని అతనికి తెలుసు.

'ముఖ్యంగా నీళ్ల యిబ్బందిని భరించలేకుండావున్నాము. ప్రక్కింటికెళ్లి తెచ్చుకోవాలి. వాళ్లు కొస్త మూతిముడిస్తే మన తిప్పలు దేముడి కెరుక. అదేమంటే-నీళ్లు తెచ్చేది నేను దా, ఆ అవస్థలన్నీ నేను పడతాను అంటారు. మన యిద్దర్లో ఎవరి పడితేనేం అవస్థలు, నాకుమాత్రం నొప్పిగా వుండదూ. అసలు ప్రక్కింటివారి భావిలో నీళ్లు తెచ్చుకోవటంవల్ల వాళ్లక్రింది ఇవాళ కాకపోయినా రేపైనా తక్కువతనం కాదుటండీ? పైగా ఈ వూరింటికే ఏ వసతులూ లేని ఈ యింటికే ఎనిమిది రూపాయల అద్దె. నళినీకాంతం భార్య చెప్పుకు పోతున్నది. నళినీకాంతం వినటం లేనట్టు నటిస్తూ వింటున్నాడు.

'ఇక్కడ వాళ్లిచ్చే జీతంకూడా చాలటం లేదయ్యె, కాఫీలకూ, యింటిఅద్దెకూ, తిండికే. అటువంటప్పుడు నానాఅవస్థలూ పడుతూ మీరు నోరగబెట్టే దేమిటి? అదీ [illegible]కసిగాక మీరు ఇంట్లో లేని సమయంలో నాకేమీ తోచటంలేదు. ఇక్కడి ఆడవాళ్లతో నాకు మాట్లాడ బుద్ధేవెయ్యదు.'

'అలవాటుపడాలి, ఈ వాతావరణానికి. ఆపైన ఎక్కడవున్నా ఒకటే ననిపిస్తుంది.'

ఇటువంటి చచ్చుజవాబులు చెప్పేందుకు భర్తగారికి మనస్సెట్లా వొప్పుతుందో అనిపించింది నళినీకాంతం భార్యకు.

తను చెప్పినందువల్ల యేమీ లాభంలేదని తెలుసుకున్నదై వూరుకొంది నళినీకాంతం భార్య. స్కూల్లో ఆ గోలా, యింటిదగ్గర ఈ గోలా తనకి శాంతిలేకుండా పోతున్నదని విసుక్కున్నాడు నళినీకాంతం.

ఎనిమిది గంటలకు అన్నం వడ్డించి ఎదురూగ్గా కూచొంది నళినీకాంతంభార్య. నళినీకాంతం తల వొంచుకొని తింటున్నాడు. కూరా అన్నం సాంతం తినకుండానే 'మజ్జిగ' అన్నాడు.

'ఏం అంతా వొదిలిపెట్టారేం? అన్నం సయించటంలేదా? అయినా ఎట్లా సయిస్తుందిలెండి. మన చేలో పండిన వడ్లు కాదుగా అన్నం శుభ్రంగా వుండేందుకు. రేషన్ బియ్యమాయె. సకల మలినపదార్థాలూ వాటిల్లో వుంటవి. బలవంతాన తిన్నా రేప్పొద్దునకు యేదో రోగం పుట్టుకువొస్తుంది. నామాట వినండి. కానిచోట రోగాలపాలయ్యేగతిని ఎందుకు సృష్టించుకోవాలి' అన్నది నళినీకాంతం భార్య, మజ్జిగ తెచ్చేందుకు లేస్తూ.

'ఫరవాలేదు. ఈ రేషన్ బియ్యం తిన్నవాళ్లందరికీ కనుక రోగాలు వొస్తే ఇదివరకే భారతదేశంలో చాలమంది చచ్చివుండాల్సింది' అన్నాడు నళినీకాంతం పాడి అన్నాన్ని వేళ్లతో కలుపుతూ.

'సరే నా మాటను యిప్పుడు యిట్టే త్రోసివేసినా రేపు మీకే తెలిసిరాగలదు' అన్నది నళినీకాంతం భార్య.

'తెలిసివొచ్చేది యేమీ వుండదు. ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా, న్యాయమార్గంగా నెరవేర్చటమే నా విధి. అటువంటప్పుడు తెలిసిరావల్సింది యేమీ వుండబోదు' అన్నాడు నళినీకాంతం.

అవతలవాడి విషయంలో తను

న్యాయంగా ప్రవర్తిస్తే-వాడు కూడా తన విషయంలో న్యాయంగా ప్రవర్తిస్తాడు అన్న నమ్మకం ఇంకా నళినీకాంతంలో క్షీణించలేదు. అంతేకాకుండా ఒక సంస్థ నించి తను డబ్బు తీసుకొనేప్పుడు కష్టించి ఆ డబ్బుకు తగిన పని ఆ సంస్థకు చేయాలి అన్న అభిప్రాయంకూడా అతనిలో పనిచేస్తూన్నది. తను మాష్టారు వుద్యోగంచేస్తూ బోర్డునించి నెలనెలకూ జీతం తీసుకొంటూ, తను బద్ధకంగా అశ్రద్ధచేయకండా పిల్లలకి సక్రమంగా చదువుచెప్పాలి అని నిర్ణయించుకున్నాడు, నళినీకాంతం ఉద్యోగంలో చేరిన రోజునే. అతనిలో కాలానికి వర్తించని న్యాయబద్ధమైన భావాలు కొన్ని జీర్ణించుకొని వున్నవి. వాటివల్ల ఇంతవరకు నళినీకాంతానికి ఎటువంటి బాధ కలుగలేదు, తను స్వతంత్రంగా బ్రతుకుతూ తనలోని అధికారాన్ని తనమీదకే ప్రయోగించుకొంటూ వొస్తున్నాడు కనుక. తనలోని అధికారాన్ని న్యాయబద్ధమైన భావాల రీతిగా, ఇంకోకళ్ళమీదికి ప్రయోగించటంలో ఇంతవరకూ తన జీవితంలో వుంటూ వొచ్చిన శాంతి వుండదని గ్రహించలేకపోయాడు, నళినీకాంతం. ఎదుటవాడికి అపకారం తలపెట్టి చేస్తూ, నలుగురుచాతా ఉపకారం చేస్తున్నాడని అనిపించుకొనే పలుకుబడిగల మనుష్యులు ఈ లోకంలో వుండి అశాంతిని రేపుతున్నారనిన్నీ, నిర్ణయానుసారంగా తాము డబ్బు సంస్థనుండి తీసుకొంటూ చేయవలసిన విధుల్ని చేయకండా, బద్ధకాన్ని, స్వార్థాన్ని అపేక్షించి ప్రక్కదారులు తొక్కుతూ, తమని నమ్ముకున్న సంస్థకి అన్యాయంచేస్తూన్న మానవులు వుండి దేశంలో లంచాన్ని, అవినీతినీ పెంపొందిస్తున్నారనిన్నీ, నళినీకాంతం వూహించలేదు. ఎవ్వరిదగ్గరా విననుకూడా వినలేదు. ఈ విషయాలు అతని జీవితానికి ఇంతదనుకా అంటని రహస్యాలుగా దూరంగా వున్నయ్. అవి నళినీకాంతంలో ప్రవేశించినరోజు ఈ లోకంలో అతను హాయిగా బ్రతుకుతూ, పైకి పోగల భవిష్యత్తు వుంటుంది. వాటిని దూరంగా వుంచినంతకాలమూ, కూపస్థమండూకానికీ నళినీకాంతానికీ తారతమ్యం లేదు. కొన్ని సమయాల్లో వాటిని దరికి చేరనీయకపోవటంవల్లనే చిన్నచిన్ని ప్రమాదాలు సంభవిస్తూ వుంటాయి. కాని అందువల్ల నళినీకాంతం మానసికంగా 'ఫీల్' అయినా ఆర్థికంగా బాధపడేదిలేదు.

3

ఇవాళ చెప్పిన పాఠంలో మగవాడు ప్రశ్నవేస్తూంటే జవాబులు చాలా తక్కువమంది చెబుతున్నారు. వాళ్లయినా చాలా చిన్ని ప్రశ్నలకు. దాన్నిబట్టి చెప్పిన పాఠాల్ని చదువమని మాష్టరు గొంతుచించుకున్నా యేమీ లాభంలేకపోతున్నదనీ, మాష్టరంటే ఏ విద్యార్థికీ లక్ష్యం లేదనీ తేలింది. ముఖ్యంగా చిలిపి చలపతీ, మాయమాధవుడూ నళినీకాంతాన్ని 'మాష్టరు' దృష్టిలో చూడటంలేదు. వాళ్లు ప్రతి మాష్టర్ని ఆ చూపుతోనే చూస్తారన్న సంగతి నళినీకాంతానికి తెలీదు.

ఆ ఇద్దరు స్టూడెంట్సునుగురించి కొంత చెప్పవలసివుంది, మరి. హెడ్ మాష్టరు సహితం వాళ్లిద్దర్ని పల్లెత్తుమాట అనడు. భయం. వాళ్లని చూస్తే ప్రతి టీచరుకూ అంతో ఇంతో భయమే. పిల్లలకుకూడా భయమే. ఆ స్కూలు చదువులో అంత అధ్వాన్నంగా వుండటానికి కొంతవరకు వాళ్లిద్దరు బాధ్యులు. ఏమీ చదువురాని విద్యార్థిని మాష్టరు కొట్టటానికి లేదు. అట్లా కొట్టినయెడల వాళ్లిద్దరు బజార్న పోతోన్న పంతులకే రాళ్లువిసరటమో, విసిరిపించటమో చేస్తారు. దెబ్బలు తగిలే సంగతి అటుంచి ముఖ్యంగా, ఎంత అవమానం? అందులో చిలిపి చలపతి బాగా డబ్బుగల ఆ గ్రామం పంచాయితీబోర్డు ప్రెసిడెంటు కొడుకు. మాయమాధవుడు పంచాయితీబోర్డుకి ప్రెసిడెంటుకు అండగా వున్న మరో లక్షాధికారి కొడుకు. అందువల్ల వాళ్లిద్దరి విషయంలో ఎవ్వరూ కల్పించుకొనేందుకు వీల్లేకపోతున్నది. చిలిపి చలపతితండ్రికి ఆ గ్రామంలోనే కాకుండా జిల్లాబోర్డులో కూడా మంచిపేరున్నది. ఆయన మాటని కాదనేవాడు లేడు. కొడుకులు యే చిలిపిపనిచేసినా చిలిపిపనులుగా గుర్తించకుండా ఘనంగా అనుకొనే తండ్రులిద్దరూనూ. అటువంటప్పుడు ఆపిల్లలిద్దరి ప్రతిభ దేదీప్యమానంగా సాగక ఎందుకుంటుందీ? ఇంకో విషయమేమిటంటే: ఆ వూరికి ఆ హైస్కూలు వొచ్చేందుకు ఆ పిల్లల తండ్రులదే ముఖ్యశ్రమ.

ఒకరోజున నళినీకాంతం ట్వెల్వ్‌లైన్సు రెసిటేషన్‌పొయిట్రి చెప్పి వారంరోజుల్లో ప్రతి విద్యార్థినీ ఖచ్చితంగా వొప్పచెప్పమన్నాడు. లేనిపక్షంలో కఠినంగా శిక్షిస్తానన్నాడు. అందులో అతని తప్పులేదు. పంతులమాట అవశ్యం విద్యార్థి వినవలసిందే - చదువువిషయంలో. లేకపోతే ఆ విద్యార్థికి చదువు రావటంఅనేది అసంభవమైన విషయం. తాను చెప్పిన పాఠాలు వల్లించుకురాకపోతే, హోంవర్కు చేయకపోతే మాష్టరు విద్యార్థిని కొడతాడు. ఈ దఫాఅయినా తాను చేయమన్న పని చేస్తాడని. అందువల్ల మాష్టర్ని తప్పుపట్టాల్సిన అవసరం మనకు లేదు.

వారంరోజులు గడిచాక రెసిటేషన్ వొప్పజెప్పమన్నాడు. క్లాసులో యే విద్యార్థీ వొప్పచెప్పకపోగా కనీసం వొప్పజెప్పేందుకుకూడా ప్రయత్నించలేదు. నళినీకాంతం మండిపడ్డాడు. 'ఎందుకు చదవలేదు?' అని అతి కఠినంగా ప్రశ్నించాడు.

కొంచంసేపున్నమీదట ఒక విద్యార్థి లేచి—

"చలపతి చదవొద్దన్నాడు" అన్నాడు.

నళినీకాంతానికి అక్కసు అధికమైంది. వీడు క్లాసు కంతటికీ అధికారియైన నామాటను క్లాసులో విలువలేకుండా చేస్తున్నాడు? దగ్గరకు పిలిచాడు నళినీకాంతం చలపతిని. 'ఏమిటి నీ తుంటరితనం' అనేసి ఆ చెంపా ఈ చెంపా బలంగా వాయించాడు నళినీకాంతం.

చలపతి అన్ని దెబ్బల్ని భరించికూడా యేమీ పల్లెత్తుమాట అనలేదు. ముఖాన్ని గాంభీర్యంగా ప్రశాంతంగా వుంచాడు. ముందుముందు యేం విపరీతం జరగనున్నదో అని విద్యార్థులు మాష్టరు ముఖంకేసి, చలపతి ముఖంకేసి నిశితంగా దృష్టుల్ని సారిస్తున్నారు. ఈ సంఘటనవల్ల ఈ క్షణాన కాకపోయినా ఇంకోకప్పుడైనా మాష్టరుకు యేదో ఒక ప్రమాదం సంభవిస్తుంది - అని విద్యార్థులు లోపల లోపల అనుకోసాగారు.

సాయంత్రం స్కూలు వదిలిపెట్టేవేళకు క్రొత్త మాష్టరు ఫలానా చలపతిని కొట్టాడన్న సంగతి మాష్టర్లకీ, విద్యార్థులకీ తెలిసింది. స్కూలునించి యింటికి వొస్తూన్న సమయంలో త్రోవమధ్యన లెక్కలమాష్టరు నరసింహశాస్త్రిగారు కలిశారు, నళినీకాంతంతో.

"మీరు చలపతిని అలా కొట్టటం శ్రేయస్కరం కాదోయ్!" అన్నారు నరసింహశాస్త్రిగారు.

నళినీకాంతం తడబడపడ్డాడు. ఎందుచాత? తను ఆచరించిందాంట్లో ఒకళ్లు తప్పు పట్టవలసిన అవసరం ఎక్కడుంది? మాష్టరు చెప్పినమాట తాను వినకపోగా క్లాసు నంతటినీ వినకుండాచేసే విద్యార్థిని మాష్టరు కొట్టకుండా ఎలా వుండగలడు?

'ఏమిటి అట్లా అంటున్నారు?' అన్నాడు నళినీకాంతం.

'చలపతి చేసిన పనిని సమర్థించను. వక్రమైనపనే. కాని అట్లా కొట్టడంవల్ల ఆ

విద్యార్థివల్ల మీకేమన్నా ప్రమాదం సంభవించవచ్చు. వాడు ఆకతాయి వెధవ' అన్నారు నరసింహశాస్త్రిగారు.

'ఈ విధంగా విద్యార్థులకు దడిచి మాష్టర్లు తమ ఉద్యోగధర్మాన్ని మర్చిపోయి స్కూలులో సువిద్యను ప్రవేశపెట్టకుండా వుండటం మంచిదంటారా?' అన్నాడు నళినీకాంతం.

'మనకు వశం తప్పిపోయిన విషయాలలో తలదూర్చి రోకటిపోట్లు తినటాన్ని మనం సహించగలమా? ఉద్యోగధర్మం అన్నది కొనసాగేదగ్గరే. అన్నిచోట్లా అలా చేయలేం. మాష్టర్లమాటలు విద్యార్థులు వినే కాలం గతించింది. విద్యార్థుల మాటలు మాష్టర్లు వినే కాలం ప్రవేశించింది.' అన్నారు నరసింహశాస్త్రిగారు, యథార్థాన్ని వెళ్లగక్కుతూ.

'అట్లా నిస్పృహ పోకూడదండీ? మాష్టర్ల మాటలను విద్యార్థులు వినేట్టు చేయాలి, నయానో భయానో' అన్నాడు, నళినీకాంతం.

నరసింహశాస్త్రిగారు యేమన లేదు. ఇల్లు సమీపించటంతో వాదనలోంచి తొలిగారు. తోటి మాష్టర్లలో కూడా విద్యార్థులనుగురించి విద్యనుగురించి చచ్చు అభిప్రాయా లుంచటం - నళినీకాంతానికి జుగుప్సని కలిగించింది.

ఆ వేళ గురువారం. సాయంత్రం ఆరు గంటలకు షికారుకు కాలవకట్టకు వెళ్లాడు, నళినీకాంతం. నిత్యం వాహ్యాళి నళినీకాంతానికి ఈవూరు వొచ్చాక తీరని అలవాటుగా పరిణమించింది. యేడూ, యేడున్నర గంటలవరకూ కాలవకట్ట మీద కమ్మని గాలిని పీలుస్తూ వుంటాడు. ఆ రోజున కూడా అలానే వుండి బాగా చీకటి పడింతరువాత ఇంటికి వెళదామని లేచి పదిగజాలదూరం నడిచాడు. ముందుగా ఒకరాయి ఎక్కణ్ణుంచో వొచ్చి విసురుగా పడింది. నిర్విణ్ణుడై నిలబడ్డాడు. రెండోరాయి వొచ్చి తలకు బలంగా తగిలింది. 'అబ్బా!' అని తలను చేత్తో అదిమి పట్టుకున్నాడు. క్షణం గడిచాక చేతికి తడి తగిలింది - రక్తం చిందుతున్నది. అదిరిపడి చుట్టూ చూశాడు. ఎవరూ కనపళ్లేదు.

రెండుగజాలు ముందుకు నడిచాడు. బిగ్గరగా నవ్వుతూ నలుగురు పిల్లలు చెట్లచాటునించి వొచ్చారు. దిగాలుపడి వాళ్లవంక చూశాడు; నళినీకాంతం - అదే వున్నవూరు వాడైతే ఆ పిల్లల్ని చావమోదేవాడు.

'జాగ్రత్తగా మసులుకోండి. స్కూళ్లో పిల్లల్ని కొట్టటం అంత తేలిగ్గా వుందనుకొన్నారా?' అన్నారు ఆ పిల్లలు'

నళినీకాంతం తల వొంచుకున్నాడు. హృదయంలో కోపం రగిలిపోతున్నది. ఇది తప్పకుండా చలపతి చేయించిన దుష్టచర్య అనుకున్నాడు. ఆ చీకట్లో ఆ పిల్లలు ఎవరైందీ గుర్తు తెలియకండా వుంది, నళినీకాంతానికి. ఇక అక్కడ వుంటే మర్యాదకు భంగకరమని, గబగబ పెద్ద అడుగులు వేసుకొంటూ, వెనక పిల్లలు గోలచేస్తూన్నా అలకించకుండా యింటికి వొచ్చాడు.

4

తలమీద అంతపెద్ద గాయాన్ని చూసి భయపడింది, నళినీకాంతం భార్య.

'అదేమిటండీ?', అన్నది అక్కజపడుతూ.

'ఏం లేదులే - ఏదో ఒస్తూంటే, పొడుచుకొంది' అని నీళ్లు నమిలాడు నళినీకాంతం.

'ఎక్కడ పొడుచుకొందీ! పంచపాళీయా?'

'ఊఁ!' అన్నాడు, నళినీకాంతం. జరిగిన పరాభవం భార్యకు తెలీటం యిష్టం లేదు. ఉద్యోగానికి నీళ్లు వొదులుకొని వెంటనే తనవూరు వెళదామంటుంది. అంచాత నళినీకాంతం చిన్ని అబద్ధమాడాడు.

'నామాట యిప్పుడు తెలిసివొచ్చింది. ఎందుకు చెప్పండి ఈ బాధంతా? చూడండి ఎంత దెబ్బ తగిలిందో - ఇప్పటికైనా నామాట వినండి. మనవూరు వెళదాం.' అని పాతపారాన్ని వల్లించింది, నళినీకాంతంభార్య, తడిగుడ్డను తలకు చుడుతూ.

నళినీకాంతం మాట్లాడలేదు. చలపతిమీద అరికాలిమంట నెత్తికెక్కుతున్నది. వెధవ ఎంతకు తెగించాడు? నళినీకాంతం భార్య గాయానికి మందు వేస్తూ చిన్న వుపన్యాసాన్ని దంచుతున్నది.

'మనకేం తక్కువ - ఈ వెధవవుద్యోగం చేయడానికి. ఈ అద్దెయిళ్లలో నానా యిబ్బందులూ పడటానికి. నేను మొదట్నుంచీ మొత్తుకుంటూనేవున్నా - విన్నారు కాదు. ఇంకా ఇప్పట్లో మీకు తెలిసి రాదులే. ఇంకా యేదో పెద్ద ప్రమాదం వచ్చేవరకూ. మన దురదృష్టానికి తగ్గట్టు యింత వూరులో ఈ వూరిల్లే అద్దెకు దొరకాలీ?'

'అబ్బా! కట్టిపెట్టవే నీ గోల' అని విసుక్కున్నాడు నళినీకాంతం.

'ఇదుగో! మొదట్నుంచీ ఇట్లా విసుక్కోవటంకూలాన్నే, నామాటల్ని చెవిన పెట్టడంవల్లనే - ఇంతవరకూ వొచ్చింది. ఇంతకీ బుద్ధితక్కువ నాది' అని వూరుకుంది నళినీకాంతంభార్య.

మరునాడు నళినీకాంతానికి స్కూలుకు వెళ్లేందుకు మనస్కరించలేదు. వారం రోజులు శెలవు పెట్టాడు. ఇంకో వారం రోజులకు క్రొత్త మాష్టారుకు జరిగిన పరాభవం స్కూలుమొత్తానికి తెలిసింది. నళినీకాంతం హెడ్‌మాష్టరుకు చెప్పాడు. పైగా చలపతిమీద చర్యతీసుకోమని అన్నాడు.

హెడ్‌మాష్టరు నవ్వి - 'వాడిట్లా చేయటం క్రొత్తకాదు. కోపం వస్తే మాష్టర్ల నేమిటి? నన్నుకూడా కొడతాడు. అందుచాత వాడి జోలికి ఎవ్వడూ పోడు.' అని చప్పరించాడు.

స్కూలులో అల్లరిచేసే ఒక విద్యార్థి విషయంలో యింత అశ్రద్ధగా హెడ్‌మాష్టరు ఎందుకుంటున్నాడో అర్థంకాలేదు, నళినీకాంతానికి. స్కూలును సరైన పద్ధతుల్లో వుంచటం హెడ్‌మాష్టరు వుద్యోగధర్మం. దానిని మరవటంలో హెడ్‌మాష్టరు ఉద్దేశ్య మేమిటి?

'వాడి విషయంలో మీ రింత అసమర్థంగా వుండటం సమంజసంగా లేదు' అన్నాడు నళినీకాంతం.

హెడ్‌మాష్టరుకి కోపం వచ్చింది. 'వాడి విషయం మీకు తెలీదు. మెదలకుండా వూరుకోండి.'

నళినీకాంతం పాఠాల్ని సక్రమంగానే చెప్పుకుపోతున్నాడు. కాని విద్యార్థుల మాటలు కొన్ని వినకతప్పటంలేదు. చెప్పిన పాఠాల్లో ప్రశ్నలు వేయటంలేదు. కాంపోజిషన్ వ్రాయనివాళ్లను యేమనటంలేదు. రెసిటేషన్ వొప్పజెప్పనివాళ్లని యేమనటంలేదు. ఇందువల్ల తను ఉద్యోగధర్మాన్ని కోల్పోతున్నాడని బాధపడుతున్నాడు. కాని సంవత్సరాంతపరీక్షలో ఇంగ్లీషు పేపర్లు దిద్దటంలో తాను చాల నియమంగా వుండాలని గట్టిగా తీర్మానించుకోవటంతో ఆ బాధ కొంత సడలిపోయింది.

క్వార్టర్లీ, హాఫ్‌యర్లీ యగ్జామినేషన్లు జరిగిపోయినయి. నళినీకాంతం యింగ్లీషు పేపర్లు చాలా ఖచ్చితంగాచూశాడు. అందువల్ల క్లాసులో పదిహేను మార్కులకుమించి యిద్దరుముగ్గురుకు తప్ప ఎవ్వరికీ రాలేదు. చలపతికీ, మాయమాధవుడికీ రెండు పరీక్షల్లోనూ అయిదు మార్కులకు మించి రాలేదు.

భార్యపోరును భరించలేక అద్దెయిల్లు

(47-వ పేజీ చూడండి)

నిండుహృదయాలు

శ్రీ బి. రామనాథ్

'సీత యేది? మామ్మా?' యింటికి వచ్చి రావడంతోనే ప్రశ్నించాడు నారాయణ బూట్లయినా విప్పకుండానే.

'ఏదీ? యింట్లో లేదూ?' అని దీర్ఘంతో సమాధానం యిచ్చింది ముసలమ్మ.

'ఏంచేస్తున్నది?' అంటూ బూట్లు విప్పి త్వరత్వరగా ఆఫీస్ డ్రెస్ విప్పేసి ధోవతి కట్టుకొని లోపలకు వెళ్లాడు...

'సీతా?' మధ్య యింట్లోనుండి అతను వేసిన యీ చిన్న కేకకు అక్కడే తొంగ్లాడుతున్న పిల్లికూన అదిరిపడి గోతాలచాటున నక్కింది. కాని రావలసినచోటునుండి సమాధానం రాకపోవడంచేత అసందిగ్ధమైన మనస్సుతో వంటింట్లో ప్రవేశించాడు నారాయణ. అక్కడా లేదు, సీత.

అతడి ఆశ్చర్యం యింతా అంతా కాదు. దొడ్లోకి వెళ్లి కాళ్లూచేతులూ కడుక్కుని టవల్‌తో తుడుచుకున్నాడు...

'ఎక్కడికి వెళ్లివుంటుంది సీత?' అని ఆలోచిస్తూ యీజీచైర్లో వడుంవాల్చాడు నారాయణ. చేతుల్లో పత్రికఉన్నా అతని దృష్టిమాత్రం అక్కడ లేదు. అతడి మెదడు అనేక ఆలోచనల్తో నిండిపోయింది...తన వివాహంనాటినుండి నేటివరకూ జరిగిన తన జీవితాన్ని నెమరు వేసుకుంటున్నాడతను.

'ఎంతసేపయిందండీ వచ్చి?'

ఆకస్మికంగా చెవినిపడిన యీ మధుర ధ్వని అతని ఆలోచనల్ని ఆరికట్టి వాస్తవిక ప్రపంచానికి తెచ్చింది.

తలయెత్తి చూశాడు—సీత!

సీత కంఠధ్వనిని పసిగట్టిన ముసలమ్మ 'ఎక్కడికెళ్లావే?' అని మళ్లీ దీర్ఘం తీసింది.

'దొడ్డికి వెళ్లొస్తున్నా మామ్మా!' అని ఆవిడకు సమాధానంచెప్పి, 'లేవండి, వడ్డిస్తున్నా' అని భర్తను హెచ్చరించి వంటింట్లోకి అదృశ్యమయింది సీత.

నారాయణ తన ఆలోచనల్ని మధ్యలో వదిలేయడం యిష్టంలేనట్లుగా అదేవిధంగా ఉండిపోయాడు.

నాలుగైదు నిమిషాలు గడచినయ్...

'వడ్డించా...రారేం?..మిమ్మల్నే!'...

బద్ధకంగా వళ్లు విరుచుకుని, మందంగా లేచి వంటయింట్లో ప్రవేశించాడు. అప్పుడే వెండి పళ్లెంలో అన్నం వడ్డించింది సీత.... నోరు మెదపకుండా పీటమీద చతికిల పడ్డాడు...

'ఇన్ని వేశావేం? ఒక్కసారి'

'ఏం?' అన్నది సీత విసనకఱ్ఱతో పొగలువచ్చే అన్నాన్ని విసురుతూ......

'పీటల్లో యేది కలుపుకోవాలి ముందు?' నారాయణ మళ్ళీ ప్రశ్నించాడు.

'మీ యిష్టం...' అంతకంటె మంచి సమాధానం దొరకలేదు, సీతకు.

సీత 'సుభావం' నారాయణకు కోపం తెచ్చిపెట్టింది.

'అవున్లే...అన్నీ ఒక్కసారే వేసేస్తే మళ్ళీ లేవకుండా హాయిగా కూచో వచ్చు కదా అని.'

'అవును...హాయిగా కూచుందామనుకుంటే మీరు-' అంతవరకూ అని నాలిక కొరుక్కుంది సీత.

వాక్యం అసంపూర్తిగా వదలినా, దాని భావాన్ని గ్రహించడానికి నారాయణకేమీ కష్టం కలుగలేదు.

'అట్లాగైతే నాకింకా యేమీ అక్కర్లేదు. పో...పోయి పడుకో' అనిమాత్రం అనేసి, మెదలకుండా కూర కలుపుకున్నాడు.

సీతకు మాటలు దొరకలేదేమో-మాట్లాడకుండా నెయ్యివేసేసి 'ఇంకా కొంచెం కూర వేసేదా?' అని అడిగింది.

'అక్కర్లేదు' ఖచ్చితంగా-కఠినంగా-సమాధానమిచ్చాడు నారాయణ. సీత కర్థమైంది-భర్తకు కోపం రానేవచ్చిందని. నెమ్మదిగా కూరముక్కలు వడ్డించింది....

'నువ్విక్కణ్ణుంచి పోతేగాని నేను అన్నం తినను.' భీష్మించాడతను. సీత మెదలకుండా లేచి మధ్యయింట్లోకి వెళ్లి చాప పఱచుకుని దిండు వేసుకుని పడుకుంది.

చాప పఱచిన చప్పుడూ-దిండు మోతా నారాయణ విన్నాడు. అందులోని విసురూ - కాఠిన్యతా అతనికోపాగ్నిలో ఆజ్యంపోశాయి. ఒళ్లు మండిపోతూంది దతనికి. మళ్ళీ ఆలోచనల్లో పడ్డాడు...తింటూనే ఆలోచిస్తున్నాడు. ఎంత నిర్లక్ష్యం వెళ్లమనగానే వెళ్లటమే? తనకేంకావాలో అని అక్కడ కూచోనక్కర్లేదా? ఒక్క మాట అనగానే అంత అహంకారమా! స్త్రీకి యెంత ఓర్పు అడుకువా వుండాలి? తన భర్త అంటేనే అంత కోపమా! మనిషంటె లెక్క చేయకపోతే?......ఎంత నిర్లక్ష్యం! ఎంత అహంకారం!! ఎంత పొగరు!!! ఛీ! దాని మొహం చూడరాదు యిక!...తన కాళ్లముందు పడేలా చేయాలి...

అంతులేని ఆలోచనలతో అతని బుఱ్ఱ వేడెక్కుతూంది. అన్నం రుచిలేకుండా పోయింది...వంకాయపచ్చడీ విసుగ్గా కలుపుకుని నెయ్యి నాలుగు గరిటెలు వేసుకుని కళ్లుమూసుకుని ముద్దనోట్లో పెట్టుకుని గట్టిగా నిట్టూర్చాడు.

"పచ్చడి కావాలా?"

ప్రక్కకు చూశాడు - సీత గడపమీద కూచుని ఉంది.

"అక్కర్లేదు...మజ్జిగ పోయ్..."

'కొంచెం అన్నం పెట్నా...'

'ఒద్దు...' చాల కఠినంగాఉంది జవాబు.

మెదలకుండా లేచివెళ్లి అన్నంపళ్ళెం తెచ్చి వడ్డించింది సీత.

'ఒద్దంటె యెందుకూ పెట్టావ్?' అన్నాడు—పళ్లు కొరుకుతూ!

'తినటానికి'—లక్ష్యంలేని జవాబు!

'పళ్లెం తీసుకురా...కొంచెం తీయాలి.'

ఆమె పళ్లెం తేవడమూ - అతడు రెండు కరుళ్లుతీసి అందులో పెట్టడమూ జరిగినప్పుడు అతని హృదయంలోని తుఫాను అంతా యింతా కాదు!

భోజనానంతరం జేవురించిన మొహంతో వచ్చాడు మధ్యయింట్లోకి. చాపమీద నడుము వాల్చినా ఆలోచనలు అతణ్ణి వదల్లేదు...

అన్నిపనులూ తెముల్చుకోని సీత మధ్యయింట్లోకి వచ్చి పెట్టెతెఱచి వక్కపలుకూ లవంగమూ తీసి భర్తకు యివ్వబోయింది. అతను చూడనట్లు నటించాడు. చేయి

యింకా ముందుకు జాపి 'పక్క పలుకు' అంది.

'నా కొద్దు' అన్నాడు నారాయణ ఖచ్చితంగా.

సీత మాట్లాడకుండా అవి క్రింద పెట్టి వెళ్లిపోయింది. కొంచెంసేపు తటపటాయించి వాటినితీసి నోట్లో వేసుకున్నాడతను.

ఆలోచిస్తూ పడుకుంటే నిద్రపట్టింది... లేచేసరికి మూడు కొట్టబోతున్నది. ఆదరాబాదరా లేచి ఆఫీసుకు పరుగెత్తాడు నారాయణ.

ఆనాడు సాయంకాలం యింటికి చాల ఆలస్యంగా వచ్చాడు. ఆఫీసు అయిదింటికి వదలినా, బజార్లో కాసేపూ—పార్కులో కొంతసేపు కాలంగడిపి యేడుగంటలకు రేడియోవార్తలుకూడా విని, యేడున్నరకు యింటికిచేరాడు. ఇంటికి వచ్చేటప్పుడే మనస్సు దృఢపఱచుకున్నాడు— 'తాను సీతతో మాట్లాడకూడదు - ఎంత బ్రతిమాలినా సరే!' అని దృఢనిశ్చయంతో యింట్లో అడుగు పెట్టాడు.

ఏమీ మాట్లాడకుండా డ్రస్ విప్పేసుకుని తువాలు కట్టుకుని స్నానానికి దొడ్లో బావిదగ్గఱకు వెళ్లాడు. అదేసమయంలో సీత దొడ్లో ప్రక్కింటావిడతో మాట్లాడుతూ కూచుంది. భర్త బావి దగ్గఱకు వెళ్లటంచూసి వెంటనే లేచి వంట యింట్లో పొయ్యిమీదఉన్న వేన్నీళ్ల కాగును పట్టి తీసుకెళ్లింది బావిదగ్గఱకు త్వరగా... కాని, అప్పటికే నారాయణ రెండుచేదలు చన్నీళ్లే తోడుకుని పోసుకున్నాడు. సీత వేన్నీళ్లు బిందెలో పోసి...'వేన్నీళ్లుంటే చన్నీళ్లుచేస్తారేం?' అంది బొక్కెనకోసం చేయి జాపి. నారాయణ సమాధాన మివ్వకుండా బొక్కెన బావిలో వేశాడు. సీత అతనికి దగ్గఱగా వెళ్లి చేతిలోని చేంతాడు లాక్కుని, రెండుచేదలు తోడి బిందెలోపోసి 'వేన్నీళ్లు పోసుకోండి' అని వంటింట్లోకి వెళ్లిపోయింది.

కాని ఆ మాటలు నారాయణకు వినపడలేదు...అతను వినిపించుకోలేదు. మామూలుగా—యేమీ యెఱుగనట్లే—చన్నీళ్లు తోడిపోసుకుని, తువ్వాలుతో ఒళ్లు తుడుచుకోని, ఒక బొక్కెడు నీళ్లల్లో వాటిని తడిపి-పిండుకోని దణ్ణెంమీద ఆరేసి యింట్లోకివెళ్లి ధోవతి కట్టుకున్నాడు...

మామ్మ మడికట్టుకుంటున్నది ... సీత పీటలు వేసి మంచినీళ్లు పెడ్తున్నది...చెల్లెలూ తమ్ముడూ చదువుకుంటున్నారు...నారాయణ యివన్నీ చూడకుండా వీథిలోకి వెళ్లి అరుగుమీద అటూయిటూ పచార్లు సాగించాడు.

చంద్రోదయం కాలేదింకా...నక్షత్రాలు ఆకాశంలో అల్లుకుపోయి విచిత్రమైన ముగ్గుల్ని ప్రదర్శిస్తున్నయ్. చల్లని పిల్లగాలి హాయిగా వీస్తున్నది...కాని నారా



యణకు యివన్నీ కనపట్టంలేదు. అత నేదో అతి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు...

స్త్రీలని అదుపులో ఉంచాలి. లేకపోతే లాభంలేదు. నెత్తికి యెక్కి తీరుతారు. వాళ్లు చెప్పినట్లు చేయాల్సివస్తుంది. అంటే మనం వట్టి దద్దమ్మలం కావాల్సివస్తుం దన్న మాట. వాళ్లకు చనువిస్తే అంతే! అందుకనే ఆడవాళ్లతో కోపంగా అదిలిస్తూ, విదిలిస్తూ, యీసడిస్తూ మాట్లాడాలి! కోపంగా ఉండాలి యింట్లో — యెప్పుడూ నవ్వకూడదు వాళ్లముందు. నవ్వామా యిక లాభం లేదు! నెమ్మదిగా మనల్ని బుట్టలో నే వేసుకుంటారు! కబుర్లతో — క్రీగంటి చూపులతో — చిఱునవ్వులతో దగ్గఱకు చేరుతారు! కోపంగా ఉన్నట్లు నటిస్తే అసలు అంత చనువుగా రానేరారు! భయపడుతూ భయపడుతూ మనం చెప్పినదల్లా విని అదుపాజ్ఞల్లో ఉంటారు...అందుకనే గామాల్ను నాన్న అమ్మతో యెప్పుడూ కరకుగా కసురుతో మాట్లాడ్తారు!!...

'వడ్డించా...' నారాయణ యీ మాటలు వినిపించుకోలేదు.

'మిమ్మల్నే!......అన్నానికి రాండి.' నారాయణ వినిపించుకోదలచలేదు. అట్లాగే ఆకాశంవంక చూస్తో నిలబడ్డాడు.

సీత యింకాదగ్గఱగావచ్చి 'మిమ్మల్నే!' అన్నది....

'ఆ!' అన్నాడు అప్రయత్నంగా ...

'అన్నానికి రమ్మంటున్నా...' అన్నది సీత - ప్రాధేయపడుతూ - దీనంగా...

'...ఊఁ....' అనిమాత్రం అని యింట్లోకి వెళ్ళాడు.

వంటయింట్లోకి వెళ్లి మెదలకుండా పీట మీద కూర్చుని తలకాయ వంచుకొని 'అపోసన' పట్టాడు...

వంకాయకూర కలుపుకుని నెయ్యి వెయ్యకుండానే తినటం ప్రారంభించాడు. ...సీత అంటుచెయ్యి కడుక్కుని నెయ్యి వేస్తుంటే 'వద్దు నాకు' అని అరిచాడు... ఆ అరుపుకు మామ్మ తలకాయెత్తి చూసి 'ఏమిట్రా...' అన్నది...అతను మాట్లాడలేదు.

సీత మెదలకుండా రెండు గరిటెలు నెయ్యి వేసి 'నెయ్యి వద్దంటున్నారు, మామ్మా!' అన్నది.

'ఏంరా? పిచ్చికొయ్యా! నెయ్యివద్దంటం యేమిట్రా!...'

'వద్దంటుంటే యెందుకు వేయాలి?' అతను అన్నాడు - కాదు - అరిచాడు.

'నెయ్యి లేకుండా నాకు ఒక్క మెతుకైనా దిగదు!...ఏమైనా వద్దనవచ్చుగానీ నెయ్యి వద్దనేవా శైవప్రా!'

'వారికి కోపం వచ్చిందిలే, మామ్మ... నువ్వు కానీ....' అనేసి నాలిక కరుచుకుంది సీత......

'మజ్జిగ పోయ్!...' తలకాయ వంచుకునే అడిగాడు నారాయణ.

'అదేమిటీ! కూరంతా పారేశారు... పచ్చడి అసలు ముట్టుకోనేలేదు...చారు పెట్టాను...'

'మజ్జిగపొయ్యి!...' అదే స్వరంతో యింకా కటువుగా యీసారి...సీత చిన్నబోయింది...అట్లాగే చూస్తూనిలబడింది....

'పోస్తావా? లేచి పొమ్మన్నావా?'

అంతపనీ చేసేపట్టుదల ఉన్నదని సీతకు తెలుసు. అయినా ఆమె సహించలేక పోయింది యిది - కోపం తనమీదవస్తే రావచ్చు...అన్నం సరిగా తినకపోవటం.. ఆమె హృదయానికి బాధాకరంగా తోచింది....

'చారన్నా పోసుకోరూ?' అతి దీనంగా వేడుకొన్నది ఆమె. అతను మాట్లాడలేదు.

'కొబ్బరి పచ్చడి - '

'మజ్జిగ పొయ్యమన్నాను' సగంలోనే అందుకున్నాడు....

ఆ స్వరంలోని కాఠిన్యానికి సీత నిశ్చేష్టురాలయింది...ఇక లాభం లేదనుకుని మజ్జిగ పోసింది...

అతను రెండుమూడుసార్లు జూరి లేచిపోయాడు...

'ఇవిగో నీళ్లు -' అనే సీతమాటలను వినకుండానే దొడ్లోకివెళ్లి బిందెలోని నీళ్లు ముంచుకుని కడుక్కున్నాడు...

'దొడ్లో చీకటి...' అంటూ సీత లాంతరు తెచ్చేలోగానే చెయ్యి కడు



కుక్కని వచ్చేశాడు...ముందు గదిలోనికి వచ్చి కుర్చీలో మేను వాల్చాడు...

పిల్లలు చదువుకుంటున్నారు...

'క్రోధోన్మత్తుడు' అంటే యేమిటి అన్నయ్యా?' అని అడిగాడు తమ్ముడు...

'నోర్మూయ్!' అని అరిచాడు చదువుకునే వాళ్లు అదిరిపోయేట్లు! మళ్లీ వీధి అరుగుమీద చేరి పచార్లు సాగించాడు...

మామ్మ భోజనం అయింది. 'నా పక్క బట్టలేవే, అమ్మా?' అంటూ దీర్ఘాలుతీస్తూ పంచలోకి వచ్చింది....

'వస్తున్నా, మామ్మా' అంటూ సీతవచ్చి మంచంవాల్చి పక్క వేసింది. పిల్లలక్కూడా పక్క వేసి తమ పక్కకూడా వేసేసి వీధిలోకివచ్చి చూసింది...భర్త దగ్గరకు వెళ్లి 'పక్క వేశా...' అని చెప్పి యింట్లోకి వెళ్లింది...

కంచంముందు కూచున్నది భోజనానికి.. వేసిన కూర సగమైనా తరగలేదు. కొబ్బరి పచ్చడి అంతా అట్లాగే ఉన్నది....అన్నం చాలా మిగిలింది...చారు అసలు పోసుకోనే లేదు! ఏం తిన్నట్లు?...తనమీద అంత కోపం యెందుకు రావాలి? తనేం చేసిందని? కళ్లవెంట కారే నీళ్లు తుడుచుకుని కంచం తీసుకు ఎంగిలిపడి త్వరగా పని ముగించుకుని యివతలి యింట్లోకి వచ్చింది....

పగలంతా పనిచేసిన చీర విప్పేసి ఉతికిన తెల్ల చీరె కట్టుకుంది...మొహం కడుక్కొని బొట్టు పెట్టుకున్నది...హిమాలయా బూకే పౌడర్ అద్దుకుని అద్దంలో ఒకసారి ప్రతిబింబం చూసుకుని వాకిటి తలుపు గడియ వేసివచ్చి పెట్టెలోని వక్క పలుకూ లవంగమూ తీసికొని గదిలో ప్రవేశించింది. ఒక్క క్షణం అలాగే నిలబడిపోయింది...

తను వేసిన పక్క తీసేసిఉన్నది...వేరే ఒక 'జంపఖానా' పరుచుకొని భర్త పడుకొని ఉన్నాడు!..

నెమ్మదిగా దగ్గరకు వెళ్లింది...పక్కనే కూర్చుని వక్క పలుకు నోట్లో పెట్టబోయింది.

అతను నోరుమూసుకుని నిద్రపోయినట్లు నటిస్తున్నాడని తనకు తెలుసు...వక్క పలుకు నోట్లో పెట్టింది....

విసురుగా అవతలకు నెట్టాడు ఆమె చేతిని...వక్క కాస్తా యెక్కడో పోయి పడింది...

ఆమె ఖిన్నురాలయింది...అతని గడ్డం పుచ్చుకుని అన్నది....

'ఎందు కంత కోపం?'

అతను మాట్లాడలేదు....

'చెప్పరూ?......నేనేం చేశాను?' దీనంగా ప్రార్థించింది సీత అతని ఒడిలో తలదూర్చటానికి ప్రయత్నిస్తూ...

అతను యేమీ మాట్లాడకుండా నెమ్మదిగా అటుతిరిగి పడుకున్నాడు...

అతని మొహంమీద ఆనించి ప్రాధేయపడింది...'నే నేం తప్పు చేశానో చెప్పరూ?...'

అతను కళ్లుమూసుకునే అన్నాడు-'వెళ్లు యిక్కణ్ణించి.'

'ఎక్కడికి వెళ్తాను? మీ దగ్గిర్నించి?' అతని చెక్కిళ్లను అరచేతుల్తో రాస్తూ అన్నది, సీత.

'పో-ముందు......లే-యిక్కడ!' చేతుల్ని ఆమడదూరం పారేసినట్లు తోసేశాడు...'నాతో నీకు పన్లేదు!'

నిశ్చేష్టురాలయింది సీత...తన భర్తతో తనకు పనిలేదు?...

కళ్లవెంట అశ్రువులు గిరున తిరిగి ముత్యాల్లా మెరుస్తూ చెక్కిళ్లవెంట జారి అతని చెంపమీద టపీమని పడ్డాయ్-ఆకాశం నుండి గంగ శివుని శిరస్సుమీద దూకినట్లు...

నారాయణ గ్రహించాడు...తానన్న మాట ఆమె హృదయాన్ని చీల్చి వేసిందని గ్రహించాడు...అవి సీత అశ్రుధారలు!...

ఎవరినైతే తాను ప్రాణాధికంగా ప్రేమిస్తున్నాడో - ఎవరు తనకు సర్వస్వమూ అర్పించి తనమీద ఆశలు పెట్టుకున్నారో - ఆ ప్రేమదేవత కన్నీళ్లు కారుస్తున్నదని అతను తెలుసుకున్నాడు....ఆమె దుఃఖానికి కారణం యెవరు?...

ఈ ప్రశ్నకు సమాధానం వచ్చేందుకు అతని అభిమానం అడ్డు తగిలిందేమో!... అవును! తానంటే లక్ష్యం లేనప్పుడు ఆమె కన్నీళ్లను తానెందుకు లక్ష్యపెట్టాలి?... స్త్రీలకు అలవాటేగా యీ కళ?

వాళ్ల కళ్లవెంట నీళ్లురాగానే మగవాళ్లు వెన్నపూసల్లాగా కరగిపోయి, సముదాయిస్తే యింకేమున్నది? దాసోహంఅన్నమాటేగా!

కన్నీళ్ళు ఆడవారికి బ్రహ్మాస్త్రం! తాను దానికి లొంగుతాడా? ఆలోచిస్తూ-నిద్రపోతున్నట్లు పడుకున్నాడతను...

ఈ నిర్లిప్త భావాన్ని సీత సహించలేకపోయింది...వెంటనే ఆతనిపై ఒరిగిపోయి అతని వక్షంలో తలదూర్చి గద్గదస్వరంతో ప్రాధేయపడింది...'నన్ను క్షమించరూ?.. నాతో మాట్లాడరూ?' నారాయణ ఆలోచనలకు బ్రేక్ పడింది...అతనికి తెలియకుండానే అతని హృదయంలో కరుణరసం ఉద్భవిస్తున్నది...అతని కళ్లు చెమర్చినవి... అయినా అతని అభిమానం పూర్తిగా పోలేదు.

అనాదికాలంనుండీ పురుషుడు స్త్రీపట్ల ప్రవర్తించే విధానాన్ని నిర్దేశించే భావాలు కరుడుకట్టిన ఆ అనాగరిక భావాలే అతనిలో తిష్ఠవేసినయ్......కరుణరసాన్ని, ప్రేమ ప్రవాహాన్ని అడ్డి పైకిరాకుండా ఆపేస్తున్నయ్ అవి...

'నీవు ఇక్కడనుంచి వెళ్తావా వెళ్లవా?' నాతో నీకేమీ పన్లేదని చెప్పలా?' అతనిలో మిగిలిఉన్న కాఠిన్యాన్నంతా ప్రోగు చేసుకుని దూరంగా తోసేశాడామెను....

ప్రవాహం కట్టలు తెగిపోయినయ్... అణగిఉన్న అశ్రుధారలు అనూంతంగా ఉప్పొంగి అలలు అలలుగా ప్రవహించనారంభించినయ్...అట్లాగే వెక్కి వెక్కి యేడుస్తూ పడుకుంది సీత....

తానేం తప్పుచేసిందో తనకు తెలీదు... కాని దానికి కఠోరశిక్ష!...

తెల్లవారినది మొదలూ ప్రొద్దుగూకే దాకా యింటి పనుల్లో-ఊపిరి పీల్చుకోటానిక్కూడా వీలూ, తీరికా లేనట్లుగా-ఒక యంత్రం పనిచేసినట్లు-బండచాకిరీ చేసి అలసిపోయి, రాత్రి విశ్రాంతిగా-హాయిగా భర్త ఒళ్లో పడుకుని-తానుపడే బాధలూ, యాతనలూ మఱచిపోయి-అతని ప్రేమపలుకుల తీయదనాన్ని రుచిచూస్తూ-అతని లాలింపులలో మైమఱచి పరవశత్వంతో-యీ ప్రపంచాన్నీ-కుళ్లు సమాజాన్నీ - తోడేళ్లవంటి మానవుల ఘాతుకత్వాల్నీ-అన్నిటినీ మఱచి - స్వర్గసీమల్లో విహరిద్దామని కోరుకుంటుంది స్త్రీ...పురుషుడు ఎన్ని బాధలు పెట్టినా అసమాన సహనంతో భరిస్తుంది స్త్రీ... పురుషుడి కోసం - పురుషుడి సుఖంకోసం - యెన్ని త్యాగాలన్నా చేస్తుంది స్త్రీ...కాని ఆమె వీటన్నిటికీ కోరే ప్రతిఫలం ఒక్కటే - భర్త హృదయం!...అతని చిరునవ్వు! తానూ అదేవిధంగా ఆశించింది...నిజానికి తాను పుట్టింట్లో అల్లారుముద్దుగా పెరిగింది; కాపురాని కొచ్చేముందు తానూ తన భర్తా ఒక చక్కని చిన్న యింట్లో ఆదర్శ దాంపత్యపు ఆనంద డోలికల్లో ఉయ్యాల లూగుదామని కలలు కన్నది; కాని యీవిధంగా యింత పెనుభూతంలాంటి యిల్లూ...మనసుల్ని కలతలు పెట్టే మనుషులూ....చివరకు చీటికీ మాటికీ కోపపడి త్రోసివేసే భర్త ప్రవర్తనా...తన బ్రతుకెంత హేయంగా తయారయింది!...భర్తకే పనికిరానప్పుడింకా జీవించి యేం ప్రయోజనం?...

సీత వెక్కి వెక్కి యేడుస్తున్నది...నారాయణ నిద్రపోతున్నట్లు పడుకున్నాడు... కాని అతని హృదయం ద్రవించ నారంభించింది.

'అనవసరంగా సీతను యేడిపిస్తున్నావ్!' పశువులాగా ప్రవర్తిస్తున్నావ్ హృదయం లేదూ? మనుష్యుడివి కాదూ?' అంతర్వాణి ముల్లుకర్రతో అతణ్ణి పొడుస్తున్నట్లుంది... ఇంతకీ సీతచేసిన తప్పేమిటి?' సూటిగా ప్రశ్నించింది అంతరాత్మ...

సమాధానం లేదు!...అవును సీత యేం చేసింది? తానే అనవసరంగా ఆమెను బాధించాడు...ఆమెచేసిన పొరబాటేమీ లేదు...లేనిపోని అభిమానంతో - పశుత్వాన్ని గుర్తుకుతెచ్చే నీచభావాలతో— అర్థంలేని కరుడుగట్టిన పురాతనపు పుచ్చు ఆలోచనలతో - హృదయంలేకుండా ప్రవర్తించాడు తను!...తనను సీత యెంత ప్రేమిస్తున్నదో తనకి తెలీదూ? అటువంటి తన సీత - తన కళ్లముందు - దిక్కులేని దానిలాగా రోదిస్తూంటే శిలావిగ్రహంలా చూస్తూ ఊరుకుంటున్నాడు తాను. 'ఛీ! పశువా!...నీ హృదయంలో ప్రకాశించే ప్రేమజ్యోతిని చూడు! ఆకాంతిలో సీత మూర్తిని తిలకించు! ఆమెను ఆరాధించు! ఆమె నీ దేవతామూర్తి!...'

నారాయణ కళ్లు చెమర్చినయ్...అశ్రుధారలు అంతులేకుండా ప్రవహిస్తున్నయ్.. ఇక ఉండలేకపోయాడు.

వెంటనే లేచి సీతదగ్గిరికి వెళ్ళాడు... కింద - చాపయినా లేకుండా - పడుకుని ఉన్నది సీత...కూచున్నాడు...తొడమీద సీత తల ఉంచుకొని ముంగురుల్లు చేత్తోసర్దుతూ 'సీతా!...నన్ను క్షమించవ్?' అన్నాడు కద్గదస్వరంతో. కళ్లు తెరిచింది సీత..భర్త కళ్లల్లో చూసింది...నీళ్లతో తడిసిపోయిన అతని కళ్లను తుడిచింది—చిరునవ్వుతో!

'నన్ను క్షమించవ్! సీతా?' మళ్లీ అదే ప్రశ్న వేశాడతను!

'తప్పు! మీరే నన్ను క్షమించాలి!' అంది సీత. అతని వక్షంలో మొహం దాచుకుంటూ!

'సీతా!......నా హృదయాధిదేవతా!' అన్నాడు నారాయణ ఆమె నుదురును పెదవులతో చుంబిస్తూ!

చీకట్లు విరజిమ్మే ఆకాశంలో అప్పుడే చంద్రోదయమైంది...... ★

సెక్సు విజ్ఞానం

(9 వ-పేజీ తరువాయి)

"వారి ప్రేమ వేరు. నా ప్రేమ వేరు. ఒక్కవిషయానికి నిజం చెప్పు పోనీ. నీ భర్త ఏజబ్బుచేతైనా బాధపడుతున్నాడా?"

"లేదు. అధమం ఆయనకు నీలాటి కాముజ్వరం కూడ రాలేదు."

"ఏం కోరిక లేకుండానే నువ్వు నావేపు రోజూ అదోలా చూస్తూన్నావా? మా సాహిత్యాల సిద్ధాంతంప్రకారం నీభర్తలో ఏదో లోపం ఉండి తీరాలి. అదే నువ్వు దాస్తున్నావ్. దీనివల్ల నా ఒక్కడికే కాకుండ సాహిత్యానికే అవమానం తలపెడదామని చూస్తున్నావ్. నేను వూరుకొన్నా మా సాహిత్యం క్షమించదు. పోనీ దీనికేనా నిజం చెప్పు. నీ భర్తకేమైనా అంగలోపముందా?"

"ఏమిటీ వాగుడు. నిక్షేపంలా అతడు ఉద్యోగం చేసుకుంటూ ఉంటే మధ్య నీపోరేమిటి? నీవేపు చూసినంతమాత్రాన్న నిన్ను ప్రేమించినట్లేనా? ఆదిలో నీ వెకిలి చూపులు చూసేను. తరువాత పిచ్చిగా తయారయ్యావ్. నీకు బుద్ధి చెబుదామని చాలా రోజులపట్టి అనుకొన్నాను. యింకా వాగేవంటే దొంగవని పోలీసులకో, పిచ్చివాడవని పిచ్చి ఆసుపత్రికో ఒప్పచెబుతా"అన్నది తీక్షణంగా.

"శ్రీ లక్ష్మి మన మిద్దరమూ బాల్యమిత్రులము, తెలుసా?"

"అందుకనే ముందుగా నెమ్మదిగా చెప్పేను. హద్దు మీరితే—"

"శ్రీ లక్ష్మి నిన్ను నేను ప్రేమిస్తున్నా?"

"మళ్లీ మొదటి కొస్తున్నావ్. పెళ్లిఅయి భర్తతోనున్న నన్ను ప్రేమించట మేమిటయ్యా! త్వరలో నేను మాతృస్థానం కూడ పొందగలుగుతున్నాను. ఇంక వెళ్ళు. మరెప్పుడూ అన్యస్త్రీవేపు చూడకు. వెళతావా? వెళ్లవా?"అని అడిగింది తీక్షణంగా.

సీను ఒక అడుగుపైన వేస్తూ "సెక్సు కథలు నీవు చదవలేదూ" అని అడిగేడు జాలిగా.

"ఇంతవరకూ ఆ గ్రహచారం రాలేదు"

"మా సాహిత్యం?"

"అదీ, నువ్వూ కలిసి గంగలో పడండి. ఎవడికొక్కవాలి. ఇకనైనా వెళతావా? దేహశుద్ధి కావాలా?"

ఆ రాత్రి సీను కల గంటాడు. కలలో పెద్ద సుడిగాలి వీస్తుంది. తన టేబిలుమీద నున్న సెక్సు పత్రికలన్నీ ఎగిరిపోతాయ్. వాటిని ఏరితేవడానికి వాటితోపాటు పరుగెడతాడు. కాగితాలు ఎక్కడవాలితే తనూ అక్కడ వాల్తాడు. శ్రమతో ఒళ్లంతా నొప్పిపుడుతుంది. ఈ విధంగా ఆరాత్రంతా బాధపడతాడు. చివరకవి మునిసిపలు చెత్తడబ్బాలో శరణు పొందుతాయి. ★

చెకోవ్ నాటిక:

వార్షికోత్సవం

అనువాదం: శ్రీ లక్ష్మీకాంతమోహన్

(చైర్మన్‌యొక్క ప్రయివేటు ఆఫీసు. దాని యెడమప్రక్క నొక ద్వారం వుంది. ఫ్లెక్ డిపార్టుమెంటువద్దకి పోవాలంటే యిటుగానే పోవాలి. గదిలో రెండు వ్రాతబల్లలున్నాయి. మొఖమల్ గుడ్డతో కప్పబడిన చేతికుర్చీలూ, గదిలోని పువ్వులూ ప్రతిమలూ, రత్నకంబళ్ళూ, టెలిఫోను మొ॥నవి అన్నీ సాలోచనతో విలాసార్థం పెట్టబడినట్లున్నాయి. మధ్యాహ్నం. ఖిరిన్ వొక్కడే వున్నాడు; పొడుగాంటి ఫెల్టుబూట్లు తొడిగివున్నాడు; వాకిట్లోగుండా అరుస్తున్నాడు)

ఖిరిన్: మందులషాపుకి వొకర్ని పంపి 15 కోపెక్కుల జటామాంసి తెప్పించండి. డైరక్టర్ల ఆఫీసులోకి మంచినీళ్లు తెమ్మని వాళ్లకి చెప్పండి. యిప్పటికిది అలా అడిగి వెయ్యోసారి! (రాతబల్లవద్ద కెళ్తాడు) నేను పూర్తిగా అలిసిపోయాను. నిద్ర నేది లేకుండా పనిచెయ్యటం మొదలుపెట్టి యిప్పటికి నాలుగురోజు లయ్యింది. వుదయంనించి సాయంత్రందాకా యిక్కడా, సాయంత్రంనించి వుదయం యింటివద్దా పని (దగ్గుతాడు) నా వొళ్ళంతా మంటలు పుట్టి నొప్పులుగా వుంది. జరంగా వుంది. దగ్గు వస్తున్నది. కాళ్లు నెప్పులు పీకుతున్నాయి. కళ్లు తేలిపోతున్నాయి. (కూచుంటాడు) యీ పచ్చి దుర్మార్గపు చైర్మన్, యీ నరపశువు, జనరల్ మీటింగులో ఒక రిపోర్టు చదవబోతున్నాడు, "మన బ్యాంకూ, మన వర్తమాన భవిష్యత్తులూ" అనే దాన్ని గురించి! ఇతగాడు పత్తిత్తని యెవరన్నా అనుకోవచ్చు. (పనిచేస్తూ) రెండు...వొకటి......వొకటి...ఆరు...సున్నా...యేడు......తర్వాత, ఆరు...సున్నా...ఆరు...ప్రజల్ని మోసగించటం యితగాడి పంథా. కనక, అందుకోసం, నీగ్రోవాడిలాగా నేనిక్కడ కూచుని చెమటలు గార్చుతున్నా! యీ రిపోర్టుఅంతా వొక కాకమ్మకథ; అంతకంటే యింకేమీ గాదు. కనక నేనిక్కడ కూచుని అంకెలకి అంకెలు కలిపి రోజూ పనిచెయ్యాలి—వీడ్ని భూతం మింగ! (లెక్కలు గుణిస్తాడు) నేను యిది సహించలేను! (రాస్తూ) అంటే, వొకటి......మూడు...ఆరు...యేడు...రెండు......వొకటి...సున్నా...నా పనికి నాకు బహుమానమిస్తానని వాగ్దానం చేశాడు. అంతా బాగా జరిగితే, ప్రజలు మోసపోతే, ఒక బంగారు పతకమూ, 300 రూబుళ్ల బోనసూ యిస్తానన్నాడు...అదెంతమట్టుకి నిజమో చూద్దాంగా. (పనిచేస్తాడు) అవును. యిక నా పనంతా వృథా అయితే, అది వేరే సంగతి...నాకు కోపంగా వుంది ...నాకు గిని వొళ్లు మరిచేంత కోపమొస్తే, యెవరొన్నా వొకర్ని చంపేస్తాను! (లోపలనించి సద్దూ చప్పట్లూ వినవస్తాయి.)

షిపుచిన్ కంఠధ్వని: థ్యాంక్యూ, థ్యాంక్యూ! మీకెంతో కృతజ్ఞుణ్ణి. (షిపుచిన్ వస్తాడు. ఫ్రాకుకోటు తొడుక్కొని, తెల్లటి నెక్టై ధరించి యుంటాడు. యిప్పుడే అతనికి బహూకరించబడిన ఒక ఆల్బం అతని చేతుల్లో వుంటుంది. ద్వారం వద్ద నిలబడి, బయటి ఆఫీసువారి నుద్దేశించి) నా సహోద్యోగులారా! నా జీవితంలోని సుఖతమమైన దినాలకి జ్ఞాపకచిహ్నంగా, యీ బహుమతిని నా జీవితాంతంవరకూ భద్రపరుస్తాను. అవును జంటిల్‌మన్! మరోసారి మీకు నా అభివందనాలు (గాలిలోకి ఒక ముద్దు విసిరి, ఖిరిన్‌వైపు తిరుగుతాడు.) గౌరవనీయమైన కుస్మానికోలైవిచ్!

(షిపుచిన్ స్టేజీమీద వున్నంతసేపూ, మధ్యమధ్య గుమాస్తాలు అతని సంతకాలకోసం కాయితాల్ని తీసుకొస్తూ పోతూంటారు.)

ఖిరిన్: (లేచి నుంచుంటూ) మన బ్యాంకుయొక్క యాభైయవ వార్షికోత్సవ సందర్భాన్న తమరికి అభివందనా లర్పించే భాగ్యం నాకు అబ్బినందుకు, నాకు సంతోషంగా వుంది ఆండ్రీ ఆండ్రీయెవిచ్ గారూ! నేను....

షిపుచిన్: (మనస్ఫూర్తిగా కరస్పర్శ చేస్తాడు) థ్యాంక్యూ, థ్యాంక్యూ! యీ దినం మన బ్యాంకు వార్షికోత్సవం అయినందున, యీ మహత్తరదినాన మనం ఒకర్నొకరం ముద్దు...(పరస్పరం ముద్దుపెట్టుకొంటారు.) నాకు చాలా చాలా సంతోషంగా వుంది! నీ శ్రమకి నా అభివందనాలు...నువ్వు చేసిన ప్రతిపనికీ నా అభివందనాలు...యీ బ్యాంకు చైర్మన్‌గా వుండే అవకాశం లభించిన కాలమంతట్లోనూ యేదైనా మేలు జరిగితే ఆ పేరు, ఆ గణ్యత, అందరికన్నా మించి నాసహోద్యోగులకి చెందవలసిందే. (నిట్టూర్చుతాడు) అవును. 15 యేళ్లు!—చూడు నాపేరు షిపుచిన్! (సంభాషణ మార్చి) నా రిపోర్టు యెక్కడుంది? బాగా జరిగిపోతున్నదా?

ఖిరిన్: ఆఁ యింకా 5 పేజీలుమాత్రమే వున్నాయి.

షిపుచిన్: భేష్. ఐతే, మూడు అయ్యేసరికల్లా అది పూర్తవుతుందనుకొంటాను?

ఖిరిన్: నాకే అడ్డంకులూ లేకుండా వుంటే దాన్ని పూర్తిజేస్తాను. ముఖ్యమైన దేదీ యిక రాయాల్సినపని లేదు.

షిపుచిన్: చాలా బాగుంది—చూడు నాపేరు షిపుచిన్! చాలా బాగుంది!! నాలుగింటికి జనరల్ మీటింగు వుంటుంది. చూడూ - మొదటి సగభాగమూ యిలా యివ్వు చదువుకొంటాను...త్వరగా... (రిపోర్టు తీసుకొంటాడు) యీరిపోర్టుమీద కొండంత ఆశలు పెట్టుకొన్నా. యిది నా ఆసరా, లేక, అంతకంటే బాగా చెప్పాలంటే నా మతాబా! నా మతాబా - చూడు నా పేరు షిపుచిన్! (కూచుని తనలోతాను చదువుకొంటాడు) నేను చచ్చేట్లు అలిసిపోయాను......కిందటి రాత్రంతా వాతపు కీళ్ల నెప్పులు పీకుతూనే వున్నాయి. యివాళ వుదయమంతా అటూ యిటూ తిరగటంతో సరిపోయింది. మళ్లీ యిటొస్తే యీ తత్తరపాట్లూ, ఆహ్వానాలూ, వుత్సవాలూ, చంద్రగోళాలూనూ. ... నేను అలిసిపోయాను.

ఖిరిన్! రెండూ...సున్నా...మూడూ...తొమ్మిదీ...రెండూ...సున్నా......యీ అంకెలు సరిగా చూడలేకపోతున్నా, మూడూ....వొకటే...ఆరూ...నాలుగూ..వొకటీ... ఐదూ...(లెక్కలు గుణిస్తాడు)

షిపుచిన్: మళ్లీ వొక గొడవ వచ్చిపడింది. యివాళపొద్దున నీ భార్య నావద్దకొచ్చి, నిన్నుగురించి మొర్రోమన్నది.

కిందటిరాత్రి వొక కత్తితో పొడుస్తానని ఆమెనీ, ఆమెచెల్లెల్నీ నువ్వు బెదరించావని చెప్పింది. కుస్మాన్ నికోలైవిచ్! అలా చెయ్యటంలో నీ వుద్దేశమేంటి? అబ్బా, హబ్బా!

ఖిరిన్: (మోటుగా) ఆండ్రీ ఆండ్రీరొవిచ్ గారూ! యివాళ వార్షికోత్సవం గనక నాదొక ప్రత్యేకమైన మనవి వొకటుంది. నా శ్రమను జూసైనా నామీద దయవుంచి నా కుటుంబ వ్యవహారాల్లో కలుగజేసుకోనమాకండి మీకు పుణ్యముంటుంది!

షిపుచిన్: (నిట్టూర్పు తొడు) కుస్మాని కో లైవిచ్! నువ్వు చాలా మంచివాడివి. మర్యాదస్తుడివి. కాని, స్త్రీలపట్ల వొత్తి పోకిరీ రకానికిమల్లే ప్రవర్తించుతావు. నీకు వాళ్లంటే అంత ద్వేష మెందుకో నాకు నిజంగా బోధపడటం లేదు.

ఖిరిన్: అసలు వాళ్లంటే తమ కంత ప్రీతి యెందుకో తెల్సికోవాలనుంది నాకు. (కొంత విరామం)

షిపుచిన్: బ్యాంకువుద్యోగులు నాకిప్పుడే వొక ఆల్బం బహూకరించారు. డైరక్టర్లేమో వొక స్వాగతపత్రమూ, వొక వెండి నీటిజాడీ యివ్వబోతున్నారని తెలిసింది. (కంటి అద్దంతో ఆడుకొంటూ) చాలా భేషుగ్గావుంది - చూడు నా పేరు షిపుచిన్! అదేమీ మితిమీరిన సంగతి కాదు. బ్యాంకు ప్రతిష్ఠకి తగ్గట్లు కొంత ఆడంబరం వుండాలి. మరి—దాన్ని భూతం మింగ—నువ్వు అంతా యెరుగుదువు... ఆ స్వాగతపత్రాన్ని నేనే తయారుచేశాను; ఆ వెండి జాడీని గూడా నేనే కొన్నాను... సరే. ఆ స్వాగతపత్రం యొక్క పై అట్టకే 45 రూబుళ్ళు అయ్యినయ్యి. కాని, అంతమాత్రం లేందే కథ నడవదు. అసలు, వాళ్లకి అలాంటి ఆలోచనే తట్టివుండదు. (చుట్టూ చూస్తాడు) సామాను వంక చూడు. వూరికినే అలా చూడు! నేను లోభిననీ, నాకు కావాల్సిందల్లా తాళాలు మెరుగుపెట్టేట్లు చేయటమేననీ, గుమాస్తాలు ఫాషనబుల్ నెక్‌టైలు పెట్టుకొనితీరాలంటాననీ, వొక లావాంటి దర్వాన్ ద్వారంవద్ద వుండాలంటాననీ, లోకులు నన్ను గురించి అనుకొంటారు! అంతే చాలదండి బాబూ. మెరుగుపెట్టిన తాళాలూ, లావాంటి దర్వానూ వూరికినే రారు; చాలా ఖర్చుపెట్టాలి. నా యిష్టమొచ్చినట్లు నా యింటివద్ద తినగలను; పందిలాగా నిద్రపోగలను. తాగి...

ఖిరిన్: దయవుంచి పేర్లు పెట్టమాకండి.

షిపుచిన్: పేర్లెవరూ పెట్టటంలేదిక్కడ! యెలాంటి మనిషివయ్యా నువ్వూ. ...యింతకుముందు చెప్పినట్లు, యింటివద్ద నేనొక వ్యాపారిలాగా, నడమంత్రపు సిరితో బతగ్గలను; నా యిష్టమొచ్చిన ఆటలాడగలను. కాని యిక్కడమాత్రం అంతా ఫసందుగా ఫకడ్‌బందుగా వుండితీరాలి. యిది బ్యాంకుసుమా! యిక్కడ ప్రతిచిన్న విషయమూ నదరుగా, యథార్థం చెప్పాలంటే, మహా గొప్పగా వుండాలి. (నేలమీదినించి కాయితముక్కటితీసి నిప్పులోకి విసిరేస్తాడు) నేను యీ బ్యాంకుకి చేసిన సేవంతా యిది-దాని ప్రతిష్ఠని పెంచాను. బ్రహ్మాండమైన ప్రాముఖ్యతగల విషయమేమిటంటే నడత! బ్రహ్మాండమైనది-చూడు నా పేరు షిపుచిన్! (ఖిరిన్‌ను చూస్తాడు) బాబూ షేర్‌హోల్డర్ల డెప్యుటేషన్ ఒకటి డియిక్కడకే తుణాన్నయినా రావచ్చు. మరి నువ్వేమో మెడచుట్టూ జేబురుమాలు చుట్టి, ఫెల్టుబూట్లు తొడిగి... అర్థంలేని జాకెట్ ఒకటి తొడిగి... అలా వున్నావు. ఫ్రాకుకోటుగానీ, కనీసం నల్లటి జాకెట్‌గానీ తొడిగివుండాల్సింది.

ఖిరిన్: మీ షేర్‌హోల్డర్లకంటే నా ఆరోగ్యం సంగతి నాకు యెక్కువ. నా వొళ్లంతా మంటలుగా వుంది.

షిపుచిన్: (వుద్రేకంతో) కాని ఆ దుస్తులు అసహ్యంగా వున్నాయని నీకు తెలుసు! నువ్వు రంగం చెడగొడుతున్నావు.

ఖిరిన్: ఆ షేర్‌హోల్డర్ల డెప్యుటేషన్ వచ్చినపుడు, నా అవతారం వాళ్లకి చూపించకుండా దాక్కోగలను. అదేమంత... యేడూ... ఒకటీ... రెండూ.... ఒకటీ... ఐదూ... సున్నా... అపరిశుభ్రమైన బట్టలు కట్టుకోటం నామట్టుకి నాకూ యిష్టం లేదు... ఏడూ... రెండూ... తొమ్మిదే... (లెక్కలు గుణిస్తాడు) అపరిశుభ్రతని చూసి అసలు నేను భరించలేను. యీ వార్షికోత్సవ విందుకి స్త్రీలని పిలవకుండావుంటే యింకా బాగుండేది...

షిపుచిన్: అదా? యేం ఫర్వాలేదులే.

ఖిరిన్: డంబాచారం చూపటానికి రాత్రికి హాలంతా వాళ్లతో నింపేస్తావని నాకు తెలుసు. కాని, జాగ్రత్తపడండి. వాళ్లుఅంతా చెడగొట్టేస్తారు. వాళ్లు యేవో అన్నిరకాల పెంకెపనులూ, అల్లరిపనులూ చేస్తారు.

షిపుచిన్: అదెంత మాత్రమూ గాదు. స్త్రీ సాంగత్యం అనేది మన విజ్ఞాన్ని వికసింపజేస్తుందిగూడాను.

ఖిరిన్: అవును... మీ భార్య మాత్రం బుద్ధిగలదానికి మల్లే అవుపిస్తుంది. కాని కిందటి సోమవారం నాకు ఆమె అనిన ఒక మాట నన్ను రెండురోజులదాకా తిప్పుకోకుండా చేసింది. గుంపెడు జనం వున్నచోట "డ్రియాజిస్కీ - డ్రియాజిస్కీ బ్యాంకుషేర్లని చాలా సాధ్యత కొన్నాడంట నిజమేనా? దాన్నిగురించి ఆయనగారికి చాలా ఆందోళనగావుంది" అని యీమె దడాలున నన్ను నిలవేసి అడిగింది. అదైనా, పదిమందీ వున్నచోట! మీరు వాళ్లకి యీ సంగతులన్నీ యెందుకు చెబుతారో నాకు అర్థం గావటంలేదు. వాళ్ళమూలంగా మీరు పెద్ద యిబ్బందుల్లో చిక్కుకోటం మీ అభిమతమా యేంటి?

షిపుచిన్: సరే. యిక నాపు. యిక చాలు! వార్షికోత్సవసమయంలో యీ సంభాషణ చప్పగా వుంది. అన్నట్టు జ్ఞాపకమొచ్చింది (గడియారం చూసి) నా భార్య త్వరలో యిక్కడికి రావాల్సివుంది. అసలు, నేను ఆమెకోసం స్టేషన్‌కు పోయి వుండాల్సింది. కాని తీరికలేదు... నేను అలిసిపోయాను. ఆమె పనులంటే నాకు యిష్టంలేదనే చెప్పితీరాలి! రావటం నాకు యిష్టమే అయినా; యింకా రెండురోజులు ఆమె తల్లివద్ద వుంటే, యింకా బాగా సంతోషించేవాణ్ని. యికామె వచ్చిందంటే, యిక యివాళంతా ఆమెతో కాలక్షేపం చెయ్యాల్సివుంటుంది. కాని, మన మేమో కొంచెం అలా విహారానికి పోయి వద్దామనుకొంటిమి... (వణుకుతాడు) అబ్బో... నా నరాలు అప్పుడే గిజగిజమని నాట్యం సాగించినాయి. అవి యెంత నీరసంగావున్నాయంటే, యేమాత్రం కొంచెం అలా స్పర్శ తగిలినా నాకు కన్నీళ్ల పర్యంతం అయ్యేట్లుంది! వుహూ. నేను దృఢంగానే వుండాలి—చూడు నా పేరు షిపుచిన్.

(తాతియానా వస్తుంది. వాటర్‌ప్రూఫ్ కోటు తొడిగివుంటుంది. భుజాన్నొక ప్రయాణపు సంచి తగిలించివుంటుంది)

షిపుచిన్: భేష్. సరైన సమయంలో!

తాతియానా: డార్లింగ్!

(భర్తవద్దకి పరుగెడుతుంది. యిద్దరూ దీర్ఘ చుంబనం చేస్తారు)

షిపుచిన్: యింతకుముందే నిన్నుగురించి మాట్లాడుకొంటున్నాం. (తిన్నగా చూస్తాడు)

తాతియానా: (యెగరొప్పుతూ) నేను నీవద్ద లేకపోతే నీకేమీ వుత్సాహంగా లేదా? వొంట్లో కులాసాగా వుందా? నే

నింకా యింటికి వెళ్లలేదు. సరాసరి స్టేషన్ నించి యిలా వచ్చాను. అబ్బో. నేనీకు చెప్పాల్సిన సంగతులు గంపెడున్నయ్యి... వుండలేకపోయాను...బట్టలిప్పుడు విడవను లే. యెందుకంటే, వొక్క నిముషం పాటుమాత్రమే యిక్కడుంటాను. (ఖిరినితో) గుడ్ మార్నింగ్ కుస్మా! (భర్తతో) యింటివద్ద అంతా బాగా వుంది గదూ?

షిపుచిన్: ఆఁ. చాలా బాగా. యీ వారం నువ్వు కొంచెం పుష్టిగా బాగా తయారవ్వాల్సింది...సరే. కాలం యెలా గడిపావు?

తాతియానా: చాలా బాగా. అమ్మ, కాట్యా నిన్ను అడిగామని చెప్పమన్నారు వాసిలీ ఆంద్రీచ్ నీకు ముద్దులు చెప్పమన్నాడు. (అతన్ని ముద్దెట్టుకొంటుంది) అత్త నీకొక జామె జాడీ పంపింది. నువ్వామెకి వుత్తరాలు రాయటం లేదట. ఆమెకి ఆందోళనగా వుంది. జీనా ఒకముద్దు చెప్పమన్నది (అతన్ని ముద్దెట్టుకొంటుంది) యేం జరిగిందో తెలుసా? నాకు చెప్పటానికే భయంగా వుంది! కాని, నీ కళ్ళని చూస్తూంటే, నేను వచ్చినందుకే నీకు విచారంగా వుందల్లే వున్నదే!

షిపుచిన్: యెంతమాత్రమూ లేదు... డార్లింగ్! (ఆమెని ముద్దెట్టుకొంటాడు.)

(ఖిరిన్ కోపంగా దగ్గుతాడు)

తాతియానా: ఓహ్! పాపం, కాట్యా! ఆమె అంటే నాకు జాలిగా, చాలా జాలిగా వుంది!

షిపుచిన్: డార్లింగ్! యివాళ బ్యాంకు వార్షికోత్సవం షేర్ హోల్డర్ల డెప్యుటేషన్ యిక్కడికే కుణాన్నయినా రావచ్చు. కాని నువ్వేమో యింకా కొత్త బట్టలు తొడుక్కోలేదు.

తాతియానా: ఆఁ. అవును. వార్షికోత్సవం! జంటిల్మన్! మీకు నా అభివందనాలు... నేను...ఐతే, మీటింగూ, వింధూ జరిగేది యివాళే నన్నమాట... మంచిది. షేర్ హోల్డర్లకోసమని నువ్వు చాలా శ్రమపడి సొగసైన వుపన్యాసం తయారుచేశావు జ్ఞాపకముందా? అది యివాళ చదువుతావా?

(ఖిరిన్ కోపంగా దగ్గుతాడు)

షిపుచిన్: (తత్తరపడి) చూడూ, మన మిలాంటి సంగతుల్ని గురించి మాట్లాడుకో గూడదు. నువ్వింటికి పోతే చాలా మంచిది.

తాతియానా: యిక ఒఖ్ఖ నిముషం; వొక్క నిముషం. ఒక్క నిముషంలో అంతా చెప్పేసివెళ్తాను. ప్రారంభంనించీ చెబుతాను. సరే...నువ్వు నన్ను పంపటానికొచ్చినపుడు నేనొక లావాంటి యావిడ పక్కని కూచున్నాను జ్ఞాపకముందా? సరే. తర్వాత చదవటం మొదలెట్టాను. రైలుబండిలో మాట్లాడటమంటే నాకిష్టంలేదు. మూడు స్టేషన్లు దాటేదాకా అలాగే చదివాను; యెవర్తోనూ వొక్క మాటగూడా మాట్లాడలేదు...సరే. తర్వాత కొంతసేపటికి సాయంత్రమయ్యింది. నాకేమీ బాగాలేదు. యెంతో విచారంగా వుండింది. వొక యువకుడు నాకెదురుగా వున్న బల్లమీద కూచునివున్నాడు...... యేమంత అనాకారి గాదు; గోధుమరంగు శరీరం, నల్లటి జుట్టు, నల్లటి కళ్లు గలాడు.. సరే. కాసేపటికి యిద్దరమూ సంభాషణలోకి దిగాం......తర్వాత వొక నావికుడు అటు వచ్చాడు. ఆ తర్వాత వొక విద్యార్థి, యింకా యెవరెవరో...వాళ్లంతా నావంక తెగ మూశారు! మేము అర్ధరాత్రివరకూ మాట్లాడుకొన్నాం. ఆ యువకుడు చాలా చాలా గమ్మత్తు సంగతులు చెప్పాడు. ఆ నావికుడేమో పాట యెత్తుకొని పాడుతూన్నాడు. నవ్వి నవ్వి, నవ్వలేక నా గుండెలు నెప్పులు పుట్టినయ్యి. యిక ఆ నావికుడు—వోహ్ ఆ రకం!—అతను నా పేరు తాతియానా అని తెల్సికొన్నాక, యేమి పాడాడో తెలుసా? (మంద్రస్వరంలో పాడుతుంది)

దాచలేను వోవోయ్

పిచ్చిగాను తాతియాన

ప్రేమించినానువాయ్!

(అని పొట్టచెక్కలయ్యేట్లు నవ్వుతుంది. ఖిరిన్ కోపంగా దగ్గుతాడు)

షిపుచిన్: టానియా! నువ్వు కుస్మాని కోలైవిచ్ పని చెడగొడుతున్నావు సుమా! యింటికెళ్లు. తర్వాత...

తాతియానా: వుహుహు. కావాలంటే ఆయన్నిగూడా విననియ్యి. అది చాలా గమ్మత్తయిన సంగతి. వొక్క నిముషంలో చెప్పేస్తాను. స్టేషన్‌వద్ద నన్ను కల్సికోటానికి సెరేజా వచ్చాడు. యింతలో యెవరో వొక యువకుడు—టాక్స్ యిన్స్పెక్టరను కొంటాను - వచ్చాడు... చాలా అందంగా వున్నాడు...ప్రత్యేకంగా అతని కళ్ళు... సరే. సెరేజా నన్ను అతనికి పరిచయం చేశాడు. ముగ్గురమూ కలిసి బండెక్కి వెళ్లాం. అప్పుడు వాతావరణం చాలా బాగుంది...

స్టేజీ వెనకాల కంఠధ్వనులు: పోవటానికి వీల్లేదు. వీల్లేదు. యేం కావాలి నీకు?

(మెర్ చ్యూట్కినా తన చేతులు గాలిలో తిప్పుతూ వస్తుంది)

మెర్ చ్యూట్కినా: మీరు నా వెంట పడేదెందుకు? యేం కావాలి? నాకు ఆయాసోపనుంది. (షిపుచిన్‌తో) మహాప్రభూ! నాకు...మీ...నే నొక గవర్నమెంటు నౌకరు భార్యని. నస్టాస్యా ఫ్యోడరోవ్నా మెర్ చ్యూట్కినా నా పేరు.

షిపుచిన్: నాతో యేం పని నీకు?

మెర్ చ్యూ: చూడండి మహాప్రభూ. ఐదు నెలల నించీ నా పెనిమిటి జబ్బుగా వున్నాడు. ఆయన పనికి వెళ్లలేక, యింటికాడ వుండి, జబ్బునుంచి కోలుకొంటా వుంటే, యే కారణమూ చెప్పకుండా నే ఆయన్ని పనిలోంచి తీసేశారండి మహాప్రభూ. తర్వాత నేను ఆయన జీతండబ్బులు తెచ్చుకోటానికెళ్తే జీతంలోంచి 24 రూబుళ్లు 30 కోపెక్కలు దిగగోశారండయ్యా. "యెందుకండీ" అని నేను అడిగా. "అతను వుద్యోగులు లెక్కలోంచి ఆ డబ్బు తీసుకొన్నాడు. కనక యితర్లు ఆ డబ్బు పూడ్చాలి" అని అన్నారండి. అదెట్టా జరుగుతుందో చెప్పండి. నాయిష్టం లేకుండా ఆయనెట్టా ఆ డబ్బు తీసుకొంటాడో చెప్పండి. లేదండి మహాప్రభూ. నేను బీదముండని. నాకున్న ఆదాయమల్లా నా యింటిమీద వచ్చే అద్దెనండి. నేను బీదముండని; యే అండా దండా లేనిదాన్ని... ప్రతివాళ్లూ నాకు కీడుచేసేవాళ్లేనండి; వొక్కళ్లూ నన్ను దయతో చూశేవాళ్ళు లేరు.

షిపుచిన్: క్షమించు (ఆమె చేతిలోని పిటీషను తీసుకొని చదువుతాడు)

తాతియానా: (ఖిరిన్‌తో) అవును. కాని, మొదట మేము...కిందటివారం అకస్మాత్తుగా మా అమ్మనుంచి వొక జాబు వచ్చింది. యెవరో గ్రెండిలెవ్స్కీ అనే అతను కాట్యాని చేసుకొంటానన్నాడని ఆమె రాసింది. చక్కనివాడు. వినయంగలాడు. కాని, ఏ ఆస్తిపాస్తీ లేదు. స్థిరమైన జీవనాధారమేమీ లేదు. కాని, చూడండీ, దురదృష్టవశాత్తూ, అతనంటే కాట్యా పూర్తిగా లొంగిపోయింది. యేం చెయ్యాలో చెప్పండి. వెంటనే వచ్చి కాట్యాకి నచ్చజెప్పి, మనసు తిప్పమని అమ్మ నాకు రాసింది...

ఖిరిన్: (కోపంగా) క్షమించండి. మీరు నా ధ్యాసంతా చెడగొట్టారు. అమ్మని గురించీ, కాట్యానిగురించీ మీరు బడబడ

లొడలొడ మంటూవుంటే నా పనంతా చెడిపోయింది.

తాతియానా: ఐతేమాత్రం? వొక మర్యాదగల స్త్రీ మీతో మాట్లాడుతూంటే నువ్వు వినాలి. అసలు, యెందుకని యివాళ అంత కోపంగా వున్నావూ? ప్రేమలో యేమన్నా పడిపోయావా? (నవ్వుతుంది.)

షిపుచిన్: (మెర్‌ఛ్యూట్కినాతో) క్షమించు. యేమిటో గొడవంతా? దీనికి తలెక్కడో, తోకెక్కడో తెలవటం లేదు...

తాతియానా: (ఖిరిన్‌తో) ప్రేమలో పడ్డావా యేంటి? హహ్హహ్హా! అదుగో. నువు సిగ్గుపడుతున్నావు.

షిపుచిన్: (భార్యతో) టాన్యా! నా మాట విని ఒక్కక్షణం అలా పబ్లిక్ ఆఫీసులోకి వెళ్లు. నే నిప్పుడే వస్తా.

తాతియానా: సరే మంచిది. (వెళ్తుంది)

షిపుచిన్: నాకు దీంట్లో ఒక్క ముక్క గూడా అర్థం గావటంలేదు. మీరు పొరపాటుగా ఒకచోటికి పోవాల్సింది, మరొకచోటికి కొచ్చారమ్మా. యీ పిటీషన్‌తో మాకేమీ సంబంధం లేదు. మీ భర్త యెక్కడ పనిచేశాడో అక్కడికి వెళ్లండి.

మెర్‌ఛ్యూ: యీ ఐదు నెలల్లోనూ నేను చాలాసార్లు అక్కడికి వెళ్లానండి. వారు కనీసం నా పిటీషనువంకైనా చూడలేదు. నేను యిక ఆశలన్నీ వదులుకొన్నానండి. కాని నా అల్లుడు-జోరిస్‌మాట్వేయిచ్-సలహా యివ్వటంవల్ల, మీవద్ద కెళ్తే మంచిదనుకొన్నా. "నువ్వు షిపుచిన్‌గారివద్ద కెళ్లి చెప్పుకోవమ్మా. ఆయన పలుకుబడి గలాడు. యేదైనా చెయ్యగలడు" అని అల్లుడు చెప్పాడు. మహాప్రభూ, నాకు సాయం చెయ్యండి.

షిపుచిన్: మిస్ట్రెస్ మెర్‌ఛ్యూట్కినా! మేము నీకేమీ సహాయం చెయ్యలేము విను. నాకు బోధపడినంతవరకు మీ భర్త సైనికవైద్యశాఖలో పనిచేశాడు. మరి మాదేమో ప్రయివేటు వ్యాపారసంస్థ; బ్యాంకు! ఆ సంగతి గ్రహించండి.

మెర్‌ఛ్యూ: మహాప్రభూ. నా పెనిమిటి జబ్బుపడ్డాడని నేను డాక్టరు సర్టిఫికెట్టు గూడా తెచ్చాను. యిదిగో వూరికినే చూడండి...

షిపుచిన్: (కోపంలో) అది సరే. నువ్వు చెప్పేది నేను నమ్ముతున్నా. కాని అది మా వ్యవహారం గాదు. (తెర వెనక తాతియానా నవ్వటమూ, తర్వాత ఒక మనిషి నవ్వటమూ వినపడుతుంది. షిపుచిన్ వాకిలివంక ఓరగా చూస్తాడు.) వాళ్లపని చెడగొట్టుకున్నది. (మెర్‌ఛ్యూతో) వింతగా వుంది. అంతే గాదు. బుద్ధితక్కువ పనికూడాను. నువ్వెక్కడికి పోయి చెప్పుకోవాలో నీ భర్తకి తెల్సుననుకొంటాను?

మెర్‌ఛ్యూ: మహాప్రభూ. నేను ఆయనకేమీ తెలవనియ్యలేదు. "అది నీపనిగాదు. పోజేటికి!" అని అరిచాడండీ మరి......

షిపుచిన్: అది గాదమ్మా. నేను మళ్లీ చెబుతున్నా విను. మీభర్త సైనికవైద్య శాఖలో వుద్యోగి. మరి యిదేమో బ్యాంకు; ప్రయివేటు వ్యాపారసంస్థ...

మెర్‌ఛ్యూ: అవును. అవునవును...ఆ సంగతి నాకు తెలుసండి. అట్టా అయ్యేట్టయితే - మహాప్రభూ-నాకు 15 రూ బుల్లు యియ్యమని వాళ్లకి ఆర్డరియ్యండి. నాకు గడవటానికి అంతమాత్రం మిప్పించినా చాలునండీ.

షిపుచిన్: (నిట్టూర్పు తాడు) శ్న... అబ్బా...

ఖిరిన్: ఆండ్రీ ఆండ్రీ యెలిచ్! యిలా పక్కనే గొడవపెడుతూ వుంటే యిక యీ రిపోర్టు పూర్తి కానేకాదండీ.

షిపుచిన్: వొక్కక్షణం (మెర్‌ఛ్యూతో) నీకు యేంచెప్పినా లాభంలేనట్టుంది. మందులషాపుకి గానీ, కంసాలి యింటికి గానీ విడాకుల పిటీషను తీసుకెళ్లటం అనేది యెంత అభాసుగా వుంటుందో, నీ వ్యవహారాన్ని యిక్కడికి తీసుకురావటం అంత అభాసుగా వుందని తెల్సుకొన్నావా? (తలుపు తట్టిన చప్పుడు. తాతియానా కంఠధ్వని వినపడుతుంది. "నేను లోనికి రావచ్చా ఆండ్రీ?" అలిసు అరుస్తాడు) నామాట విని వొక్కక్షణం సేపాగు. (మెర్‌ఛ్యూతో) నీ పెనిమిటికి జబ్బు చేస్తేనో లేదో మాకేం సంబంధం) అన్నట్లు, యివాళ వార్షికోత్సవం... మాకు తొందర పనులున్నయ్యి... యెవరైనా ఏక్షణాన్నయినా యిక్కడికి రావచ్చు... కనక క్షమించి...

మెర్‌ఛ్యూ: మహాప్రభూ! దిక్కూ దెసాలేని దాన్ని. దయజూపండి. నేను యే అండా దండా లేని అవిటిదాన్ని... నేను చచ్చేంత అలిసిపోయా... మాయింట్లో అద్దెకున్న వాళ్లతో పేచీ వొకటొచ్చింది. నా పెనిమిటి మంచంలో వుంటంవల్ల, యిల్లూ వాకిలీ నేనే చూసుకోవాల్సి వచ్చింది. అల్లుడేమో యే పనీ పాటూ లేకుండా వున్నాడు...

షిపుచిన్: మిస్ట్రెస్ మెర్‌ఛ్యూట్కినా! నేను... వుహూ... క్షమించాలి. నే నిక నీతో మాట్లాడుతూ కూచోలేను. నాతల దిమ్మెత్తి తిరిగిపోతున్నది... నువ్విక్కల్ని గొడవపెట్టి, మా కాలం వృధా చేస్తున్నావు. (నిట్టూర్పు తాడు. తనలో) భలేగొడవ మొత్తానికి - చూడు నాపేరు షిపుచిన్! (ఖిరిన్‌తో) కుమ్మా! యీమెకి నువ్వు నచ్చజెప్పగలవా? (చేయి వూపి పబ్లిక్ డిపార్టుమెంటు ఆఫీసులోకి వెళ్తాడు)

ఖిరిన్: (మెర్‌ఛ్యూని సమీపిస్తూ కోపంతో) యేం కావాలి నీకు?

మెర్‌ఛ్యూ: యే అండాదండా లేని అవిటిదాన్ని బాబూ... నేను మీకు పైకి బాగానే కనపడవచ్చు. కాని, నన్ను ముక్కలుగా తీసి పరీక్షచేస్తే, అణువంత గూడా నాలో ఆరోగ్యం లేదని మీరు తెల్సుకోగలరు. అసలు నేను నా కాళ్లమీద వూరికినే నిలబడలేకుండావున్నా. నా ఆకలి చచ్చిపోయింది. యివాళ పొద్దున కాఫీ తాగాను గాని యేమీ వుసులుగా లేదు.

ఖిరిన్: నీ కేం గావాలని అడుగుతున్నావు చెప్పు.

మెర్‌ఛ్యూ: యిప్పుడు 15 రూబుళ్లు యియ్యమని వారికి చెప్పండి. తక్కినవి వొకనెలతర్వాత యియ్యవొచ్చులెండి.

ఖిరిన్: కాని, యిది బ్యాంకని నీకు యెన్నిసార్లు చెప్పాలి?

మెర్‌ఛ్యూ: అవునవును ...... కాని, కావాలంటే మీకు డాక్టరు సర్టిఫికెట్టు గూడా చూపగలను.

ఖిరిన్: అసలు నీకు మెడకాయమీద తలకాయ వుందా లేదా?

మెర్‌ఛ్యూ: న్యాయంగా నాకు రావాల్సిన దేదో నే నడుగుతున్నా బాబూ. నాదిగాని దేదీ నాకు చిల్లిగవ్వంతగూడా అక్కర్లేదు.

ఖిరిన్: అమ్మగారూ! అసలు మీకు మెడకాయమీద తలకాయ వుందా లేదా? సరే—నన్ను భూతం మింగ—నీతో మాట్లాడటానికి నేను తీరిగ్గా కూచోలేదు. నాకు పనుంది...(వాకిటివైపు చూపుతూ) అటు దయచెయ్యండి.

మెర్‌ఛ్యూ: (ఆశ్చర్యపడి) మరి నా డబ్బేదీ?

ఖిరిన్: నీకు బుర్ర లేదు. యిది వుంది (అని టేబిల్‌మీద కొట్టి, తర్వాత తన నుదురు చూపిస్తాడు)

మెర్‌ఛ్యూ: (నొచ్చుకొని) యేమిటీ? సరే. అనండి. మరేం ఫర్వాలేదు. మరేం ఫర్వాలేదులెండి. మీ భార్యదగ్గిర మీరు ఆపని చేసుకోండి. కాని నేను సివిల్ వుద్యోగి భార్యని....నామీద మీకేమీ అధికారం లేదు.

(27-వ పేజీ చూడండి)

ప్రజాజీవనంలో సినిమా భాషితాలు

★

'జోవు'

ఈనాడు వస్తూన్న తెలుగు చలనచిత్రాల్లోని మాటలు పాటలు - హాస్యధోరణిలో చిత్రంలో ప్రవేశింపబడినా - జనాన్ని ఆకర్షించి సామాజిక నిత్య జీవనంల్లో కూడ చలామణి అవుతున్నాయి. ఎవరేనా యేదేనా అనేసరికి 'తప్పు తప్పు అలా అనకు' అన్నమాటలు వింటున్నాం. వెంటనే మనకు పాతాళభైరవిలో రాజుగారి బావమరది - తప్పుతప్పు రాణీగారి తమ్ముడు జ్ఞాపకానికి వస్తాడు. ఈ 'తప్పుతప్పు' క్లబ్బుల్లో, కాఫీక్లబ్బుల్లో, కార్యాలయాల్లో, కళాశాలల్లో పెద్దాపిన్నా తారతమ్యం లేకండా విజయగర్వంతో సాగిపోతూంది.


(పింగళి నాగేంద్రరావుగారికి జోహార్లు.)

వెనక 'గుణసుందరి' ఆరోజుల్లో 'గిడిగిడి' వీరవిహారం సలిపింది. ఏ కాలేజీ విద్యార్థినినో దృష్టిపథములో వుంచుకొని విద్యార్థులు 'గిడిగిడి' అని హస్త విన్యాసం చెయ్యడం నేను యెరుగుదును. అంతెందుకు సమాజవ్యవస్థలో వున్న తస్థానాన్ని అలంకరించిన కొందరు ఘరానా మనుష్యులే 'గిడిగిడి' అని చెయ్యి ఆడించి ఘనకార్యం చేసినట్టుగా భావించిన రోజులున్నాయి.

ఈనాడు పాతాళభైరవి అనేక విచిత్రమైన మాటలను అందజేసింది. 'ఒకే డింగరీ' అనో 'సాహసివిరా డింభకా' అనో (వయసు ముదిరినవాడైనాసరే) అనటం పరిపాటి అయిపోయింది. జై పాతాళభైరవీ !!!

ఈసందర్భములో మా పురవీధుల్లో జరిగిన విషయం ప్రస్తావించటం అప్రస్తుతం కాదు.

ఒక యువకుడు, వయసులో వున్న స్త్రీ రాచబాటమీద పోతూన్నారు. యువకుడు



"దీక్షలో" సుధ, వరలక్ష్మి, రామగోపాల్.



"మంజరి" లో

రామశర్మ

యదాలాపంగా 'జై పాతాళభైరవీ' అన్నాడుట. 'నరుడా! ఏమి నీ కోరిక' అని అమ్మాయి వక్కాణించింది.

'నీవే కావాలి' అన్నాడట చటుక్కున అతగాడు. విషయం గ్రహించి ఆ యువిద జగడానికి సంసిద్ధురాలయింది. 'అరి తస్సాదియ్యా! పాతాళభైరవి యెంత పని చేసింది.' అన్న మాటలు అక్కడ మూగిన జనంలోనుంచి వినబడ్డాయి.

చెప్పొచ్చే దేమంటే 'తప్పు తప్పు' లాగే 'తస్సాదియ్యా' కూడ ప్రజాజీవనంలో పరుగులు తీస్తూంది.

ఈమధ్య వొక యిల్లాలు తనకు చీరను కొనమని భర్తను కోరిందట.

'మంచి కోరిక కాయవే బుల్ బుల్' అన్నాడుట అతను. ఆమె నిర్ఘాంతపోయి 'బాగుంది వాలకం' అని మూలుగుతూవుంటే 'ఆమ్ ఫట్ అన్నానంటే నీకు బెనారసు చీర వచ్చిందన్నమాటే' అన్నాడుట భర్త.

నా స్నేహితుడొకడు (బంధువుకూడ లెండి) ప్రేమ పరీక్షలో నెగ్గానంటూ తన ప్రియురాలి విషయమై ప్రస్తావిస్తూ 'ఆమెది లేత వలపు కాదురా; చాలా ఘాటైన ప్రేమ. చిరునవ్వు చాలు - చిత్తైపోయావన్నమాటే. ఎంత తీక్ష్ణ వీక్షణ మనుకున్నావు' అంటూ చెప్పుకుపోతూన్నాడు. 'ఆగరా! ఎవడికి కావాలి నీ ప్రేమగోల' అని యీసడించేవరకు వదలిపెట్టలేదు.

కాలేజీకి పోయే యెదిగిన ఆడపిల్ల వొకామె వివాహవిషయమై తండ్రి ప్రస్తావిస్తూవుంటే 'ప్రేమ వేరు వివాహం వేరు. బంధము వేరు ఆనందం వేరు' అందిట. ఆ తండ్రి నిలువునా నీరై 'ఏమిటి అమ్మాయీ నీవు అనేది. నాకు బోధపడలే' దన్నాడుట పాపం! (ఆయన నిర్దోషి సినిమా చూడలేదల్లే వుంది.)

ఈమధ్య రోడ్డుమీద యిరువురు ఆసాములు (తగు మనుష్యులే అనుకోండి) వాదించుకుంటూ మాటమీద మాట వచ్చి 'మూతి మీసం తిప్పేనంటే మూడులో కాలు ముండమొయ్యాల్సిందే; పట్టుపట్టానంటే అంతు చూడాల్సిందే!' అన్నాడుట అందులో వొకాయన. (అసలు ఆ ఆసామీకి మీసం లేదు.)

'తగ్గూ! తగ్గూ' అన్నాడుట రెండవ ఆయన. మా పఠనమందిరములో నొకనాడు వొక చర్చనీయాంశముపై వాదప్రతివాదనలు తీవ్రంగా జరుగుతున్నాయి. అందులో వొక ఘరానామనిషి లేచి నించుని 'నేను చెప్పాను—మీరు వినవలసిందే అంతే—అంటే అంతే' అన్నాడుట ప్రొఫెసరుగారి ధోరణిలో.

సంసారంలో పడి వ్యయప్రయాసలకు లోనైన వొక ఆసామిని చూచి యీ మధ్యకాలం వెళ్లబుచ్చిన వొకాయన అన్నాడుట 'తస్మాత్ జాగ్రత్తో జాగ్రతః' అని. విశేష మేమిటంటే ఆ దారిన పోతూన్న పోలీసుఆఫీసరు వొకాయన యీ మాటలు విని తన్నే అనుకొని వెకిలినవ్వు నవ్వారుట పాపం!

నా మిత్రుడొకడు బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తూ ఆడది తన అడుగుజాడల్లో పడిందీ అంటే మొకరిల్లి 'జై భజరంగ భళీ' అనటం నేను యెన్నో సార్లు అవలోకించాను.

ఈమధ్య వొకనాడు నేనూ నా స్నేహితులూ బీచిని కూర్చుని 'పిచ్చాపాటీ' వేస్తున్నాము. మా మిత్రబృందములో వొకడైన రంగారావు (స్త్రీత్వము వాడిలో వొకపాలు హెచ్చు లెండి) అక్కడకు రాగానే అక్కడ కూర్చున్న వారిలో వొకరు 'నా సామి రంగ' అని నోరు అప్పళించాడు

జట్కాబండి తోలేవాళ్లు 'ధనా ధన్' అంటూండటం మనం వింటూంటాం.

ఇక పాటల సంగతి.

మా వీధి చివర యింట్లో నాయుళ్ళు వున్నారు. వారి కుక్క 'టామీ' వొనాడు కట్టడి తప్పించుకొని వూరిమీద పడ్డాది. (ముగదే లెండి) అప్పట్లో ఆ దారిన పోతూన్న నాకు వారి అమ్మాయి 'చక్కనైన శునకరాజును యెక్కడైన చూచేరా, మా లెక్కడైన చూచేరా' అని పాడుతూవుండటం వినిపించింది. వొక మందహాసం చేసి ముందుకు సాగిపోయాను. కొంతకాలం క్రిందట మా అత్తవారి యింటికి వెళ్లాను. నా మరదలు (పెళ్లి యీడుదే) నన్ను చూచి 'కల నిజమాయెగా కోరికా తీరెగా' అని పాడటం మొదలుపెట్టింది. 'ఏమిటే యిది' అని వాళ్లమ్మ అడిగితే పరుపుపై పడుకొని రెండు కాళ్లు యెత్తి టపటప కొడుతూ చేతి వేళ్లసందులగుండా చూడటం సాగించింది. ఇది సినిమారోగమే అని నేను గ్రహించడానికి యెంతోసేపు పట్టలేదు.

ఎండలో, తిరిగి తిరిగి యిల్లు చేరుకొని మా బావగారు 'నే తాళలేనే నే తాళలేనే యీ యెండని' అని నృత్యం చేయటం సారించాడు. ఈ సందర్భంలో మల్లినాథసూరిగారి అనుభవాలు మనకు స్ఫురింపక మానవు. (కృష్ణా పత్రిక - వడగళ్ళు)

మొన్న మా అన్నయ్య కొడుకు ఆరేళ్ల వాడు యెదురింటి అమ్మాయితో అంటున్నాడు 'తొక్కుడుబిళ్లా ఆడే నాతో' అని. ఆహా! కాలమహిమ. (వాస్తవానికి సినిమా మహిమ అనాలేమో!')

కొంతమంది స్త్రీలలో ముఖ్యంగా వయసులోవున్న వారిలో ముక్కు యెగపీల్చటం వొక వినూత్నలక్షణం. అంతెందుకు నిర్దోషి చూచి వచ్చినాక మా చిన్న వదినె 'అంజలి'లా ముక్కు యెగపీల్చటం మొదలెట్టిందంటే నమ్మండి. యువకుల్లో (కాలేజీ విద్యార్థుల్లోకూడ) పాతాళభైరవిలో 'అంజి'లా వెకిలినవ్వు నవ్వటం వొక 'ప్యాషను.'

ఇలాంటి వుదాహరణలు నేడు ప్రజాజీవనంలోంచి తీసి యెన్నైనా చూపవచ్చు. ఈ విషయాలన్నీ గమనించి చూస్తే సినిమా భాష ప్రజాజీవనంలో యెంతగా వ్యాప్తి జెందిందో తెలుస్తుంది.

నేడు సినిమారంగము వాస్తవికజగత్తులో యెంత ప్రాధాన్యము వహించిందో తలచుకుంటే ఆశ్చర్యము కలుగకమానదు. ఈ అవకాశము తీసుకొని చిత్రనిర్మాతలు సంఘాభ్యుదయానికి దేశాభ్యుదయానికి పనికివచ్చే చిత్రాలు తీస్తే యెంతేనా మేలుచేసినవారవుతారు అనటం సత్యదూరము కాదేమో!

★

వార్షికోత్సవం

(23-వ పేజీ తరువాయి)

ఖిరిన్: (వొళ్లు మరిచిపోతూ) యిక్కణ్ణుంచి బైటకి నడువ్!

మెర్ఛ్యూ: వుహూ హూం. వుహూ...అట్టాంటిదేమీ నాదగ్గిర పనికిరాదు.

ఖిరిన్: యీ క్షణంలోగిని నువ్వు యిక్కణ్ణుంచి వెళ్లకపోతే దర్వాన్ని పిలుస్తా నడువ్ బేటికి! (బూటుతో నేలని తన్నుతాడు.

మెర్ఛ్యూ: ఫర్వాలేదు. మరేం ఫర్వాలేదు. యీ తాటాకుచప్పుళ్లకి నేనేమీ భయపడను. నీయంటివాళ్ళని యింతకి ముందు బొచ్చెడుమందిని చూశాను తెల్సా! లోఫీ!

ఖిరిన్: యింతకంటే గయ్యాళిగంపని యింతకుముందెప్పుడూ నా జీవితంలో చూసినట్లు జ్ఞాపకం లేదు...హబ్బా...తల నెప్పికూడా వచ్చింది...(భారంగా గాలి పీలుస్తూ) మరోసారి చెబుతున్నా...విన పడుతూందా? నువ్విక్కణ్ణుంచి బైటకి పోకపోయావంటే-ఓ ముసిలిభూతం-నిన్ను పిండిపిండిగా నూరేస్తా. నేను మంచి ముండాకొడుకునిగాదసలు. రెచ్చిపుట్టిందంటే నిన్ను బతికినంతకాలమూ కుంటిదానివిగా వుండేట్లు విరగ్గొట్టేస్తా. నేను యేదోవొకటి చేస్తా మొత్తానికి!

మెర్ఛ్యూ: మొరిగే కుక్కల్ని నేను యెరుగుదును. నే నేమీ భయపడేదాన్ని గాదు. నీయంటిరకాన్ని యింతకుముందు బొచ్చెడుమందిని చూశా.

ఖిరిన్: (యేదోవా తోచక) యిక సహించలేను. నాకు రోగమొచ్చినట్లుంది. సహించలేను. (రాతబల్ల వద్ద కూచుంటాడు) యీ బ్యాంకును ఆడగుంపుతో నింపేశారు. మరి నేనేమో రిపోర్టు పూర్తి చెయ్యాలట. వుహూ చెయ్యలేను.

మెర్ఛ్యూ: పరాయివాళ్ల సొమ్ము నాకు పూచికపుల్లంతగూడా అక్కర్లేదు. నాకు న్యాయంగా రావాల్సిన సొమ్మే నాకు కావాలంటున్నా. నీకు సిగ్గులేదు. ఫెల్టుబూడ్సులు తొడిగి గవర్నమెంటు ఆఫీసులో కూచుని..........

(షిపుచిన్, తాతియానా వస్తారు)

తాతియానా: (భర్తతో) ఆసాయంత్రం మేము బెరిజినిట్స్కీ యింటివద్ద కాలక్షేపం చేశాం. అప్పుడు కాట్యా మెడదగ్గిర కిందకి కత్తిరించబడిన ఫ్రాకు తొడుక్కుంది. దువ్వి సరిజేసిన ఆ జుట్టుతో చాలా బాగా వుంటుంది కాట్యా...నేను ఆమె జుట్టు సరిజేశాను. ఆమె చాలా మనోహరంగా వుంది......

షిపుచిన్: (యింతకిముందు యీ సోదిలో విసుగెత్తడంవల్ల) అవునవును...మనోహరంగా వుంది...వాళ్లే క్షణాన్నయినా యిక్కడికి రావొచ్చు...

మెర్ఛ్యూ: మహాప్రభూ!

షిపుచిన్: (నీరసంగా) యింకా యేందమ్మా? యేం కావాలి?

మెర్ఛ్యూ: మహాప్రభూ! (ఖిరిన్ చూపి) యీమనిషి... యీమనిషి తన వేళ్లతో టేబులుమీద కొట్టి, తర్వాత నుదుటిని ముట్టుకొని... మీరేమో నా వ్యవహారం చూడమని యీయనకి చెప్పిపోయారు. మరి ఆయనేమో నన్ను అనరాని మాటలన్నీ అని అవమానం చేస్తున్నాడు. నేను యే అండాదండా లేని అవిటిదాన్ని...

షిపుచిన్: సరే అయితే. ఆసంగతి నే చూస్తా లేవమ్మా... యిప్పటికి యిక వెళ్లు. తర్వాత రా...(తనలో) మళ్ళీ వాతనెప్పలొస్తున్నాయి...

ఖిరిన్: (షిపుచిన్‌తో మెల్లగా) ఆంద్రీ ఆంద్రీవిచ్! దర్వాన్ని పిలిపించి యీమనిషిని మెడబట్టి బేటికి గెంటించండి. మన మింకేం చెయ్యగలమో చెప్పండి మరి?

షిపుచిన్: (భయపడి) వుహూహూ. ఆపని చేస్తే పెద్దగల్లంతు చేసి మన పరువు కాస్తా తీస్తుంది. యీ ఆఫీసులో మన మొక్కళ్లమే గాదుగా వున్నదీ!

మెర్ఛ్యూ: మహాప్రభూ..

ఖిరిన్: (యేడ్పుగొంతుతో) కాని, నేను రిపోర్టు పూర్తిచేసి చావాలిగదండీ!? యిక నాకు మనశ్శాంతి యేది? వుహూ. పూర్తిచెయ్యను.

మెర్ఛ్యూ: మహాప్రభూ. నాడబ్బు యెప్పుడిప్పిస్తారండీ? నాకిప్పుడే కావాలి.

షిపుచిన్: (తనలో, దిగుల్తో) చె...ప్పు... కొదగ్గ.... ఆడజంతువు! (ఆమెతో మర్యాదగా) అమ్మా యిది బ్యాంకి అనీ, ప్రయివేటు వ్యాపారసంస్థ అనీ మీకు చెప్పనే చెప్పాను.

మెర్ఛ్యూ: మహాప్రభూ! నేను మీ బిడ్డ ననుకోండి... డాక్టరుసర్టిఫికెట్టు చాలకపోతే, పోలీసులనించిగూడా వొకటి తెస్తాను. నాడబ్బు యియ్యమని వారికి చెప్పండి బాబూ.

షిపుచిన్: (రొప్పుతూ) హ...బ్బా...

తాతియానా: (మెర్ఛ్యూతో) అమ్మా-మీరు వాళ్లపని చెడగొడుతున్నారని వారు మీకు చెప్పారుగదా? అసలు, మీకీ హక్కు యెక్కడిది?

మెర్ఛ్యూ: అమ్మా. చక్కని తల్లీ. నన్నెవరూ ఆదుకోరు. తినటం, పనుకోటం మాత్రమే నేను చేసేపనల్లా. నేడు కాఫీ తాగాను గాని యేంటోగా వుంది.

షిపుచిన్: (పూర్తిగా విసిగిపోయి) యెంత కావాలి?

మెర్ఛ్యూ: 20 రూబుళ్లు 36 కోపెక్కులు.

షిపుచిన్: సరే అయితే. (25 రూబుళ్ల నోటు జేబులోంచి తీసి ఆమెకిస్తాడు) యివిగో. 25 రూబుళ్లు. తీసుకొని... యిక పో.

(ఖిరిన్ కోపంగా దగ్గుతాడు)

మెర్ఛ్యూ: మహాప్రభూ. మీకు మరీ మరీ దండాలండీ (డబ్బు దాచుకొంటుంది)

తాతియానా: (భర్త పక్కన కూచుంటుంది.) నే నిప్పటికే యింటికి పోవాల్సింది. (వాచి చూసి) కాని, చెప్పవలసిందంతా చెప్పలేదు. యిక ఒక్క నిముషంలో అంతా చెప్పేసి వెళ్తాను. యెంత హాయిగా గడిపామని! నిజం, యెంత హాయిగా నని!! బెరిజినిట్స్కీ యింటికి కాలక్షేపంకోసం వెళ్లాం—అంతా బాగా జరిగింది. చాలా ఖులాసాగా. ప్రత్యేకంగా చెప్పాల్సిందేమీ లేదు....కాట్యాని చేసుకొంటానన్న గ్రెండిలెవిస్కీ గూడా అక్కడున్నాడు...నేను కాట్యాతో మాట్లాడాను; గోలపెట్టాను; గ్రెండిలెవిస్కీతో మాటాడి అతన్ని వద్దనమని చెప్పమన్నాను. సరే. అంతా బాగా జరిగిపోతుందనుకొన్నా. అమ్మకి యిది చెప్పి శాంతపరిచాను. కాట్యాను రక్షించాను గదా యని నేను వూరటపడదామనుకొన్నా...ఐతే, యేం జరిగిందనుకొన్నావ్? రాత్రి భోజనానికిముందు కాట్యా నేనూ గలిసి చెట్ల పొల్పుమధ్యగా నడిచివెళ్తున్నాం. యింతలో అకస్మాత్తుగా (వుద్రేకంలో) తుపాకి పేలిన ధ్వని వినపడింది...వుహూ...దాన్నిగురించి నెమ్మదిగా చెప్పలేను. (జేబురుమా లూపుతుంది) వుహూ...చెప్పలేను నెమ్మదిగా...

షిపుచిన్: (నిట్టూర్చుతూ) హ...బ్బా...

తాతియానా: (యేడుస్తుంది) మేము వేసంగిగృహంలోకి పరుగెత్తాం... అక్కడ...పాపం గ్రెండిలెవిస్కీ.... చేతిలో వొక పిస్తోలుతో....పడివున్నాడు!

షిఫ్రచిన్: వుహూ. యిక సహించలేను! సహించను!! (మెర్ ఖ్యూతో) యింకా యేం కావాలమ్మా నుంచున్నావ్?

మెర్ ఖ్యూ: మహాప్రభూ! నా పెనిమిట్ని యిక పనిలోకి చేర్చుకోరా వారు?

తాతియానా: (యేడుస్తూ) అతడు సరిగ్గా గుండెలోకే కాల్చుకొన్నాడు....యిదుగో యిక్కడా...పాపం అతను స్పృహ లేకుండా పడిపోయివున్నాడు...చాలా భయపడిపోయాడు...డాక్టర్ని పిల్చుకురమ్మన్నాడు...వెంటనే డాక్టరు వచ్చాడు...పాపం అతన్ని బతికించాడు.

మెర్ ఖ్యూ: మహాప్రభూ! నా పెనిమిట్ని వారిక పనిలోకి చేర్చుకోరా?

షిఫ్రచిన్: వుహూ. యిక యెంతమాత్రమూ భరించలేను. (యేడుస్తూ) సహించలేను! (ఖిరిన్ వైపు నిస్పృహతో రెండు చేతులూ చాచుతాడు) ఆమెని తోలేసెయ్యి. గెంటేసెయ్యి, నామాట విని.

ఖిరిన్: (తాతియానావద్ద కెళ్లి) ఫో బేటికి!

షిఫ్రచిన్: ఆవిడ్ని గాదు. యిదుగో యీ ఆమెమనిషిని...యీ గయ్యాళి గంపని. (చూపుతూ) ఆ మనిషిని!

ఖిరిన్: (వినిపించుకోక, తాతియానాతో) ఫో బేటికి! (బూటుతో నేల తన్నుతాడు) ఫో భేటికి!!

తాతియానా: యేమిటి? నువ్వు చేసే పనేంటి? నీకు మతేమన్నా పోయిందా?

షిఫ్రచిన్: ఘోరం! నేనొక అనాధని!! ఆమెని బేటికి తోలేసెయ్. గెంటెయ్ బేటికి.

ఖిరిన్: (తాతియానాతో) ఫో బేటికి! నిన్ను విరగ్గొట్టేస్తా. నిన్ను ముక్కూ ముఖం లేకుండా తన్నేస్తా. గవర్నమెంటు చట్టాల్ని గిట్టాల్ని కాలదన్ని పారేస్తా!

తాతియానా: (అతన్నుంచి పరుగిడుతుంది. అతడు వెంటబడి తరుముతాడు) యెంత ధైర్యం! సిగ్గూ శరం లేని శిఖండీ!! (అరుస్తుంది) ఆంద్రీ! అతన్నాపు. ఆంద్రీ! (యేడుస్తుంది)

షిఫ్రచిన్: (వాళ్లని తరుముతూ) ఆగండి. నామాట వినండి. యేమిటీ గోల? నా మీద జాలి తలవండి!

ఖిరిన్: (మెర్ ఖ్యూని తరుముతూ) భేటికి నడువ్! పట్టుకోండా ముండని!! బుర్ర పగలగొట్టండి. ముక్కలు ముక్కలుగా నరకండి.

షిఫ్రచిన్: (అరుస్తాడు) ఆగు. నామాట విను...బతిమాలుతున్నా...

మెర్ ఖ్యూ: చిన్న బాబుల్లారా...చిన్న బాబుల్లారా...(యేడుస్తుంది) చిన్న బాబుల్లారా...

తాతియానా: (అరుస్తుంది) సహాయం.. సహాయం...హబ్బా...హబ్బో...నాకు జబ్బొచ్చింది...జబ్బొచ్చింది......(కుర్చీలోకి దూకి, తర్వాత సోఫాలో కూలబడి మూర్ఛపోయినట్లుగా మూల్గుతుంది)

ఖిరిన్: (మెర్ ఖ్యూని తరుముతూ) యీ మనిషి బుర్ర పగలగొట్టండి. ముక్కలు ముక్కలుగా నరకండి.

మెర్ ఖ్యూ: అబ్బా...అబ్బో...చిన్ని బాబుల్లారా...నాకంతా చీకటిగా వుంది. అబ్బా (షిఫ్రచిన్ చేతుల్లోకి స్పృహతప్పి పడిపోతుంది. తలుపు తన్ని నశబ్దం. ఒక కంఠధ్వని డెపుట్యేషన్ వచ్చిందని చెబుతుంది.)

షిఫ్రచిన్: డెపుట్యేషన్...రెపుట్యేషన్...ఆక్యుపేషన్!

ఖిరిన్: (బూటుతో నేల తన్నుతాడు) బేటికి పో-నన్ను భూతం మింగ! (చొక్కా చేతులు మడిచి) దాన్ని నాకు యివ్వండి. గవర్నమెంటుచట్టం గిట్టం నాదగ్గిర పనికిరాదు.

(ఐదుగురు సభ్యులుగల ఒక డెపుట్యేషన్ వస్తుంది. అంతా ఫ్రాకుకోట్లు ధరించివున్నారు. మొఖమల్ రంగు అట్టతో వున్న స్వాగతపత్రం ఒకరి చేతిలో వుంటుంది. మరొకరి చేతిలో వెండిజాడీ ఒకటుంటుంది. పబ్లిక్ డిపార్టుమెంటు ఆఫీసులో వారు వీరివంక చూస్తారు. తాతియానా సోఫామీదా, మెర్ ఖ్యూ, షిఫ్రచిన్ చేతుల్లోనూ మూలుగుతుంటారు.)

రాయబారవర్గంలో ఒకరు: (చదువుతాడు) "ప్రియమైన, అత్యంతగౌరవనీయమైన ఆంద్రీఆంద్రీయెవిచ్! మన ఆర్థిక కార్యనిర్వహణయొక్క గత చరిత్రను అవలోకించినయపుడున్నూ, మన మనసులో దాని క్రమానుగతాభివృద్ధిని పునర్విమర్శన చేసికొనినయపుడున్నూ, మనకు మిక్కిలి సంతృప్తికరభావ మేర్పడుచున్నది. బ్యాంకుయొక్క ప్రారంభదశలో అల్పం బగు పెట్టుబడియు, చురుకగు కార్యక్రమ శూన్యతయు, బ్యాంకుయొక్క అనిశ్చిత ఆశయమును, హామ్లెట్ యెదుర్కొనిన "చావో, బతుకో" అను సమస్యకు చాల ప్రాధాన్యత యిచ్చునట్లు జేసెను. మనము బ్యాంకును యెత్తివేయవలయునని ఒకసారి కొందరు అనిరిగూడను. కాని, ఆ సమయమున మీరు మన వ్యాపారసంస్థయొక్క నాయకులైరి. మీ లోకజ్ఞానము, మీ కార్యనిర్వాహకశక్తి, మీ లౌకికయుక్తి ప్రయుక్తులు, మన బ్యాంకుయొక్క అసాధారణ విజయమునకు, విశాలవ్యాప్తికి కారణంబులు. యీ బ్యాంకుయొక్క ప్రతిష్ఠ... (దగ్గుతాడు)...ప్రతిష్ఠ...

మెర్ ఖ్యూ: (మూల్గుతుంది) హా...బ్బా.

తాతియానా: (మూల్గుతుంది) మంచినీళ్లు...మంచినీళ్లు...

రాయబారవర్గసభ్యుడు: (తిరిగి చదువుతాడు) "ప్రతిష్ఠ..." (దగ్గుతాడు) "...బ్యాంకుయొక్క ప్రతిష్ఠ......తమనివలన యెంత ఔన్నత్యమునకు గొనిపోబడినదన, మనము యీనాడు పెద్దపెద్ద విదేశీయ సంస్థలకి పోటీగా పనిచేయుచున్నాము."


షిఫ్రచిన్: డెపుట్యేషన్...రెపుట్యేషన్...ఆక్యుపేషన్..."వొక నాటి రాత్రి షికారుకు పోయిన స్నేహితు లిద్దర్ని కాంతిలేని చంద్రుడు తలకిందులుగా పట్టుకొన్నాడు...యవ్వనం నిష్ఫలమని, అనూ...నా మనసు మూర్చెనని, చెప్పబోవోయ్..."

రాయబారవర్గసభ్యుడు: (తత్తరబిత్తరతో చదువుతాడు) "తదుపరి వర్తమానకాలమునందలి పరిస్థితుల గాంచినయెడల, ప్రియమైన, అత్యంత గౌరవనీయమైన ఆంద్రీ ఆంద్రీ యెవిచ్, మేము." (స్వరం తగ్గిస్తూ) అలా అయితే పరేలెండి. మనం తర్వాత చదువుకోవచ్చు. అవును...తర్వాత...

(రాయబారవర్గం అయోమయంతో వెళ్లిపోతుంది)

★

వ్యంగ్యం :



ఇటీవల బెంగుళూరులో జరిగిన ఒక శాస్త్రజ్ఞుల మహాసభకు వెళ్లి వివరాలను పంపవలసిందని 'విశ్వరూపం' సంపాదకుడుగారు చెప్పినప్పుడు, అక్కడ చాల ఉత్సాహం కలిగించే విషయాలను తెలుసుకోవచ్చని అనుకున్నానేకాని, ఇంత గొప్ప నాటకానికి సూత్రధారుణ్ణి అవుతానని ఊహించలేకపోయినాను.

మహాసభవారు సోవియట్ జీవశాస్త్రజ్ఞుడు లిసెంకో పరిశోధనలను గురించి చర్చిస్తున్నారు. బాహ్యపరిస్థితులవల్ల జీవజంతువులలో కలిగిన మార్పులు వాటి సంతానానికి కూడా సంక్రమిస్తవా లేదా అన్న సమస్య అది. కాని చర్యమాత్రం రాను రాను శాస్త్రీయాంశాలను వదిలిపెట్టి సోవియట్ రాజ్యాంగంమీదనూ, కమ్యూనిస్టు సాంఘికనీతిమీదనూ తర్జనభర్జనలుగా మారిపోయింది. స్టాలిన్‌ని విమర్శించే మాటలతో ఒక రచయిత తన 'శాస్త్రీయ' వ్యాసాన్ని మొదలుపెట్టటంతో వ్యవహారం శ్రుతిమించి, అధ్యక్షుడు చర్చను వాయిదా వేశాడు.

అంతా బయటికి వస్తుండగా కనిపించాడు ఆయన. పేరు ప్రొఫెసర్ శేఖర్. —పరిశోధనాలయంలో జీవరసాయనశాస్త్రనిపుణుడు.

శాస్త్రజ్ఞుల్లో కూడా నిర్మాణాత్మకమయిన దృష్టి లోపిస్తున్నందుకు ఆయన విచారాన్ని వెల్లడిస్తూ, దేశాన్ని ఎదుర్కొంటున్న ముఖ్యసమస్యలమీద వాళ్లు తమ దృష్టిని ప్రసరింపచేస్తే బాగుంటుందని అన్నాడు. నేను ఆహారసమస్యనుగురించి ప్రస్తావించాను. ఆయన వెంటనే అత్యుత్సాహంతో ఒక విషయం చెప్పాడు. రాజాజీ ఒకసారి మైసూరులో మాట్లాడుతూ గడ్డిలోనుంచి పాలను తీయాలని సూచించాడనీ, ఆ విషయమై తన పరిశోధన దాదాపు నెగ్గినదనీ ఆయన అన్నాడు. కొంతసేపు మాట్లాడి వివరాలు తెలుసుకున్నతరవాత ఈవిషమై రాజాజీనే కలుసుకోనటం మంచిదని సూచించాను.

* * *

ఆ తరవాత ఆయన కోరికమీద, నానా తంటాలూ పడి రాజాజీతో ఇంటర్‌వ్యూ సంపాదించాను.

* * *

(ఢిల్లీలో హోంమంత్రికార్యాలయంలో రాజాజీ గది. రాజాజీ కూర్చుని ఉండగా నేను ప్రొఫెసర్ శేఖర్‌తో కలిసి ప్రవేశించాను.)

నేను : నమస్తే రాజాజీ.

రాజా : నమస్తే, రండి? కూర్చోండి... మీరు—

నేను : మీరు లోగడ మైసూర్ వొచ్చినప్పుడు ఇచ్చిన సందేశం గుర్తున్నదనుకుంటాను.

రాజా : ఏ అంశానికి సంబంధించినది?

నేను : శాస్త్రజ్ఞులు గడ్డిలోనుంచి పాలను తీసేమార్గం కనిపెట్టాలని మీరు హెచ్చరించారు.

రాజా : (చిరునవ్వుతో) అవును. కొంపతీసి ఎవరయినా కనిపెట్టలేదు గదా?

నేను : సరీగా అదే జరిగింది.

రాజా : (ఆశ్చర్యంతో) ఆః! నిజం?

నేను : ఇంత తంటాలుపడి మీ దగ్గరకు వొచ్చింది పరాచికాలాడేందుకా?

రాజా : (ఆముదం మింగుతున్న ముఖం పెట్టి) అయితే ఎవరు కనిపెట్టారు?

నేను : ఇదుగో ప్రొఫెసర్ శేఖర్ గారు. వీరే దానిని సాధించారు

రాజా : వీ రేం చేస్తుంటారు?

నేను : —పరిశోధనాలయంలో జీవరసాయనశాస్త్రనిపుణులు. అసలు అభిప్రాయం కలిగించినవారు మీరుకనుక, ముందు మీతోనే సంప్రదించటం మంచిదనుకున్నాం.

(రాజాజీ నెమ్మదిగా కోలుకుంటాడు. ఇంతలో టెలిఫోన్ మోగింది.)

రాజా : ఎవరది? మున్షీజీ?—

(కొంతసేపు మాట్లాడి ఫోన్ పెట్టేస్తాడు.)

నేను : క్షమించాలి. మీకు అతిజరూర్ పనులేమయినా ఉంటే మళ్ళీ కలుసుకుంటాం.

రాజా : లేదులేదు. సోమనాథ్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన విషయా

లను చర్చించటానికి, నాకు తీరిక ఉంటే వస్తానని మున్షీజీ చెప్పాడు.

నేను : వారికి తీరిక ఉంటే వారుకూడా ఈ పరిశోధనను గురించి వినవచ్చునుకదా! ఏమంటారు ప్రొఫెసర్?

శేఖర్ : నిజమే. ఆహార మంత్రిగారు వినటంకన్నా కావలసిందేమిటి?

రాజా : (నిస్పృహతో ఒకసారి నావంక చూస్తాడు) అయితే వారందరినీ ఒకసారి పిలిచి చూస్తానులెండి.

(కాసేపు టెలిఫోన్ నిర్విరామంగా పనిచేస్తుంది. కొంచం కాలవిరామం రాజాజీ మామూలు బింకమంతా సడలినట్లు కనిపిస్తున్నాడు. చీటికీమాటికీ నల్లద్దాల కళ్లజోడు తీసి, తుడిచి పెట్టుకుంటున్నాడు. మధ్యమధ్య నావంకా, ప్రొఫెసర్ వంకా అనుమానంతో పక్క చూపులు విసురుతున్నాడు. ఇంతలో నెమ్మదిగా ఒకరి తరవాత ఒకరుగా, కె. ఎం. మున్షీ, డా॥ అంబేద్కర్, ఎస్. వి. గాడ్గిల్, మహావీర్ త్యాగి ప్రవేశిస్తారు. పరామర్శలయి అంతా సర్దుకుని కూర్చున్నారు.)

నేను : (లేచి నిలబడి) ఎవరూ పరిచయం చేయనిదే మాట్లాడుతున్నందుకు అంతా క్షమించాలి. మాది విలేఖరులకులం అని తెలిస్తే మీరు తప్పకుండా క్షమిస్తారు.

అంబేద్కర్ : అది మాకు కొత్తేమీ కాదు లెండి.

నేను : ప్రస్తుత భారత ప్రభుత్వ నాయకులందరిలోనూ రాజాజీ అదృష్టవంతులని చెప్పాలి.

అంతా : హియర్! హియర్!

నేను : గాంధీజీ అంతటి వ్యక్తితోనే పోట్లాడినప్పటికీ చివరకు ఆయనే గద్దె ఎక్కాడు. వెనక కూడా రాజకీయాలను వదిలి ఆశ్రమస్వీకారం చేసినవాడల్లా తలుచుకోంగానే మద్రాసుప్రధాని అయినాడు. అక్కడవాళ్ళకి ఇప్పుడు ఆయన అవసరం తీరిపోగా, గవర్నర్ జనరలే అయినాడు. ఆయన తెలివితేటలు కనిపెట్టే, అమెరికన్ రచయిత జాన్‌గంథర్ ఆయనకు దక్షిణభారత సృగాలమనే బిరుదును ఇచ్చాడు.

అంతా : శభాష్! శభాష్!

(రాజాజీ నావైపు ఒక కోరచూపు విసిరాడు.)

నేను : అసలు ఆయనది అదృష్టజాతకం. అన్నంలేని జనానికి గడ్డిని తినేమార్గం ఆలోచించమని సలహా ఇచ్చినప్పటికీ ఎవ్వరూ కొంచమయినా కోపం తెచ్చుకోలేదు. ఆ మాట ఒక ఉద్యోగి అన్నందుకే ఇదివరకు ఫ్రాన్సులో రాజరికం శాశ్వతంగా కూలిపోయింది.

అంతా : (నన్ను చురచుర చూశారు.)

నేను : అయితే రాజాజీ అదృష్టం ఎప్పటికీ ఆయన్ను విడిచి పెట్టదు. గడ్డిలోనుంచి పాలను తయారుచేయాలని ఆయన ఉపన్యాసధోరణిలో, ఒక ఛలోక్తికింద, విసిరినమాట ఈనాడు నిజం అవుతున్నది.

అంతా : (ఆశ్చర్యంతో) ఆఁ! ఆఁ! ఏమిటి?

నేను : అవును, నేను ఎంతమాత్రం అతిశయించి చెప్పటంలేదు. ప్రతిభావంతుడి ప్రతిభను మరొక ప్రతిభావంతుడే కనిపెట్టకలుగుతాడు. అట్లాగే రాజాజీ సూచనలో గొప్పదనాన్ని కనిపెట్టి దానిని యథార్థం చేయగల ప్రతిభ మన మిత్రుడు ప్రొఫెసర్ శేఖర్‌లో ఉన్నది.

(నేను కూర్చున్నాను.)

రాజా : మన మిత్రుడు పత్రికారచయిత ధోరణిలో చెప్పిన అతిశయోక్తులను మినహాయించి చూస్తే, ప్రొఫెసర్ శేఖర్ పరిశోధన ఆహార దుర్భిక్షంతో బాధపడుతున్న మన దేశానికి ఎంత తోడ్పడుతుందో గ్రహించగలం.

మున్షీ : ఆర్యమహర్షులు నిత్యం పాలను సేవించే, అంత ఉన్నత సంస్కృతికి పునాదులు వేయకలిగారు. శేఖర్ గారి ప్రయత్నం నెగ్గేట్లయితే, సాత్వికాహారమయిన పాలతో మన ప్రజల సంస్కృతి ఇంకొక మెట్టు పైకి వెళ్ళగలదు. కాబట్టి వారి సూచన గమనించవలసిందే.

మహావీర్ : ప్రొఫెసర్ సాబ్! మీరు దయచేసి విషయాన్ని వివరించాలి.

రాజా : ముందు వీరిని పరిచయం చేయనివ్వండి. వీరి పేరు ప్రొఫెసర్ శేఖర్. ప్రస్తుతం రాజకీయరంగంలో కనిపిస్తున్న నామమాత్ర ప్రొఫెసర్లవంటివారు కాదు వీరు. (అంతా ముసిముసినవ్వులు)-పరిశోధనాలయంలో జీవరసాయన నిపుణులుగా ఉంటూ, దేశానికి మాటలతో కాకుండా క్రియలతో సేవ చేస్తున్నారు. వీ రిప్పుడు తమ పరిశోధనని వివరిస్తారు.

(అంతా చప్పట్లు)

శేఖర్ : మీరంతా నా పరిశోధనపట్ల ఇంత శ్రద్ధను చూపిస్తున్నందుకు ఎంతో కృతజ్ఞుణ్ణి. అయితే నాకీ అవకాశాన్ని కలిగించిన విశ్వరూపం విలేఖరి గారికి మనమంతా కృతజ్ఞులమై ఉండాలి.

మహావీర్ : జర్నలిస్ట్ భాయ్ జిందాబాద్!

శేఖర్ : గడ్డిలోనుంచి పాలను తీయాలని రాజాజీ చెప్పిన విషయం నన్నెంతో ఆకర్షించింది. భారతీయ దృక్పథానికీ, పాశ్చాత్య దృక్పథానికీ, గల తేడా ఏమిటో దీనివల్ల తెలుస్తున్నది. అత్యుత్తమ ఆహారపదార్థమయిన పాలలోనుంచి కాసీన్ అనే పదార్థం తీసి దువ్వెన్లనూ, గుండీలనూ తయారుచేస్తున్నారు పశ్చిమదేశాలవాళ్లు. అతి నీరసమయిన గడ్డిలోనుంచి పాలను తయారుచేయమన్నారు మన రాజాజీ.

మున్షీ : (అంబేద్కర్‌తో) ప్రొఫెసర్ భాయ్‌కి సాంస్కృతిక దృష్టి కూడా ఉన్నదే!

శేఖర్ : ఇంక అసలు సంగతికి వద్దాము. గడ్డిలోనుంచి పాలను తయారుచేయాలంటే ముందు వాటిల్లో ఉన్న పదార్థాలేమిటో తెలుసుకోవాలి. పాలల్లో కాసీన్ అనే మాంసకృత్తులు, లాక్టోజ్ అనే పాల పంచదార, ఫాస్ఫొలిపిడ్ లనే భాస్వర సంబంధమయిన పదార్థాలు, కొవ్వుపదార్థాలు ఉన్నవి. ఇంక గడ్డిలో సెల్యులోజ్ అనబడే వృక్షపదార్థం, పిండిపదార్థం, వివిధలవణాలు, కొంచంగా కొవ్వు ఉన్నవి. మనం చేయవలసిందల్లా ఈ పదార్థాలను ఆ పదార్థాలుగా మార్చటమే.

అంతా : అవునవును.

శేఖర్ : ఒక రకం పదార్థాలను రెండో రకంలోకి మార్చాలంటే వాటిని ముందు మూలపదార్థాలలోకి విడగొట్టి, ఆతరవాత వాటిని మనకి కావలసిన పద్ధతిలో అమర్చుకురావాలి.

గాడ్గిల్ : ఒక ఇంటి ఇటికలతో మరొక ఇంటిని కట్టవలసివస్తే, దానిని పగలకొట్టినట్లన్నమాట.

శేఖర్ : సరిగా అంతే! ఈ మూల పదార్థాలను మా శాస్త్రంలో 'ఇటిక'లు అనే అంటారు. అయితే వీటిని విడగొట్టటమన్నది అంత సులభమయిన విషయం కాదు. అదు గదుగో! ఇంలోకే దిగులుపడక్కరలేదు. వాటిని పగలగొట్టటానికి ఎంజైమ్స్ అనే పదార్థాలు ఉపయోగపడతవి.

మున్షీ : వాటిని ఎక్కడనుంచయినా తెప్పించుకోవాలా?

శేఖర్: అవసరం లేదు. ప్రకృతిసిద్ధంగా మనదేశంలోనే సమృద్ధిగా లభ్యస్తవి.

మహావీర్: వందేమాతరం! సుజలాం! సుఫలాం—

శేఖర్: ముందు గడ్డిలోఉన్న పిండిపదార్థాన్ని విడదియ్యాలి. పిండిని ఉడకబెట్టి టయలీన్ అనే పదార్థాన్ని-ఇవన్నీ ఎంజైమ్స్‌లోనుంచి లభిస్తవి-కలిపిఉంచితే మనం ఎరిగిన మాల్టోజ్ తయారవుతుంది. దానికి ఇన్‌వర్టేజ్, లాక్టేజ్ అనే పదార్థాలను కలిపితే అది గ్లూకోజ్, గెలాక్టిన్ మొదలైన పంచదారలుగా మారుతుంది. వాటిని తరవాత వాలపంచదారగా మార్చుకోవచ్చు.

గాడ్గిల్: అయితే పిండిని ఉడకబెట్టకుండా మార్గం లేదూ?

శేఖర్: లేకేం ఉన్నది. అప్పుడు దానిని మన శరీరోష్ణంకన్నా కొంచం ఎక్కువ వేడిలోఉంచి ఎక్కువ టయలీన్‌తో కలిపి చాలాసేపు మర్దించాలి. అప్పుడు కూడా ఆ మార్పు వస్తుంది.

మున్షీ: అవును. మర్దనం గుణవర్ధనం అన్నాడు చరకాచార్యుడు.

రాజా: అట్లా అన్నది బుద్ధుడి శిష్యుడు జీవకుడేమో?

అంబేద్కర్: కావచ్చు! హరిజనులు బౌద్ధమతం పుచ్చుకోవాలని నేను ఊరికే అనను మరి.

శేఖర్: టయలీన్ రూపాంతరమయిన ఎమిలేజ్ అనే పదార్థం పచ్చిపిండినికూడా మార్చగలదు. ఇంక మాంసకృత్తుల విషయం. ఇవి అమినోఆసిడ్ లనబడే మూలపదార్థాలతో తయారయినవి. వీటినే మేము ఇటికలని అంటాం.

అంతా: ఆఁ హాఁ!

శేఖర్: మాంసకృత్తులను ప్రోటీన్‌లనీ, పాలీపెప్టైడ్‌లనీ అంటారు. వాటిని పగలకొట్టాలంటే ముందు హైడ్రోక్లోరిక్ ఆసిడ్‌లో ఊరబెట్టాలి. అప్పుడవి పక్వానికివచ్చి మెటాప్రోటీన్లుగా మారిపోతవి. అప్పుడు వాటికి పెప్సిన్ అనబడే ప్రకృతిసిద్ధమయిన పదార్థాన్ని కలిపితే, అవి పెప్టోన్‌లుగా మారుతవి. ఈ పెప్టోన్‌లను ట్రిప్సిన్ అనే పదార్థంతో పెప్టైడ్‌లుగా విభజించవచ్చు. పెప్టైడ్‌లంటే కొద్దిఅమినో ఆసిడ్‌లే కలిసిన మిశ్రపదార్థాలన్నమాట.

గాడ్గిల్: వాటిని అట్లాగే ఉపయోగించవచ్చునా?

శేఖర్: లేదు. ఎరిప్సిన్ అనే పదార్థం వాటిని ఎమినోఆసిడ్‌లుగా విడదీస్తుంది.

మున్షీ: ఇప్పటికి రెండు తేలినయ్!

శేఖర్: ఇంక మిగిలింది కొవ్వు. రెనిన్, లైపేజ్ అనే పదార్థాలు వాటిని కొంతవరకూ విభజించగలవుకాని పూర్తి విభజన జరగాలంటే కొన్ని పురుగులని ఉపయోగించాలి.

అంతా: ఛీ! ఛీ! ఛీ! థూ! థూ!

శేఖర్: పురుగులంటే తోకపురుగులు, గొంగడిపురుగులు కాదండీ.

మున్షీ: అయితే ముక్కుపురుగులా ఏమిటి?

శేఖర్: కాదు. అవి కంటికి కనిపించని సూక్ష్మక్రిములు.

మహావీర్: ప్రొఫెసర్ భాయ్! మీకు ఒక సలాం! మీపరిశోధనకు రెండు సలాంలు. మాచేత పురుగుల్ని తినిపిస్తారా?

శేఖర్: తొందరపడొద్దు. మీరు తాగే తేనె పురుగుల్లోనుంచి వచ్చిందే కదా.

మహావీర్: అబద్ధం! తేనె పువ్వుల్లోనుంచి వస్తుందిట.

శేఖర్: పువ్వుల్లో రసాన్ని తేనెటీగలు తాగితే, వాటి పొట్టల్లో అది మనం తాగే తేనెగా మార్పు చెందుతుంది. అప్పుడవి కక్కివేసిన తేనె మనం తెచ్చుకుంటాం.

మహావీర్: అంతేనా రాజాజీ.

రాజా: అవును.

శేఖర్: చివరకు ఈ ఎమినో ఆసిడ్లనూ, గ్లూకోజ్‌నూ, అన్నిటినీ కలిపి లాక్టోజ్, కొవ్వు, ఫాస్ఫోలిపెడ్‌లుగా తయారు చేస్తాం.

గాడ్గిల్: మరి దానికి యంత్రం ఏర్పాటయిందా?

శేఖర్: ఆ! తయారయింది. ముందు ఒక మరతిరగలిలో గడ్డినివేసి ఆడించాలి. అందులోకి టయలీన్, ఎమిలేజ్‌లు వచ్చే ఏర్పాటు ఉంటుంది. తయారయిన గ్లూకోజ్ మొదలైనవి బయటికి తీయబడతవి. మిగిలిన సరుకులో సెల్యులోజ్, మాంసకృత్తులు, కొవ్వు ఉంటవి. అప్పుడది వేరొకగదిలోకి పంపబడుతుంది. అందులో హైడ్రోక్లోరిక్ ఆసిడ్, రెనిన్, పెప్సిన్, లైపేజ్ మొదలైన పదార్థాలు ఒకదాని తరవాత ఒకటి కలుస్తూఉంటవి. కాసీన్ మొదలైన పదార్థాలను చిలికి పెరుగువలె చేసే సాధనంకూడా దాని చివర అమర్చబడుతుంది. ఇందులో కూడ కొద్దిగా గ్లూకోజ్ తయారయి, బయటికి తోడబడుతుంది. అప్పుడు సరుకు ఒక చిక్కటి గంజిమోసరు ఉంటుంది.

రాజా: తరవాత?

శేఖర్: ఆ తరవాత మరొకగదిలోకి పోయి ట్రిప్సిన్, ఎమిలేజ్, లైపేజ్ మొదలైనపదార్థాలతో కలుస్తుంది. కొవ్వునుంచి కొంత గ్లిసరిన్ విడిపోతుంది, అక్కడనుంచి సరుకు మెలికలు తిరిగిన ఒక పెద్ద గొట్టంలోకి ప్రవేశిస్తుంది. అక్కడ ఎరిప్సిన్, ఇన్‌వర్టేజ్, లాక్టేజ్ లైపేజ్ మొదలైనవి ఇందులో కలుస్తవి. తయారయిన గ్లూకోజ్, గెలాక్టోజ్‌లు వేరే తీసుకొనిపోబడతవి.

మహావీర్: ఒకటే రకం పదార్థాలను అన్నిగదుల్లో వేరే వేరే కలపకపోతే ఒక్కసారే కలపకూడదూ?

శేఖర్: ఈ ప్రక్రియ నెమ్మదిగా అంచెలమీద జరగవలసిందే. ఇంకో మార్గం లేదు. మెలికలగొట్టంలోనుంచి ఆ పదార్థం పురుగులగొట్టంలోకి పోతుంది. అక్కడ కొవ్వు పూర్తిగా విభజించబడుతుంది.

రాజా: ఆ తరవాత?

శేఖర్: ఎస్ట్రిన్ అనే జంతుసంబంధ పదార్థం మాంసపదార్థాలతో కలిసి పాలను తయారుచేసే పనిముట్లను తయారు చేస్తుంది. అందులో పై సరుకు ప్రవేశించి గ్లూకోజ్ మొదలైనవాటిలో కలిసి పాలు తయారవుతవి. ఈ ప్రక్రియకు ప్రొలాక్టిన్ అనే పదార్థం ఉపయోగిస్తుంది.

మనలో మాట! ఈ ప్రొలాక్టిన్ అనే పదార్థాన్ని ఆడజంతువులకి ఇస్తే వాటికి పిల్లలమీద మమకారం పెరుగుతుందనీ, స్త్రీత్వం ఎక్కువవుతుందనీ కనిపెట్టబడ్డది.

అంబే: నిజం?

శేఖర్: నిజమే.

అంబే: అయితే హిందూన్యాయశాస్త్ర సవరణబిల్లుకి ఆటంకం ఉండదన్నమాట

అంతా: అదేమిటి? దీంతో దాని సంబంధం ఏమిటి?

అంబే: ఆ బిల్లును ఎదిరిస్తున్నవాళ్లందరికీ ఒక్కటే భయం, ఆడవాళ్లు ఎక్కడ నెవులకి తాటాకులు కడతారోఅని. ఈ మందుని ఆడవాళ్లందరికీ విధిగా ఇప్పిస్తే వాళ్ల భయం తీరిపోతుందని చెప్పొచ్చు.

మహావీర్: సమర్తాడిన పిల్లలకు చిమ్మిరి పెట్టినట్లుగానా?

(అంతా నవ్వారు.)

నేరు: కాని డాక్టర్‌సాబ్ కొంపతీ. ఈ ఆడవాళ్లు ఆ సరుకుని మనకే పెడతారేమో!

అంతా: ఆఁ-! ఆఁ!

నేరు: అవును మరి! పిల్లల పెంపకాన్ని వొదిలినట్లే, కనటంకూడా మొగవాళ్లకు నెట్టేస్తారు.

(46-వ పేజీ చూడండి)



వేమన పద్యాలు

శ్రీ సి. హెచ్. బ్రహ్మలింగేశ్వరరావు

పుస్తకంబుపట్ట వస్తుంది తలనొప్పి,
పిక్చరంటె చాలు ప్రేమ పుట్టు.
పాడు సినిమ లొచ్చి బాలుర జెరచెరా
విశ్వదాభిరామ వినుత వేమ.

ఇంజనీరుకోర్సు ఇంగిలీసున పడ్చి
ఇంటి చుట్టుకొలత నీయ లేడు.
ఇట్టి చదువుకన్న వట్టి చాకలిమేలు,
విశ్వదాభిరామ వినుర వేమ.

మంత్రి పదవి కొరకు మాటలెన్నో జెప్పి
మంత్రియైన పిదప మానియారె.
వోటు నిచ్చి నోటు నొట్టి దద్దమ్మరా
విశ్వదాభిరామ వినుర వేమ.

వర్తకంబు అంత వట్టి బ్లాకనివాగి
ఎట్టు లెట్టులో పరిమిట్టు తెచ్చి
పట్టపగలె తాను పైపైన అమ్మె
విశ్వదాభిరామ వినుర వేమ.

కూడు గుడ్డ లేని కూహోళ్లకంటేను
జోలె పట్టి బ్రతుకు జోగిమేలు.
రామరాజ్యమొ, ఇది రావణరాజ్యమో?
[illegible]భిరామ వినుర వేమ.



ఉభయపక్షాలు ఎంత జాగ్రత్తగా వున్నా, సంభాషణ అప్పుడప్పుడు కాస్త ఇబ్బందిగానే తయారైంది. ముఖ్యంగా టామ్‌కి నరాలుబిగిసి 'నేనింత గొప్ప పాత్రని నటించడానికి తగను,' అని ఒప్పేసుకోవాలనిపించింది చాలా సార్లు. కాని యువరాణి ఎలిజబెత్ తెలివితేటలవల్లా, పక్కనున్న ఇద్దరు ప్రభువుల చాకచక్యంవల్లా అంతా సద్దుకుపోయింది. జేన్ గ్రే పాఠం తెలివితక్కువగా ఒక ప్రశ్నవేసి టామ్‌ని కంగారుపెట్టింది:

"యువరాజు మహారాణిని ఇవాళ దర్శించారని తలుస్తాను."

టామ్ సందేహించాడు; బిక్కమొహం పెట్టాడు. నోటికొచ్చిందేదో అనేసేవాడే, గాని సెంటు జాన్ ప్రభు విదగ్రహించాడు. మంచి సమయస్ఫూర్తి గలవాడవటంచేత టామ్ బదులు అతనే సమాధానం చెప్పాడు.

"అవునమ్మా! యువరాజు మహారాణిదర్శనం చేసుకున్నారు. ఆమె ఆయనకు ధైర్యం చెప్పారు కూడా, తండ్రిగారికేం ఫరవా లేదని. అవునా ప్రభూ."

అనువాదం:
శ్రీ
నండూరి రామమోహనరావు

అవునన్నట్టు టామ్ ఏదో గొణిగాడు. కాని ప్రమాదకరమైన చోట కాలు పెడుతున్నట్టు అనిపించింది. తరవాత ఏదో మాటల మీద యువరాజు ఇక చదువు ఆపేస్తాడన్న మాట వచ్చింది. జేన్ గ్రే చాలా విచారం చూపిస్తూ

"అయ్యో పాపం! చదువు మానేస్తారా? కాని ఆట్టే రోజులు కాదనుకొంటా. మీ తండ్రిగారి లాగానే మీరుకూడా అనేక భాషలు నేర్చుకుని గొప్ప విద్వాంసులౌతారు."

"నా తండ్రా?" అని అరిచాడు టామ్, తను యువరాజ హోదాలో వున్నట్టు మరిచిపోయి.

"నా తండ్రికి తన భాష మాట్లాట్టమే చేతగాదు. అతనికంటే వీధుల్లో పోర్లాడే పందులు బాగా మాట్లాడ—"

టామ్ తల ఎత్తేటప్పటికి సెంటు జాన్ ప్రభువుకళ్లలో తీవ్రమైన హెచ్చరిక కనబడింది.

టామ్ మాట సగంలో ఆపేసి, సిగ్గుపడ్డాడు. "నా జబ్బు నన్ను చాలా అవస్థలు పెడుతోంది మహారాజును అగౌరవపరచాలని నా ఉద్దేశం కాదు," అని దీనంగా ఉన్నాడు.

ఎలిజబెత్ తన "సోదరుని" చేతులు తన చేతుల్లోకి మృదువుగా తీసుకుని, "మీ మెరుగుదుము యువరాజా! తమ ఆరోగ్యం బాగులేక ఆ మాటలన్నారే కాని వేరేం కాదు. అది మీ తప్పు కాదు, మీ మనస్సుది," అన్నది.

"మీ దయకి కృతజ్ఞుణ్ణి," అని మాత్రం అని పూరుకున్నాడు టామ్.

మరొకసారి జేన్ గ్రే ఊరుకున్నది పూరుకోక గ్రీక్ మాట నొకదాన్ని టామ్‌మీద రివాల్వర్‌లా పేల్చింది. టామ్ ముఖాన్ని చూడగానే అతని కామాట ఏమీ అంతుబట్టనట్టు తెలిసిపోతోంది. యువరాణి ఎలిజబెత్ ఇది గ్రహించి టామ్ తరఫున తనే జేన్ గ్రేకు గ్రీకుమాటలవర్షంతో సమాధాన మిచ్చింది; వెంటనే సంభాషణని మరో విషయం మీదికి మరల్చింది.

మొత్తానికి కాలం సరదాగానే గడిచింది. సంభాషణలో ఇప్పుడప్పుడే చిక్కులు రావటంలేదు. అందరూ తన్ని ప్రేమిస్తున్నారనీ, సరిగా ప్రవర్తించేందుకు సహాయపడుతున్నారనీ, తన తప్పుల్ని చూసీ చూడనట్టు ఊరుకుంటున్నారనీ టామ్ గ్రహించాడు; దాంతో మొదట్లోఉన్న బెరుకుతగ్గిపోయింది. సాయంత్రం లండన్ మేయరుగారు చెయ్యబోతున్న విందుకు ఈ ఇద్దరు బాలికలుకూడా వస్తారని తెలిసింది. "అమ్మయ్య, వీళ్లొస్తే మనకేం ఫర్వాలేదు. అంతమంది కొత్తవాళ్ల



యువరాజు మేనమామ,

హెర్ట్‌ఫర్డ్ ప్రభువు

మధ్య ఒంటరిగాణ్ణయిపోను," అని సంతోషించాడు టామ్. ఒక గంట కిందనైతే, ఎలిజబెత్, జేన్ గ్రేలు తనతో వస్తారని తెలిస్తే చాలా భయపడేవాడే; కాని ఇప్పుడు వాళ్లమీద మంచి అభిప్రాయం ఏర్పడింది.

టామ్‌ను కంటికి రెప్పలా కాపాడుకొస్తున్న ఇద్దరు ప్రభువులకి ఈ సంభాషణ ధోరణి ఏమీ సరదాగా లేదు. తుపాను పట్టి భీకరంగా ఉన్న సముద్రంలో పడవను కాపాడినట్టు కాపాడాల్సివచ్చింది టామ్‌ని. ఈ బాధ్యత చాలా బరువుగానే వుంది వాళ్లకి. అందుచేత బాలికలు ఇంకా కదలరేం అన్నట్టు చాలాసేపు ఎదురు చూశారు. ఇవ్వాల్టి కిది చాలదన్నట్టు గ్విల్‌ఫర్డ్ డడ్లీ ప్రభువు రాగోరుతున్నాడని ఓ సేవకుడు కబురు తెచ్చాడు. తమ పడవని ఇంకో తుపానులోకి ప్రవేశపెట్టడం ఏమీ క్షేమంగా తోచలేదు వాళ్లకి. అందుచేత డడ్లీ ప్రభువు నిప్పుడు రావద్దని చెప్పమని టామ్‌కు సలహా యిచ్చారు చెవిలో. టామ్ అలాగే చేశాడు.

జేన్ గ్రే, ఎలిజబెత్ గదిలోంచి ఇంకా కదల్లేదు. అందరు మౌనంగా కూర్చునిదిక్కులు చూస్తూ తికమకపడుతున్నారు. టామ్ కేమీ అర్థంకాలేదు ఈ మౌనానికి కారణం. హెర్ట్‌ఫర్డ్ ప్రభువుకేసి చూశాడు. ఆయన నేదో కంటితో సైగచేశాడు. కాని అదేమిటో తెలియలేదు టామ్‌కి. కాని ఎలిజబెత్ చురుకైనదికనుక ఇదంతా చిటికెలో గ్రహించేసింది.

"ఇక నా సోదరుడు సెలవిస్తే వెళ్లిపోతాం మేము," అని గౌరవం ఉట్టిపడేట్టు అన్నది.

"మీకు సెలవిచ్చేందుకు నే నెంతవాణ్ణి? మీరు ఏదైనాసరే కోరడం తరవాయి, నెరవేర్చేందుకు నే నెప్పుడూ సిద్ధంగా ఉంటాను. అయినా మీరు వెళ్లా లనుకుంటున్నారు గనుక వెళ్లండి," అని టామ్ అంతకంటే మర్యాద ఉట్టి

పడేట్టు పలికాడు. తరవాత మనసులో ఇలా అనుకున్నాడు: "నేను రాజుల కథలు వృథాగా చదవలేదన్నమాట. నాకు తెలియకుండానే రాజ మర్యాదలు, మాటలధోరణి అలవాటైపోయాయి. అదంతా ఇప్పుడు అక్కరకు వస్తోంది."

బాలికలిద్దరూ నిష్క్రమించాక టామ్ తన రక్షకులిద్దరికేసి తిరిగాడు. వాళ్లు కూడా అలిసిపోయినట్టు వాళ్ల మొహాలే చెబుతున్నాయి.

"నేను బాగా అలిసిపోయాను. ఏదన్నా మూలకి పోయి కాస్సేపు పడుకోటానికి మీరు అనుజ్ఞ ఇస్తారా?" అని అడిగాడు. హెర్ట్‌ఫర్డు ప్రభు వన్నాడు:

"అనుజ్ఞ ఇవ్వవలసింది మీరు, ఆచరించవలసింది మేము. తమరు విశ్రాంతి కోరేటట్లయితే, వెంటనే ఏర్పాట్లు చేస్తాము. అనక విందుకు వెళ్లాలి కూడాను. విశ్రాంతి తీసుకోవటం మంచిది."

హెర్ట్‌ఫర్డు ఒక గంట మోగించాడు; ఒక నౌకరు వచ్చి నిలబడ్డాడు; సర్ విలియం హెర్బర్టును రమ్మనవలసిందిగా చెప్పాడు. ఆ పెద్దమనిషి రెండు నిమిషాల్లో చక్కా వచ్చి టామ్‌ను ఒక అంతఃపురంలోకి తోడ్కొనిపోయాడు. అక్కడ టామ్ మొదట చెయ్యబోయిన పని ఏమిటంటే, కప్పుతో మంచి నీళ్లు తీసుకుని తాగబోయాడు; కాని అతనందుకు కదిలీ కదలగానే ఒక సిల్కు సేవకుడు అడ్డంవచ్చి మోకరించి, ఒక బంగారుపళ్లెంలో కప్పు ఉంచి అందించాడు.

తరవాత మన ఖైదీ చతికిలబడి కాలిజోడు విప్పుకోబోయాడు. కాని మరో సిల్కు సేవకుడు అడ్డం పడి అతిభక్తి చూపిస్తూ, మృదువుగా కాలిజోడు విప్పేశాడు. ఇదేవిధంగా ఇంకా రెండు మూడు పనులు తనంతట తాను చేసుకోబోయాడు కాని ప్రతిసారీ ఆ పనికి చెందిన సిల్కు సేవకుడు అడ్డం రావటం, ఆ పని చేయటం జరిగింది. ఈ తతంగమంతా చూస్తే టామ్‌కు బలేవిచిత్రమయింది. "వీళ్ల తరహా చూడగా నా బదులు వీళ్లే ఊపిరి పీల్చి పెట్టేటట్టున్నారు." అనుకున్నాడు.

అతని దుస్తులు మార్చబడ్డాయి; వెచ్చని కొత్తదుస్తులు తొడగబడ్డాయి; జాగ్రత్తగా మంచంమీద పడుకోపెట్టబడ్డాడు. పడుకున్నాడే గాని నిద్రపట్టటం లేదు. ఎందుకంటే అతని బుర్రనిండా అనేక ఆలోచనలు లుకలుక లాడుతుండటమే కాకుండా, గదినిండా అతని పనులు చేసిపెట్టిన సేవకులు బిలబిలలాడుతున్నారు. వాళ్లని పొమ్మని ఎలా చెప్పాలో తెలియక టామ్ ఫూరుకున్నాడు; ఆయన పొమ్మని ఆజ్ఞాపించకుండా ఎలా పోవాలో తెలియక వాళ్లూరుకున్నారు. మొత్తానికి ఇద్దరికీ ఇబ్బందిగానే వుంది.

టామ్ అంతఃపురానికి వెళ్లగానే అక్కడ అతని రక్షకులైన సెంటు జాన్, హెర్ట్‌ఫర్డు ప్రభువులు ఒంటరిగా మిగిలిపోయారు. కాస్సేపు మౌనంగా ఆలోచించారు. నిస్పృహగా "ప్చ్. ప్చ్." అంటూ, తలలు ఊగిస్తూ పచార్లు చేశారు. చివరికి ఉండబట్టలేక సెంటుజాన్ అడిగాడు.

"మీరేమనుకుంటున్నారు?"

"ఏముందీ. మహారాజు అవసాన దశలో ఉన్నారు. నా మేనల్లుడు పిచ్చివాడైఉన్నాడు. పిచ్చితోనే సింహాసన మెక్కుతాడు. పిచ్చితోనే రాజ్యం చేస్తాడు. ఇంగ్లండును భగవంతుడే రక్షించాలి ఇక."

"అవును అలాగే మరి. కాని మీకు అనుమానాలు రావటం లేదా? యువరాజు..." అని సెంటు జాన్ సంకోచిస్తూ మధ్యలోనే మాట ఆపేశాడు. అనదలచిన మాట అనేస్తే ఏం కొంప మునుగుతుందో అని జంకాడు. హెర్ట్‌ఫర్డు ప్రభువు అతని ఎదట నిలిచి అడిగాడు:

"చెప్పండి. ఇక్కడ నేనుతప్ప ఎవరూ లేరు."

"నా మనస్సుని ఒక అనుమానం పీడిస్తున్నది. కాని మీరు యువరాజుకు రక్తబంధువులు, మీరేమన్నా అనుకుంటారేమో నని భయపడుతున్నాను. మీరు క్షమిస్తే చెబుతాను. ఎంత పిచ్చివాడైపోయినా యువరాజు అంత ఇదిగా ఎలా మారిపోయారా అని ఆశ్చర్యం కలుగుతున్నది. రాజలక్షణాలు పూర్తిగా పోయాయని కాదు; కాని ఇదివరకు ఆయన ప్రవర్తనకీ ఇప్పటి ప్రవర్తనకీ చాలా తేడా లొస్తున్నాయి. తన తండ్రి గుణగణాలనే మరచిపోయేటంతగా ఎవరికైనా పిచ్చెక్కుతుందా? తనకు ఎవరు సేవకులో, ఎవరు సమానులో గుర్తు రానంతగా పిచ్చెక్కుతుందా? ఎంత పిచ్చెక్కినా లాటిన్ జ్ఞాపకం వుంచుకొని, గ్రీక్ మరిచిపోతారా?

మీరు కోపం తెచ్చుకోకండి; నా సందేహాలు తీర్చండి; తను యువరాజు కాదని ఆయన అన్నమాటలు చెవుల్లో రింగు మంటున్నాయి—"

"ఇక ఆపండి. మీరు రాజద్రోహకరంగా మాట్లాడుతున్నారు. మహారాజు ఆజ్ఞ మరచిపోయారా? మీమాటలు నేను వినగూడదు; నాకూడా రాజద్రోహ నేరం చుట్టుకుంటుంది."

సెంట్ జాన్ భయంతో పాలిపోయాడు; తొందరగా తన తప్పు కమ్ముకోవాలని ఇలా అన్నాడు:

"క్షమించండి ప్రభూ! నేను తప్పు ఒప్పుకుంటున్నాను. ఈసంగతి ఎవరికీ చెప్పనని వాగ్దానం చెయ్యండి. నేనిక ఆ మాట మళ్ళీ ఎత్తను. మీరు నన్ను కాపాడాలి; లేకపోతే దుమ్మైపోతాను."

"సరే, మీ కోరికను మన్నిస్తాను. మళ్లీ అలాంటి మాట ఇక్కడగాని, ఎక్కడగాని ఎత్తకండి. యువరాజువిషయంలో మీకలాంటి అనుమానాలూ అనవసరం. అతడు నాచెల్లెలి పుత్రుడు. అతడు ఉయ్యాలలో ఊగేరోజుల్నించి చూస్తున్నవాడిని నాకు, అతని ముఖం, గొంతుక, ఆకృతి ఆమాత్రం జ్ఞాపకంవుండవా? ఉన్మాదంవల్ల మనిషిలో ఎంతెంతలైనా విచిత్రమైన మార్పులు వస్తాయి. మార్లీప్రభువుకు పిచ్చెత్తిన విషయం మీకు తెలుసుగా. ఆయనేం చేశాడు! అరవైఏళ్లనుంచీ చూస్తున్న తన ముఖం తనది కాదు, ఇంకెవరిదో ననేవాడు; పైగా తన తలకాయ గాజుతో చేసిందనేవాడు; ముట్టుకుంటే కిందపడి పగిలిపోతుందని ఎవర్నీ ముట్టుకోనిచ్చేవాడు కాదు. ప్రభూ! మీ అనుమానాలు తీసెయ్యండి. అతడే యువరాజు. త్వరలో మీకు రాజవుతాడు."

ఈ విధంగా మరికొంతసేపు సంభాషణ జరిగింది. సెంట్ జాన్ ప్రభువు తన నేరాన్ని కప్పుకోటానికి, కుర్రవాడు పాఠం వల్లించినట్టు, "అతడే యువరాజు, అతడే యువరాజు," అనిచాలాసార్లు చిలకపలుకులు పలికాడు. తన కిప్పుడు అనుమానం ఏ కోశానా, లవలేశమైనా లేదన్నాడు; అతడు యువరాజు కాదని సాక్షాత్తు దేవుడు వచ్చి చెప్పినా తను నమ్మనన్నాడు.

సెంట్ జాన్ ప్రభువు సెలవుపుచ్చుకుని వెళ్లిపోయాడు. హెర్ట్ఫర్డ్ ప్రభువు మిగిలాడు. ఒక కుర్చీలో కూర్చుని గాఢంగా ఏదో ఆలోచించాడు. ఆలోచించినకొద్దీ ఆతని బుర్రలో రకరకాల భావాలు అంతర్యుద్ధం చెయ్యటం ప్రారంభించాయి. ఏమీ తోచక అటూయిటూ పెద్ద పెద్ద అంగలేస్తూ, పచార్లుచేస్తూ ఇలా గొణగసాగాడు:

"టుష్. అతడు యువరాజు కాకపోతే ఇంకెవడు? ఒక పేగుకు చెందకుండా, ఒక తల్లికి, తండ్రికి పుట్టకుండా అంత అద్భుతంగా పోలికలు సరిపోయే పిల్లలిద్దరుండటం అసంభవంకాదా? ఒకవేళ ఉంటారనుకో. ఒకళ్ళస్థానంలోకి మరొకళ్లు రావటం ఎలా కుదురుతుంది? ఆఁ, ఇదంతా వట్టిది, వట్టిది.

ఒకవేళ అతడు నిజంగా యువరాజు కాదనుకో. ఎవడో దొంగ అనుకో. అయితే తను యువరాజునే నని చెప్పి మోసగిస్తాడు గాని, కాదని ఎందుకంటాడు? ఏమిటో అంతా గొడవగావుంది. ఏమైనా ఇతడే యువరాజు; పిచ్చెక్కింది అంతే."

7

మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. టామ్ చాలా అవస్థపడుతూ బట్టలు తొడిగించుకున్నాడు. ఇదివరకటివాటికంటే ఈ బట్టలు మరీ ముద్దొస్తున్నాయి. ఈ బట్టల కార్యక్రమంముగిశాక టామ్ని ఒక విశాలమైన హాలులోకి తీసుకుపోయారు. అది మాంచి డాబుగా అలంకరించబడి వుంది. అక్కడ యువరాజుకోసం భోజనపు ఏర్పాట్లన్నీ సిద్ధంగా జరిగివున్నాయి. ఒక బల్లమీద రకరకాల తినుబండారాలమర్చబడి వున్నాయి. పాత్రసామానులన్నీ బంగారంతో చేయబడినవే. వాటిమీద అందమైన డిజైన్లు చెక్కబడి వున్నాయి. హాలులో చాలమంది సేవక ప్రభువులు చేతులు కట్టుకు నుంచున్నారు.

చర్చి అధికారి ఒకడు మామూలుగా భోజనానికి పూర్వం చేసే ప్రార్థన చేశాడు. వెంటనే టామ్ భోజన పళ్లెంమీద దాడిచేశాడు. అతనికి ఓ చెడ్డ అలవాటు ఏమిటంటే ఎదురుగా తినదగిన దేదన్నా కనిపిస్తే వెనక ముందూ ఆలోచించడు. ఎప్పుడూ ఆకలితో వుండేప్రాణి అయ్యె; ఏం చేస్తాడు మరి?

అతడు పళ్లెంమీద తొందరపడి చేసిన దురాక్రమణను బర్కిలే ప్రభువు వారించి టామ్ మెడచుట్టూ ముఖమల్ రుమాల వెడల్పుగా చుట్టాడు. (లోపల బట్టలు అంటుకాకుండా ఇంగ్లీషువాళ్లలాగే చుట్టుకుంటారు) వేల్సు యువరాజులకు అలా రుమాల చుట్టే ఉద్యోగం బర్కిలే ప్రభువులకు వంశపారంపర్యావస్తోంది.

టామ్ సారాయం తనంతట తాను వంచుకు తాగాలని చాలాసార్లు ప్రయత్నించాడు. కాని తుములాడిలా ఓసిల్కు నౌకరు మాట మాట్లాడితే అడ్డపడేవాడు.

వేల్సు యువరాజుకు సంబంధించిన 'ఆస్వాదక ప్రభువు' కూడా అక్కడే వున్నాడు. యువరాజు భోజనం చేసే ముందు ఈ ప్రభువు అన్నీ రుచి చూడాలి పూర్వకాలంలో రాజులు తమ విరోధు లెవరైనా భోజన పదార్థాల్లో విషం కలుపుతారేమోననే భయంతో ముందు రుచి చూసేందుకని కొందరిని నియమించేవారు. ఆరుచి చూసినవాడికి అపాయం జరక్కపోతే అది మంచి ఆహారమేనన్న మాట. అంటే వాడి ఉద్యోగం చాలా ప్రమాదంతో కూడుకున్నదే నన్నమాట. కాని మన కథాకాలం నాటికి ఈఉద్యోగమంత సుఖమైన దింకోటి లేదు. ఎప్పుడో కాని రుచిచూడవలసిన అగత్యం ఉండేదికాదు. ఈఉద్యోగానికి మనిషినే ఎందుకు నియమించేవారో, కుక్కనో పిల్లినో ఎందుకు ఉంచే వారుకాదో మనకి తెలియదు. అయితే రాజులు చేసే చాలా పనులకి అర్థం కనిపించదనుకోండి.

వీళ్లుగాక అంతఃపుర ముఖ్యసేవకుడు ఆర్సీ ప్రభువుకూడా అక్కడ నుంచున్నాడు. ఎందుకు నుంచున్నాడో దేవుడికి తెలియాలి. ప్రధాన బట్లర్ ప్రభువు, మహాసేవక ప్రభువు, ప్రధానవంట ప్రభువు కూడా చేతులు కట్టుకుని టామ్ కుర్చీ వెనకాల వినయంగా నుంచున్నారు. వీళ్లుగాక టామ్‌కి ప్రత్యేకంగా 384 గురు సేవకులున్నారు. వాళ్లంతా ఆ హాల్లో లేరు; అసలు అంతమంది ఉన్నట్టుకూడా టామ్‌కి తెలియదు.

ఇక్కడున్న అందరికీ, యువరాజు మతిచెడిందని, అతని పిచ్చి చేష్టలకి ఆశ్చర్యం చూపించొద్దనీ ముందే హెచ్చరిక ఇవ్వబడింది. ఆపిచ్చిచేష్టలు చూసి వాళ్లు కళ్లనీళ్లు పెట్టుకున్నారేగాని నవ్వలేదు. తమకెంతో ఇష్టుడైన యువరాజు ఇలా అయిపోవటం చూసి వాళ్లెంతో విచారించారు.

టామ్ చాలా ఆసక్తితో తన మెడ రుమాలని పరీక్షించాడు. ఎంత ముద్దొస్తోందో అది! అది పాడైపోతుందేమో, తీసెయ్యమన్నాడు; బర్కిలే ప్రభువు మారు మాట్లాడకుండా రుమాల విప్పేశాడు. ఇక తినటం ప్రారంభించాడు. అతను జన్మలో ఎప్పుడూ రొట్టెవగైరా లందుకు చాకులు, ఫోర్కులు ఉపయోగించలేదు. అందుచేత బంగారుచాకు, ఫోర్కు చేతులో పట్టుకున్నా ఎక్కువ భాగం వేళ్లతోనే కానిచ్చాడు. ఇది చూసీచూడనట్టు వూరుకున్నారు అంతా.

టామ్ ప్రతి ఆధరువునీ జాగ్రత్తగా పరీక్షించాడు. వాటి నెప్పుడూ అతను ముట్టుకు నెరగడు. అంచేత "ఇది తినచ్చా, అది తినచ్చా" అని ప్రతిసారీ అడిగాడు. అతని ప్రశ్నలకు చాలా వినయంతో జవాబిచ్చి ఊరుకున్నారు ప్రభువులు.

భోజనం ఎలాగైతేనేం పూర్తయింది. టామ్ పళ్లెంలో సీమబాదంకాయలుంటే గుప్పిళ్ళనిండా తీసుకుని జేబులు నింపుకున్నాడు. అంతా చూసీ చూడనట్టూరుకున్నారు. కాని మరు నిముసంలో అతని కనుమానం వేసింది, తనేదో తప్పు చేసినట్టు. తన్నింత వరకూ తన చేతుల్తో ఏపనీ చేయనివ్వలేదు వాళ్లు. మరి జీడిపప్పు జేబులో పోసుకుంటే ఏమీ అనలేదేం వాళ్లు? కనక ఇందులో ఏదో చెయ్యగూడనిది, 'అరాజకమైనది' వుండి ఉండాలి. పెద్దసమస్యే వచ్చిపడింది.

కాని ఇంకో క్షణంలో అంతకంటే పెద్దసమస్య వచ్చింది. టామ్ ముక్కుచివర దురద ప్రారంభమైంది. దాని దుంపతెగ, ఆ అవయవం ఊరికే గింజుకోవటం మొదలెట్టింది. ఏంచెయ్యాలో తెలియలేదు. తనంతట తను గోక్కోవచ్చా, గోక్కోకూడదా? బాధ ఎక్కువైపోతోంది. దీనంగా అందరివంకా చూశాడు. కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. సేవక ప్రభువులు గబగబా ముందుకొచ్చారు, ఏమిటేమిటని వినయంగా అడుగుతూ.

ఏడుపు దిగమింగుతూ టామ్ చెప్పాడు:

"నాముక్కు చాలా కూరంగా దురదపెడుతోంది. ఇటువంటి అసాధారణ పరిస్థితిలో సాంప్రదాయికంగా ఏం చెయ్యాలి? త్వరగా చెప్పండి. భరించలేకుండా వున్నాను."

ఎవరూ కుయ్ కయ్ మనలేదు. తెల్లబోయి ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూస్తూ నుంచుండిపోయారు. ఈ ఘోర, దారుణ, బీభత్స పరిస్థితి నెలా ఎదుర్కోవాలో తోచలేదు. ఓ పెద్దగోడలా ఈసమస్య అడ్డపడింది. ఈగోడని దూకేందుకు మార్గం పూర్వపు ఇంగ్లీషు చరిత్ర నంతా వెతికినా కనిపించలేదు. ఈ సమస్య మానవ మాత్రుడెవరూ తొక్కని ఎరగని ఎడారిలాంటిది; అందులో అడుగువేస్తే ఏం ప్రమాదం వాటిల్లుతుందో! కటకటా! ఇంగ్లీషు రాజవంశానికి ముక్కు గోకే ప్రభువు లేకపోయాడు గదా!

ఈలోగా కన్నీళ్లు ముత్యాల లాగా జొటజొట టామ్ చెక్కిళ్లపై కారటం ప్రారంభించాయి. చివరికి శరీరబాధ ముందు రాజమర్యాదలు, ఆచారాల గోడ తునాతునకలై కూలి పడిపోయింది. టామ్ రెండు చేతులా ముక్కు తీవ్రంగా గోకి గోకి, దాన్ని నానాహింస పెట్టి, అది పెట్టే బాధ తీర్చుకున్నాడు. దాంతో అతని బాధేకాదు, చుట్టూ ఆందోళన పడుతున్న ప్రభువుల బాధకూడా తీరిపోయింది.

భోజనం కాగానే మూతి, చేతులు కడుక్కునేందుకు, 'ఒక ప్రభువు బంగారుపళ్లెంలో పన్నీరు తీసుకొచ్చి ఇచ్చాడు. తుడుచుకునే రుమాల పట్టుకుని బర్కిలే ప్రభువు ఆ పక్కనే నుంచున్నాడు. బంగరు పళ్లెంకేసి టామ్ చాలాసేపు మెచ్చుకుంటూ చూశాడు. ఆ నీళ్లతో ఏం చెయ్యాలో తోచలేదు. చివరికి పళ్లెంఎత్తి గడగడ రెండు మూడు గుక్కలు తాగేశాడు. అదిపన్నీరని, చేతులు కడుక్కునేందుకని అతని కేం తెలుసు?

"నీళ్లంబాగులేవు ప్రభూ! వాసన బావుందిగాని, రుచి అదోమాదిరిగా వుంది," అని పళ్లెం పట్టుకున్న ప్రభువుతో అన్నాడు.

యువరాజుగారి ఈ కొత్త పిచ్చి చేష్ట అందరినీ విచార సముద్రంలో ముంచింది. దీనితర్వాత టామ్ మరో తప్పు చేశాడు. చర్చిఅధికారి భోజనానంతరం తిరిగి ప్రార్థన చెయ్యాలి. అదయిందాకా యువరాజు కుర్చీలోంచి లేవగూడదు. చర్చి అధికారి చేతులు ముకుళించి టామ్ కుర్చీ వెనక నిలబడి ప్రార్థించటానికి నోరుతెరిచాడు కాని టామ్ఇదేమీ గమనించక కుర్చీ వెనక్కి తోసి లేచాడు.

టామ్ మళ్లీ విశ్రాంతి కోరాడు. అతన్ని శయనాగారానికి తీసుకుపోయి వదిలేశారు. అక్కడ అసలు యువరాజుకు చెందిన ఉక్కు కవచం వంకెమీద కనిపించింది. దాని మీద బంగారునగిషీ చాలా వుంది. దాన్ని ఇటీవలే మహారాణి పార్ అమ్మగారు యువరాజు ఎడ్వర్డుకు బహుమతి చేశారు. టామ్ దాన్ని ఎవరిసహాయం లేకుండా తనంతట తనేతొడుక్కున్నాడు. ఇంకాఉక్కు శిరస్త్రాణం మొదలైనవికూడా ధరించాడు. ఇంతలోకే తను భోజనశాల నుండి తీసుకువచ్చిన సీమ బాదం కాయలు జ్ఞాపకం వచ్చాయి. మూడో కంటివాడు చూడకుండా తన్నే పనీ చేసుకోనివ్వక అడ్డపడే నౌకర్ల మూకలేకుండా, తనంత తను సొంతచేతుల్తో సీమ బాదం కాయలు పగలకొట్టుకు తింటం ఎంతమజాగా, హుషారుగా వుంటుంది! వెంటనే కవచం శిరస్త్రాణం విప్పి దేనిస్థానంలో దాన్ని పెట్టేశాడు.

బాదం కాయలు కొట్టుకు తిన మొదలెట్టాడు; టామ్ చేసిన పాపాలకు శిక్షగా దేవుడతన్ని యువరాజు చేసిన తర్వాత మొదటి సారిగా అతడు నిజమైన ఆనందం అనుభవించాడు.


బాదం కాయలన్నీ అయిపొయ్యాక ఓ మూల అలమారలో ఏవో పుస్తకాలు కనిపించాయి. వాటిలో ఇంగ్లీషు రాజదర్బారుకు చెందిన మర్యాదలు, ఆచారాలు తెలిపే పుస్తకం ఒకటి కనిపించింది. టామ్ అదిచూసి సంతోషంతో గంతులేశాడు. మెత్తటి పరుపు మీద కాలుమీద కాలేసుకు పండుకుని, పుస్తకం దీక్షగా చదవసాగాడు. ప్రస్తుతానికతణ్ణి అలా ఒంటరిగా చదువుకోనిద్దాం.

(ఇంకావుంది)

★

చచ్చిపోయిన మొసలి తోకాడించింది!

శ్రీ తూలికాభూషణ్



అనగా అనగా ఒక ఊరు. ఆఊళ్ళో ఒకనక్క. ఊరికి పక్కగా ఒకనది. నదికి ఆవలిగట్టున ఒక రేగుచెట్టు. నదిలో ఒక మొసలి ఉండేవి.

ఒక రోజున నక్కకి ఆకలి బాగా వేసింది. తినడానికిఏమీదొరకలేదు. నదిదగ్గరికి వచ్చింది. అవతలి గట్టున ఉన్న రేగుచెట్టు కనబడింది. దూరమైనా దోరగా ఉన్న రేగుపళ్ళు నోరూరించాయి. అసలే ఆకలి ఎక్కువగా ఉంది. నక్క రేగుచెట్టుకేసీ, నదికేసీ వెర్రిచూపులు చూడడం ప్రారంభించింది. నదిదాటడం ఎలాగా అన్నది నక్కకి సమస్య అయింది. చివరికి ఏమీతోచక ఈలపాట పాడుకోసాగింది.

ఆ నక్కేం సామాన్యమైనదా? మహా అందగాడు.

నదిలో కాపురమున్న మొసలి చాలకాలంగా నక్కని ప్రేమించి, ఒక కన్నువేసి ఉంది. ఈలపాట వినపడి నెమ్మదిగా గట్టుదగ్గరికి వచ్చింది.

వస్తూనే "నక్కబావా, ఏమిటి, హుషారుగా ఉన్నావు?" అని అడిగింది.

"హుషారులేదు మన్నూలేదు. ప్రాణం పోతోంది ఆకలి మహా వేస్తోంది," అంది నక్క.

"ఉపాయమేమిట"ని ప్రశ్నించింది మొసలి.

"ఉపాయాని కేముంది? అవతలి గట్టున రేగుపళ్ళుఉన్నాయి. దాటగలిగితే అదేచాలు" అందినక్క.

"అదెంత పని. ఇట్టేదాటించేస్తాను. అయితే, మరి నాకోరిక ఒకటి ఉంది. చెల్లిస్తావా" అని అడిగింది మొసలి.

"ఓ. సాధ్యమైతే అలాగే" అందినక్క.

"మరి, మనంపెళ్ళిచేసుకుందాం నీకు ఇష్టమేనా" అన్నది మొసలి.

"అంతకన్నానా? నేను కూడా నిన్ను చాలాకాలంగా ప్రేమించాను. కొంచెం కడుపులో చల్లపడితే మహా వైభవంగా పెళ్ళిచేసుకోవచ్చు" అందినక్క.

"నిజంగానా" అంది మొసలి.

"వెర్రిదానా, ఆకలి బాధలేకపోతే, ఇప్పుడే పెళ్ళి పురోహితుణ్ణి తీసుకు వద్దును" అందినక్క.

ఆలస్యంచేస్తే నక్క మనసు మారుతుందేమో?కంగారుగా ఉంది అనుకుంది మొసలి. వెంటనే నక్కని తన వీపుమీద ఎక్కించుకుని అవతలిగట్టుకి చేర్చింది.

క్రిందపడిన రేగుపళ్ళన్నీనక్కఏరుకుని, కడుపునిండా తింది. తిరిగి ఇవతలి గట్టుకు చేర్చింది మొసలి.

"మరి బావగారూ పురోహితుణ్ణి త్వరగా తీసుకురండి," అని బతిమాలింది.


"ఓ, ఒక్క చిటికలోరానా"

(43-వ పేజీ చూడండి)

శాస్త్రులు తెలివి

శ్రీ ఆర్. యం. చిదంబరం





ఊరిలో దొంగలు పడి కొబ్బరి చెట్లన్నీ దులిపేశారు. అయితే ఇంకా కొన్ని చెట్లు కాయలతోనే ఉన్నాయి. అదృష్టం కొలదీ పేరిశాస్త్రిలు గారి దొడ్లో ఇంకా దొంగలుపడ లేదు.

అందరూ దొంగల నుండి చెట్లనుకాపాడటానికి తగిన ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది కొబ్బరి చెట్లకు కాపలావాళ్ళ నుంచారు కొంతమంది కాయలన్నీ తీసి ఇంట్లో దాచుకుని చెట్లను బోడిగా ఉంచారు.

పేరిశాస్త్రిలుగారి భార్యకూడా ఆయన్ను కొబ్బరిచెట్లను కాపాడటానికి ఏదయినా ఏర్పాటు చేయమంది. శాస్త్రి ఇది విని నవ్వుతూ 'వెఱ్ఱిదానా! అందరివంటి తెలివి తక్కువవాడననుకున్నావా యేమిటి నన్ను. వీళ్ళందరికన్నా మంచి ఉపాయం ఆలోచించాను. మన కొబ్బరిచెట్లచుట్టూ మడిబట్ట కట్టేస్తాను. దొంగలు శూద్రులు కాబట్టి బ్రహ్మణుల మడి బట్టలు తాకరు. కొబ్బరిచెట్టు కోదండం పెట్టి పోతారు' అన్నాడు.

శాస్త్రిగారి భార్యకు ఏడవాలో నవ్వాలో అర్థమయిందిగాదు. దొంగలకు అటువంటి పట్టింపులేమీ లేవని నచ్చచెప్పి చూచింది. కాని లాభం లేకపోయింది. శాస్త్రి అన్న ప్రకారంగా దొడ్లో కొబ్బరిచెట్టు చుట్టూ మడిబట్ట కట్టేశాడు.


ఆ రాత్రే శాస్త్రిగారి దొడ్లో దొంగలుపడి కొబ్బరిచెట్లను [illegible] వేసి ఆ కొబ్బరికాయుల నా మడి బట్టలో కట్టుకుని చక్కా పోయారు.


తెల్లవార లేచి బోడిగా ఉన్న కొబ్బరిచెట్లనుచూచేసరికి శాస్త్రికి కోపం వచ్చింది. 'వె[illegible] బ్రాహ్మణుల మడిబట్ట ముట్టకూడదని తెలియదుగాబోలు. ఈసారి రానియ్యి. సరిగా బుద్ధి చెబుతా' అన్నాడు.

మరి కొంతకాలానికి సూరన్నగారింట్లో దొంగలు పడ్డారు. చాలా సామాన్లు దొంగిలించారు. ఈసారి ఊళ్ళోవాళ్ళంతా మరీ జాగ్రత్తపడ్డారు. రాత్రిళ్లు మేలుకోవటానికి నిశ్చయించుకున్నారు.

ఊరి పెద్దలు కొంతమంది శాస్త్రితో 'ఏమయ్యా! నువ్వుకూడ మాలాగే మేలుకోదలి

(42-వ పేజీ చూడండి)





దొంగ ఎవరు

శ్రీ కె. వేణుగోపాలరావు

సుబ్బయ్యసెట్టి ఆ వూళ్లోకల్లా ధనవంతుడు. అతన్ని మించిన ధనవంతుడు ఆ చుట్టుప్రక్కల చూడ ఎవ్వరూ లేరు.

సాధారణంగా సుబ్బయ్యసెట్టి యింట్లో ఎప్పుడూ విందులు, టీపార్టీలు జరుగుతూవుంటాయి. వీలునుచూసి పిలిచినవాళ్లూ, పిలవనివాళ్లూకూడ వాటికి హాజరవుతూవుండేవారు. సుబ్బయ్యసెట్టి పిసినారి కాదు. అందువల్ల అది గమనించి కూడ పట్టించుకునేవాడు కాదు.

ఆ వూళ్లోనే సోమయ్య అనే దొంగ వున్నాడు. వాడి ఆకారాన్ని బట్టి చూస్తే దొంగ అని ఎవ్వరూ అనుకోరు. అంటే డాబుసరిగావుండే రకం అన్నమాట. వాడిచూపు సుబ్బయ్యసెట్టి యింటిమీద ఎప్పుడో పడింది. రాత్రిపూట యింటికి కన్నమెయ్యాలంటే వీలు లేదు. ఎంచేతనంటే ఆయన యింటికి కాపలావాడు వున్నాడు. వాడంటే సింహస్వప్నం. అంచేత మెల్లిగా ఏ విందుకు వెళ్లినప్పుడో వీలుచూసి కొట్టేసెయ్యాలి అనుకున్నాడు. ఆ ఉద్దేశంతో వాళ్లింట్లో ఏ శుభకార్యం జరిగినా తప్పకుండా వెళ్తూవుండేవాడు. అయినా చాలాకాలంవరకూ ఏమీ లాభం లేకపోయింది.

ఒకరోజున సుబ్బయ్యసెట్టిగారింట్లో ఏదో విందు జరిగింది. దానికి మన సోమయ్యకూడ తయారయ్యాడని వేరే చెప్పనక్కర్లేదు. మనవాడు పోయినదగ్గర్నుంచీ యిల్లంతా పరిశీలించటం మొదలుపెట్టాడు. ఆ సమయానికి ఎవరో రైతు ఒక డబ్బుసంచిని సుబ్బయ్యసెట్టిగారికి యిచ్చి వెళ్లిపోయాడు. ఇదంతా సోమయ్య చూస్తూనే వున్నాడు. పాపం సెట్టిగారు మంచి హడావుడిలో వున్నారు. అప్పుడు యినప్పెట్టెలో పెట్టటానికి వ్యవధి లేదు. అందువల్ల ఎవరూచూడటం లేదు కదా అనే ధైర్యంతో అక్కడున్న అల్మారలో ఒకమూల దాచి లోపలకు వెళ్లిపోయాడు. ఇదంతా చూస్తున్న సోమయ్య యిన్నాళ్లకు సమయం చిక్కిందిగదా అని సంతోషించాడు

నిశ్శబ్దంగా లోపలికి పోయి ఆ డబ్బుసంచిని కాస్తా సంగ్రహించేశాడు. ఇక పారిపోవటం ఒక్కటే తరువాయి. ఆ గదిలోంచే ఒకకిటికీ వుంది. అందులోంచి బయటికి దూకేస్తే సుబ్బయ్యసెట్టిగారి తోటలోకి ప్రవేశిస్తాడన్న మాట. తోటలోకి పోయింతర్వాత బయటికి పోవటం ఒక పెద్ద సమస్య కాదు.

ఇంతలో సోమయ్య కర్మంకాలి సుబ్బయ్యసెట్టిగారు ఏదో పనిమీద ఆ గదిలోకి వచ్చారు. వెంటనే జరుగుతున్నదంతా గ్రహించి దొంగ దొంగ అని గట్టిగా అరిచేశారు. ఆసమయానికి అందరూ విందారగిస్తూ ఆనందిస్తున్నారు. సెట్టిగారి కేకలు విని తింటున్న పదార్థాలన్నీ అలాగే వదిలేసి హడావిడిగాపరిగెత్తుకొచ్చారు. సుబ్బయ్యసెట్టిగారి కేకలు వినేటప్పటికే సోమయ్య కంగారుపడిపోయాడు. వెంటనే మరేమీ ఆలోచించకుండా కిటికీనుంచి తోటలోకిదూకి పరిగెత్త సాగాడు. అప్పటికే విందు కొచ్చిన వాళ్లందరూ సుబ్బయ్యసెట్టిగారి

దగ్గరకు వచ్చేశారు. సెట్టిగారు జరిగినదంతా వారితో చెప్పారు. వెంటనే అందరూ తోటలోకి దూకేసి అల్లంత దూరంలో వున్న సోమయ్యా వెంటపడ్డారు.

సోమయ్య పరిగెత్తి పరిగెత్తి గేటుదాక వచ్చేశాడు. బైటకు పారిపోయే అవకాశం వుంది కాని చాల గొడవలవుతాయి. అంతలో గేటుదగ్గర వళ్లంతా ముసుగువేసుకుని కూర్చున్న బైరాగి కనిపించాడు. వెంటనే సోమయ్యకు మెరుపులాగా ఒక ఆలోచన తోచింది. తక్షణమే ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఆ డబ్బు సంచీని బైరాగిఒళ్లో పడేసి చెట్లగుండా మాయమయి గుంపులో కలిసిపోయాడు.

అంతలో గుంపంతా బైరాగి వద్దకు వచ్చేసింది. అందరికీ బైరాగి ఒడిలోవున్న డబ్బుసంచి స్పష్టంగా కనిపిస్తూంది. అందరూ వాడే దొంగ అని నిశ్చయించుకున్నారు. అయినా బైరాగిమాత్రం యిదంతా అర్థంకానివాడిలాగ చూస్తున్నాడు. సోమయ్య వూరుకున్నవాడు వూరుకోవచ్చునా అబ్బే గొప్పగా ముందుకు వచ్చి చూస్తారేం? పట్టుకుని తన్నండి వెధవని. దొంగ మొహమూ వాడూ ఎలావున్నాడో. వాడు కిటికీనుంచి దూకి పారిపోవటం ప్రత్యక్షంగా చూశాను అన్నాడు.

అందరూ దొంగ వాడే నంటే వాడే అన్నారు. బైరాగిని పట్టుకుని తన్నటానికి సిద్ధమయ్యారు. బైరాగి మాత్రం చిరునవ్వు మొహంతో అయ్యా నేనో చిన్నమనవి చేసుకుంటాను. 'ముందు మీరు నాకాళ్ల మీద నున్న గుడ్డను తొలగించి ఆ తర్వాత మీయిష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు అన్నాడు శాంతంగా.

అలా బైరాగి ఎందుకన్నాడో ఎవరికీ అర్థం కాలేదు. అయినా చూద్దామని ఒకడు ముందుకు వచ్చి కాళ్లమీది వస్త్రాన్ని కొంచం తొలగించాడు. వెంటనే అందరూ నిర్ఘాంతపోయ్యారు. అసలు సంగతి ఏమిటంటే అసలా బైరాగికి కాళ్లు లేవు. కాళ్లు లేందే ఎలా పరిగెత్తగలడు? అందుచేత బైరాగి దొంగకాదన్న మాట. మరయితే దొంగ ఎవరు? మొదట్లో సోమయ్య తను బైరాగిని పరిగెత్తుతుంటే చూశానని అబద్ధమాడాడు కదూ? అందువల్ల అతన్నే దొంగ అని నిర్ణయించి పట్టుకుని పోలీసులకు అప్పచెప్పారు. అసలు సోమయ్య మాటాడకుండా వూరుకుంటే పోయేది. తను కళ్లారా చూశానని డాబులు కొట్టటంవల్ల తగిన ప్రతిఫలం అనుభవించవలసివచ్చింది. ★

శాస్త్రుల తెలివి

(40-వ పేజీ తరువాయి)

చావా?' అనడిగారు. 'ఛీ...ఛీ... నే నలాగ చేయను. ఉపాయాలు తెలియనివాళ్ళంతా ఇలాగే నిద్రను, ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటారు. నే నంత వెర్రివాణ్ణి కాను. మా యింటి గిన్నెలన్నీ అంటు చేసేస్తాను. వాళ్లు అంటు గిన్నెల నంటరుగా. ఒకవేళ అంటి చేతులు కడుక్కోవాలని చూస్తారేమో. వాళ్ళకు ఒక్కచుక్క నీళ్లుకూడా దొరకకుండా చేస్తాను. కావాలంటే చూడండి నా తెలివి' అన్నాడు గర్వంగా నవ్వుతూ. ఊరివాళ్ళంతా అతని వెంగలితనానికి నవ్వి దొంగల కలాంటి పట్టింపు లేవీ లేవన్నారు. కాని శాస్త్రులు ససేమిరా' విన్నాడు కాదు. అతనన్నప్రకారంగా గిన్నెలన్నీ అంటుచేసి దొంగలకు ఒక్కచుక్క నీళ్లయినా దొరకకుండా బిందెలన్నీ ఖాళీచేశాడు. తలుపులు తెరిచిపెట్టి హాయిగా నిద్రపోయాడు.

ఆనాడు శాస్త్రి ఇంటి తలుపులు తెరువబడియుండటంవలన దొంగలు హాయిగా సులువుగా ఇంటినంతా దోచుకున్నారు.

తెల్లవార లేచి చూచేసరికి ఇల్లంతా ఖాళీ. శాస్త్రులు భార్య లబోదిబోమని మొత్తుకుని శాస్త్రి తెలివితక్కువకు అతన్ని తిట్టింది. శాస్త్రి ఏం చేస్తాడు పాపం! దొంగలకు ఆచారాలూ అవీ లేవని వాళ్ళను తిట్టాడు. ఊరివారంతా శాస్త్రి తెలివికి నవ్వుకున్నారు. ★

చచ్చిపోయినమొసలి తోకాడించింది

(39-వ పేజీ తరువాయి)

అంటూ నక్క మళ్ళీ ఈలపాట పాడుకుంటూ వెళ్ళిపోయింది.

పాపం! కన్నె మొసలి ఆ సాయంత్రము, రాత్రి, మర్నాడు, ఆ మర్నాడు కూడా నక్క కోసం ఎదురు చూసింది. ఏమిటి ప్రయోజనం? నక్క జాడ అయినా లేదు.

మొసలి, అందులోనూ ప్రేమించి భంగపడిన కన్య. కక్ష పుట్టింది. ఎలాగయినా నక్కని పట్టుకుని, పకోడీలా నమిలి తినేయాలని ప్రతిజ్ఞ పట్టింది.

ఈ విధంగా కొంతకాలం గడిచింది. నక్కకు మొసలి ఉదంతం జ్ఞాపకమే లేదు.

వరదలు వచ్చాయి. వరదలలో నది చూడడానికి మహాఅందంగా, భయంపుట్టించేలా, విస్మయకరంగా ఉంటుంది. నక్కలన్నీ వెళ్ళి చూచి వచ్చాయి. నక్క కూడా చూడడానికి వెళ్ళింది.

ఆరోజు ఎక్కువగా భోజనం చేసిఉందేమో 'దాహం వేసింది. గట్టుకి దగ్గరగా ఒక పెద్దమర్రిచెట్టు. మర్రిచెట్టు ఊడలు, వేళ్ళు నదిలోకి వ్రేలాడుతూ ఉన్నాయి. గట్టు చివరగాపోయి, ముందు కాళ్ళు నీటిలోకి పెట్టి, జాగ్రత్తగా ముందుకు వంగి, మూతి వంచింది. అంతే, లటుక్కున కాలు పట్టింది మొసలి.

నదిగట్టు దగ్గరికి నక్కరావడం, అటూ యిటూ తిరగడం, చివరికి మంచినీళ్ళు త్రాగడానికి చెట్టు దగ్గరికి రావడం చూస్తూనే ఉంది మొసలి. మొసలికివేగం ఎక్కువ. సరిగా నక్క ఉన్న చోటికివచ్చి, ముందు కాలు పట్టుకుంది.

నక్క జిత్తులమారి నిశితంగా ఆలోచించింది. కాలు పట్టుకున్నది మొసలి అనిగ్రహించింది.

వెనకటి ఉందయం ఒక్కసారి తటిల్లతలా స్మృతిపథంలో మెరిసింది. ఆ వెంటనే "అయ్యో, వరదలో కొట్టుకు పోతున్నాను. కన్నె మొసలీ,నా కాలనుకుని ఆప్రక్కనే ఉన్న చెట్టువేరు పట్టుకున్నావు. కాలుపట్టుకో, లేక పోతే చచ్చిపోతాను" అని ఒక్క కేక వేసింది.

అయ్యో;ఇంతా చేసి వేరా పట్టుకున్నది అని మొసలి విచారపడింది. అలాగే నక్కకాలు విడిచిపెట్టి ఆ పక్కనేఉన్న చెట్టువేరు పట్టుకుని గట్టిగా నీటిలోకి లాగడం ప్రారంభించింది.

మొసలి తన కాలు విడిచిపెట్టగానే, ఆ కాలు గట్టుమీదికి లాగుకుని, బ్రతుకుజీవుడా అని నక్క పారిపోయింది.

మొసలికి కొంచెం సేపటిలోనే తన తప్పు తెలుసుకుంది. ఇక కోపం పట్టలేకపోయింది. ఆ వెంటనే గట్టుమీదికివచ్చి, చిన్నచిన్న కాళ్ళతో నెమ్మదిగానడుస్తూ నక్క కలుగు దగ్గరికి చేరుకుని, దానిలో రహస్యంగా పొంచుని ఉంది.

సాయం కాలమయింది తిరిగి తిరిగి నక్కఇంటికి చేరుకుంది. ఆ రోజు ఉదయం జరిగిన సంఘటన కారణంగా మహాజాగ్రత్తగా ఉంది. ఇంటికివస్తూనే ఇంటిముందు ఇసుకలో మొసలి కాలిగుర్తులు చూచించి ఓహో, ఇదాకథ అనుకుంది. నెమ్మదిగా గుమ్మం దగ్గరికి వెళ్ళింది. లోపలికి తొంగిచూడగా లోపల ఒకమూల కదలకుండా, మెదలకుండా ఉన్న మొసలి కనపడింది.

"అయ్యో, పాపం, మొసలి చచ్చిపోయినట్లు ఉందే. కదలిక అయినా లేదే, ప్రేమించినందుకు పెళ్ళయినా చేసుకుని ఉండవలసింది. ఇప్పుడు ఇంకేం లాభం. ఇంక దగ్గరికి వెళ్ళి కదిపి చూడాలి" అంది బయటికి బిగ్గరగా. అలాగే దగ్గరికి వస్తుంది, వచ్చినప్పుడు దాని పనిపట్టవచ్చునని మొసలి చచ్చినట్లుగా పడిఉంది. తన పాచిక పారుతుందనే విశ్వాసం కలిగింది. నక్క ఎత్తు అదికాదు. ఆ వెంటనే "అరే మరిచచ్చిపోయిన జంతువులు తోక ఆడిస్తాయికదా? నా ప్రేయసి ఎందు కాడించడం లేదో" అంది మళ్ళీ బిగ్గరగా.

అదివిని, చచ్చిపోయిన జంతువులు నిజంగానే తోక లాడిస్తాయేమో, ఆడించకపోతే నక్క నమ్మదని తోక ఆడించడం ప్రారంభించింది.

"ఓహో, చచ్చిపోయిన మొసళ్లు తోకలు ఆడిస్తాయి కదూ" అనుకుంటూ, చిరు నవ్వు నవ్వుతూ మరొక ఊరు వెళ్ళి పోయింది నక్క.

చేసేదేమీ లేక మొసలికూడా తిరిగి నదికి వెళ్ళిపోయింది.

★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

34

ఫ్రాంజ్ పట్టించిన దారిలో శిథిలాలు కనపడలేదు. చూడదలచిన బ్రహ్మాండమైన శిథిల భవనం హఠాత్తుగా కళ్లబడి ఆశ్చర్యం కలగాలని అతని ఊహ. అంతే కాదు. ఈ దారినైతే ప్రయాణం చాలసేపు పట్టుతుంది. విన్న కథనిగురించి యోచించడానికి ఫ్రాంజ్ కి కావలసినంత వ్యవధి లభించింది. ఈ కథలో మాంట్ క్రిస్టో ద్వీపంలో తన కాతిథ్యం ఇచ్చిన వింత వ్యక్తికూడా ఉన్నాడు. బండిలో ఒకమూల చేతులు కట్టుకుని కూర్చుని కథకి సంబంధించన అనేక విషయాలు యోచించ నారంభించాడు. కథలోని అంశాలనుసరించి అతనికి అనేక సందేహాలు కలిగాయి. కాని ఎంత యోచించినా వాటికి సమాధానం దొరక లేదు. తన వింత మిత్రుడు సింద్ బాద్ సంగతి పదేపదే ఆలోచించడం మొదలు పెట్టాడు. అతనికీ, ఈదొంగలకీ సంబంధంఏమిటి? నావికులకీ, దొంగలకీ సంబంధం ఏమిటి? వాంపా ఓడల్లో తిరుగుతాడనీ, మాంట్ క్రిస్టో ద్వీపంలో దాక్కుంటాడనీ హోటల్ యజమాని చెప్పాడు. ఆ ద్వీపంలో కార్సికన్ దొంగ లిద్దరి సంగతి ఫ్రాంజ్ కి జ్ఞప్తికి వచ్చింది. వాళ్లని దిగబెట్టడంకోసం సింద్ బాద్ బోటు వెఖియా రేవుకి వెళ్లింది. ఇవన్నీ చూస్తే దానకర్ణు డనిపించుకొంగలిగే ఆ వ్యక్తికి అనేకదేశాలలో పలుకుబడి ఉందన్నమాట.

ఫ్రాంజ్ ఈ ఆలోచనలలోనుంచి హఠాత్తుగా మేలుకున్నాడు. కలోసియమ్ కళ్లబడగానే ఆలోచలన్నీ పటాపంచలైనాయి. బ్రహ్మాండమైన ప్రాకారాల మధ్య కానలలోనుంచి వెన్నెల పాయలై ప్రవహిస్తున్నట్టుంది. దూరంనుంచి చూసేవారికి కానులలో వెన్నెల మృతుల నిర్జీవ నేత్రాలవలె కనపడుతున్నాయి. బండి తలుపులు తెరుచుకోగానే యువకు లిద్దరూ బయటికి దూకారు. అకస్మాత్తుగా భూమిలోనుంచి లేచివచ్చినట్లు తలుపు వద్ద ఒక వ్యక్తి నిలబడిఉండడం చూసి ఇద్దరూ ఉలికిపడ్డారు.

రోమ్‌నగరంలో శిథిలాలను చూపుతూ చరిత్రాంశాలు తెలియచెప్పేవారి కెన్నడూ లోటులేదు. అసలు వాళ్లని వొదిలించుకోడం యాత్రీకులికి దుర్ఘటం. అడుగడుక్కి ఒకొక్కడు కాసుకుని కూచుంటారు. వీళ్లబాధ వొదిలించుకోడానికి యువకులు ప్రయత్నించలేదు. వాళ్లనితప్ప ఇతరులెవ్వరినీ కాగడాలతో లోపలికి ప్రవేశించనివ్వరు. అందువల్ల వాళ్ల నెవరిగో వెంట తీసుకువెళ్లక తప్పదు. ఈ శిథిలా లెటువంటివో చూసి గ్రహించవలసిందే కాని మాటల్లో వర్ణించి చెప్పడం కష్టం. ముఖ్యంగా వెన్నెలలో అవెలా కనపడతాయో తెలియచెప్పడం అసాధ్యం. ఈ బ్రహ్మాండమైన శిథిలాలు వెన్నెలలో రెండింతలు పెద్దవైనట్లు కనపడతాయి. ఫ్రాంజ్ ఈ అద్భుతదృశ్యాలు చూసి పరవశుడైపోయాడు. ఆల్బర్ట్ ని మార్గదర్శకులవద్ద విడిచిపెట్టి ఫ్రాంజ్ ఒక్కడూ ఒక దారి ననుసరించాడు. కొంతదూరం వెళ్లాక అతనికి శిథిలమై సగం మిగిలిఉన్న సోపానాలు కనపడ్డాయి. అయిదారు మెట్లెక్కి అక్కడ కూర్చుని ఏకాంతంగా పరిసరాలను పరిశీలించ నారంభించాడు. పక్కనే పెద్ద ఆర్చి ఒకటుంది. ఆర్చిగుండా శిథిలాలు వెన్నెలలో వింతగా కనపడుతున్నాయి.

నీడపట్టున దాగి ఫ్రాంజ్ ప్రశాంతంగా యోచిస్తున్నాడు. మార్గదర్శకుల ననుసరించి వెడుతున్న ఆల్బర్ట్ అతని కింకా కనపడుతూనే ఉన్నాడు. దూరాన రెండు కాగడాల వెలుగులో తిరుగుతున్న ఆ ముగ్గురూ కొరివిదయ్యాలవలె ఉన్నా రనుకున్నాడు. నీడల్ని పరికిస్తూ తన ఉనికిని మరిచిపోయిన ఫ్రాంజ్ కి హఠాత్తుగా వింత సవ్వడి వినవచ్చింది. అతను కూర్చున్న చోటికి కొద్దిదూరంలోనే అటువంటి మెట్లే ఉన్నాయి. ఆ మెట్లపైన చిన్నరాళ్లు రెండు దొర్లుతున్నట్లు గలగల శబ్దం అస్పష్టంగా వినపడింది. ఆధారం సడలి రాళ్లు దొర్లిపడిపోవడం అక్కడొక వింతకాదు. కాని ఆ రాళ్లు ఇప్పుడు అడుగుల ఒత్తిడివల్ల స్థానభ్రష్టమైనట్లు అతనికి తోచింది. అడుగుల సవ్వడి పైకి రానివ్వకుండా ఎవరో జాగ్రత్తగా మెట్లు దిగుతున్నట్లు అతని కనిపించింది. ఆ అడుగులు అతనివైపుకే వస్తున్నట్లున్నాయి. ఇంతలోనే అతని ఊహ భ్రమ కాదని తెలిసింది. వెన్నెల పడుతున్న కిందిమెట్లు పైన ఒకవ్యక్తి కనపడ్డాడు.

మార్గదర్శకుల బడబడలు భరించలేక ఎవరో తనవలెనే ఏకాంతం కోరి అక్కడికి వచ్చారని ఫ్రాంజ్ మొదట అనుకున్నాడు. అందువల్ల అకస్మాత్తుగా అక్కడొక వ్యక్తి ప్రత్యక్షం కావడంలో ఆశ్చర్యపడవలసింది లేదు. కాని ఆ వ్యక్తి ముందు కడుగు వేస్తూ నలువైపులా జాగ్రత్తగా పరిశీలించి, ఆగి, అప్రమత్తతతో ఆలకించడం చూసేసరికి ఫ్రాంజ్ కి అనుమానం కలిగింది. అతనెవరికోసమో నిరీక్షిస్తున్నట్లు ఊహించాడు. వెంటనే, తెలియకుండా ఫ్రాంజ్ మెట్లవద్ద ఒక స్తంభంచాటుకి జారి దాగాడు. అక్కడికి పదడుగులదూరంలో మిద్దెలో రంధ్రంలోనుంచి వెన్నెల తెల్లని పట్టువల వేసినట్లు వేలాడుతోంది. ఆ వ్యక్తి వెలుగుకు కొద్దిగా దాపుకు వెళ్లి నిలబడినందువల్ల ముఖం గుర్తుపట్టడానికి వీలు లేకపోతోంది. దుస్తులు కొంత స్పష్టంగా తెలుస్తున్నాయి. ముఖం పైన ఆచ్ఛాదనం ఒకటుంది. కాళ్లపైన వెన్నెల పడుతున్నందువల్ల నల్లని పట్టుపంట్లాం స్పష్టంగా కనపడుతోంది.

ఫ్రాంజ్ ఒక్కవిషయంమాత్రం నిర్ధారణ చేసుకున్నాడు. ఆ వ్యక్తి సామాన్యుడు కాడు. భాగ్యవంతుడు. కొంతసేపటికి ఆ వ్యక్తి తొందరపడుతున్నట్లు కనపడింది. మిద్దెపైనుంచి సన్నని సవ్వడి వినవచ్చింది. వెంటనే వెన్నెలజాలులో నీడ పడింది, కింద ఆత్రుతతో చూస్తున్న ఒక వ్యక్తి మిద్దెపైనా కనపడ్డాడు. దూరాన నిలబడిన మొదటి వ్యక్తిని రెండోవ్యక్తి చూసి, చెట్లకొమ్మల సహాయంతో ఊగి కిందికి దిగాడు. రెండో వ్యక్తి మొదటి వ్యక్తితో రోమక్ మాండలికభాషలో ఇలా అన్నాడు: "ప్రభువుగారికి

అనువాదం: సీతారామ్

నమస్కారం. ఆలస్యమైనందుకు క్షమించండి. కాని అట్టే ఆలస్యం కాలేదు. ఇప్పుడే పదిగంటలు కొట్టిందండి."

"ఆలస్యం మాటకేంలే" అన్నాడు మొదటివ్యక్తి టస్కనీ మాండలికభాషలో. "నేను సమయానికి ముందే వచ్చాను. నేనిక్కడ నీకోసం వేచిఉన్నానంటే, అది నీవల్ల తప్పుకాదు."

"అది నిజమేనండి. నేను తిన్నగా సెంట్ ఏంజలో భవనం నించి వస్తున్నానండి. బెప్పోతో మాట్లాడి రావడానికి చాలా ఇబ్బందయి పోయిందండి"

"బెప్పో ఎవరు ?"

"అతనా ? అతనికీ జైల్లో ఉద్యోగం. పోప్‌భవనంలో ఏం జరుగుతూఉంటుందో నాకు సమాచారం చెప్పడానికిగాను అతనికి, సాలీనా ధనం ఇస్తూఉంటాను. ఎప్పుడేం జరుగుతుందో తెలియదుకదా. ఎప్పుడో ఒకప్పుడు పెపినోమాదిరిగానే నన్నూ ఉచ్చులో పట్టేస్తారు. అప్పుడు ఉచ్చుతాళ్లు కొరికెయ్యడానికి ఎలకలు కావలసివస్తాయి.

"సరే. ఇప్పుడు నువ్వేం కనిపెట్టావ్ ?"

"ఎల్లుండి రెండుగంటలకి ఇద్దర్ని ఉరితీస్తారండి. రోమ్ నగరంలో ఉత్సవాలకు ముందెప్పుడూ ఇదొక పండుగ జరుపుతూ ఉంటారు. ఇద్దరిలో ఒకడు తనను రక్షించి పెంచి పెద్దచేసిన ఫాదరీని హత్యచేసిన దురంతకుడు. వాణ్ని నెత్తురోడ్చి చంపుతారు. రెండోవాడు పెపినో. పాపం అతన్ని తల తెగవేస్తారుట."

"అసలు విషయమేమిటంటే పోప్ పరిపాలిత ప్రాంతంలోనే కాకుండా పక్క అనేక రాజ్యాల్లో నిన్నుగురించి విపరీతమైన భయం పుట్టించావు. అందువల్ల దొరికినవాడికి దారుణమైన శిక్ష విధించి నువ్చుచూపిస్తున్నారన్నమాట."

"కాని పెపినో నా గుంపులోకూడా లేడే! వాడుచేసిన పాపమల్లా ఏమిటంటే, మాకు కావలసిన ఆహారాదివస్తువు లిచ్చాడు. అంతే."

"అంటే క్రియకి మీ దొంగలకి వాణ్ని తోడు చేశావన్న మాట. కాని నువ్వు శిక్షలో తేడా గమనించాలి. నిన్ను పట్టుకున్నట్లయితే ఒక్కదెబ్బతో నిన్ను బుర్ర బద్దలు కొట్టి చంపుతారు. వాడికితల తెగనెయ్యడంమటుకే శిక్ష విధించారు. ఉత్సవాలకి వచ్చేవాళ్లకి ఇదొక వినోదం సమకూర్చాలని అధికారుల తలపు."

"అయితే నేనేం తలపెట్టానో వాళ్లకి తెలియదులెండి. పాపం అతన్ని విడిచిపెట్టించడానికి ఏంచెయ్యవలసివచ్చినా సరే వెనుదియ్యకూడదని నిశ్చయించుకున్నాను. నాకు సహాయంచేసినందువల్లనే అతనీ ఉచ్చులోచిక్కుకున్నాడు."

"ఇప్పుడేం చెయ్య తలుచుకున్నావ్ ?"

"ఉరితీసేచోట ఇరవైమందిని ఏర్పాటుచేశాను. వాళ్లా చోటంతా చుట్టుముట్టి, పెపినోని వేదికమీదికి తీసుకురాగానే, నేను చేసంజ్ఞచెయ్యడం చూసి మీద పడతారు. పోలీసుల్ని తరిమేసి పెపినోని ఎత్తుకుపోతారు."

"అది ప్రమాదమైనది. ఒనగూడుతుందో లేదో నిశ్చయం లేదు. ఇంతకంటె నా ఉపాయం మేలని నా ఉద్దేశం."

"తమ ఉపాయం ఏమిటి?"

"రెండువేల స్పానిష్‌డాలర్లు గుప్పుతాను. సంవత్సరంపాటు శిక్ష వాయిదా వెయ్యడానికి గడువు సాధిస్తాను. ఈలోగా ఇంకో వెయ్యిస్పానిష్‌డాలర్లు పడేస్తే జైల్లోనించి వాణ్ని తప్పించవచ్చును."

"తప్పకుండా ఇలా సాధించగలరని తమకి నమ్మకమేనా ?"

మొదటి వ్యక్తి హఠాత్తుగా ఫ్రెంచిభాషలో అన్నాడు. "బాగా అడిగావ్! నేనొక్కడ్నీ బంగారంవల్ల సాధించే దాన్ని నీగుంపు గుంపుఅంతా ఏకమై కత్తులూ తుపాకులూ తెచ్చుకుని కూడా సాధించలేరు. నువ్వింక భయపడక ఈవిషయం నా చేతుల్లో విడిచిపెట్టు."

"మావాళ్లు అక్కడ సిద్ధంగా ఉన్నా పరవాలేదండి. మీ ఉపాయం నెరవేరకపోతే ఆఖరిక్షణంలో నా ఉపాయం ప్రయోగిస్తాను. ఉరితీసేది ఎల్లుండి అన్నమాట మరిచిపోకండి. ఒక్కరోజే గడువుంది."

"అయితే మాత్రమేమి ? రోజుకి ఇరవైనాలుగు గంటలున్నాయి. గంటకి అరవైనిమిషాలు, నిమిషానికి అరవై సెకండ్లు ఉన్నాయి. ఎనభైఆరువేల నాలుగువందల సెకండ్లలో ఎన్ని జరగడానికి అవకాశం లేదు ?"

"తమ యత్నం ఫలించిందో లేదో నాకెలా తెలుస్తుంది ?"

"అదేమంత కష్టంకాదు. నేను రాస్పోలీహోటల్లో కింది మూడు కిటికీలూ అద్దెకి తీసుకున్నాను. పెపినోని రక్షించగలిగినట్లయితే, చివరిరెండు కిటికీలకీ పసుపుపచ్చని తెరలు, మధ్య కిటికీకి తెల్లని తెర వేలాడతీయిస్తాను. తెల్లని తెరమధ్య ఎర్రని సిలువ చిహ్నం ఉంటుంది."

"శిక్ష తప్పించిన ఉత్తరువుని అధికారులకి ఎవరివల్ల పంపిస్తారు ?"

"మీవాళ్లలో ఒకడికి ఫాదరీవేషం వేసి పంపు. ఆజ్ఞాపత్రం వాడిచేతి కిస్తాను. వాడందిస్తాడు. ఈలోగా మన ఉపాయాన్ని గురించి పెపినోకి తెలియపరుచు. లేకపోతే భయంవల్ల ఈలోగానే వాడు చచ్చిపోగలడు. మన ప్రయత్నం ధనం వృథాకాగలవు."

"ప్రభువుగారికి నాదొక్కటే మనవి. పెపినోని విడుదల చేయించండి. ఆపైన మీరు ఏదిచెయ్యమంటే అది చెయ్యడానికి విధేయుడనై ఉంటాను. నావాళ్లుకూడా మీకు సేవ చేస్తారు."

"మాట ఇచ్చేటప్పుడు జాగ్రత్తగాఉండాలి. ఎందువల్లనంటే త్వరలోనే నీ మాట నిలబెట్టుకోవలసిన తరుణం రావచ్చుసుమా !"

"నేను మాట రవంతైనా తప్పిపోయేవాడిని కానని తమకే ముందు తెలిసివస్తుంది. ఈ విశాలప్రపంచంలో మీరు ఏ మూల నుండి కబురు పంపినాసరే మీదగ్గరకు వచ్చి వాలగలను. మీరు చెప్పడం తడువు చేసి తీరతాను. అక్షరాలా..."

"ఆగాడు. నాకేదో చప్పుడు వినపడింది. మనమిద్దరం కలిసి ఉండగా ఎవ్వరూ చూడగూడదు. మార్గదర్శకులంటూ తిరిగే వాళ్లంతా గూఢచారులు. వాళ్లు నిన్ను గుర్తుపట్టగలరు. నీ స్నేహం నేనెంత కోరుకోతగినదైనా కావచ్చుకాని మన స్నేహం సంగతి పైకి పొక్కినట్లయితే నా పరువు పోతుంది."

"సరే అయితే. మీరు రక్షించలేకపోతే ఏం చేస్తారు?"

"మూడు కిటికీలకీ పసుపుపచ్చని తెరలు వేలాడదీయిస్తాను."

"అప్పుడేం చెయ్యమంటారు?"

"అప్పుడు నీ కత్తులు, తుపాకులు ప్రయోగించు. నీ ప్రతిజ్ఞ నేను స్వయంగా చూస్తాను."

"సరే. సెలవిప్పించండి."

ఇలా చెప్తూ రెండోవ్యక్తి మెట్లచాటున అంతర్ధానమైనాడు. మొదటివ్యక్తి ఆచ్ఛాదనాన్ని మరింత ముఖంమీదికి లాక్కుని ఫ్రాంజ్ నిలబడినవైపుకు వచ్చి పక్కగా మెట్లు దిగి వెళ్లిపోయాడు. మరుక్షణంలోనే తనను పేరుపెట్టి ఆల్బర్ట్ పిలవడం ఫ్రాంజ్ విన్నాడు. ఆ పిలుపు ఆ శిథిలాల ఎత్తుగోడలమధ్య ప్రతిధ్వనించింది. కాని ఫ్రాంజ్ అప్పుడే పలకలేదు. వ్యక్తులిద్దరూ దూరమైనారని నమ్మకం తోచినప్పుడు కాని పలకలేదు. ★

విశ్వామిత్ర సృష్టి

(31-వ పేజీ తరువాయి)

(అంతా నవ్వులు)

శేఖర్: ప్రొలాక్టిన్ సహాయంతో ఆ క్షీరయంత్రాలు గ్లూకోజ్ నుంచి లాక్టోజ్‌నూ, ఎమినోఆసిడ్‌లనుంచి ప్రోటీన్లనూ, కొవ్వునూ లవణాలనూ తయారుచేస్తవి. అంటే గడ్డిలోనుంచి పాలు తయారవుతవన్నమాట.

ఇంక మీరు ప్రశ్నలేమయినా ఉంటే అడగండి.

గాడ్గిల్: మరి మీ యంత్రం ఏకబిగిన పని చేస్తుందా!

శేఖర్: అప్పుడప్పుడు విశ్రాంతి ఇవ్వాలి. ఒకే యంత్రాన్ని తెరిపిలేకుండా పనిచేయించేబదులు, నాలుగైదుయంత్రాలని ఒక దాని తరవాత ఒకటి నడిపిస్తే లాభకరమని పరిశోధనవల్ల తేలినది.

ముస్తీ: యంత్రం పనిచేసేటప్పుడు పాలతోపాటు లభించే అన్యోత్పత్తులు దేనికయినా పనికి వస్తవా?

శేఖర్: అన్యోత్పత్తులు చాలా ఉపయోగించేవే. చివరకు మిగిలిపోయే సెల్యులోజ్, గ్లిసరిన్ మొదలైనవాటిని విలువైన ఎరువులుగా వాడవచ్చును. సెల్యులోజ్‌పదార్థాన్ని సన్ క్యూర్ చేస్తే - అంటే ఎండబెడితే - ఫస్ట్‌క్లాసయిన వంటచెరుకు తయారవుతుంది.

గాడ్గిల్: మరి ఈ యంత్రం పనిచేయటానికి ఏం వాడాలి?

శేఖర్. నాయంత్రంలో ఉన్న అతిగొప్ప సావకాశం ఇదే. గడ్డిని విభజించేటప్పుడు జరిగే రసాయనప్రక్రియల్లోచాలా ఉష్ణశక్తి ఉద్భవిస్తుంది దానినే యంత్రం ఉపయోగిస్తుంది. అందువల్ల ఒక్కసారి యంత్రాన్ని స్టార్టు చేస్తే వేరే ఇబ్బంది లేకుండా తనకు తానే పనిచేసుకుని పోతుంది. అందు వల్ల ఈ పరిశ్రమకు ఫ్యూయల్ సమస్య అంటూ ఉండదు.

మహావీర్: యంత్రం దెబ్బ తింటే, దానికి స్క్రాప్ విలువ ఏమయినా ఉంటుందా?

శేఖర్: యంత్రంకూడా మాంసకృత్తులతో సంబంధించిన పదార్థాలతో తయారవుతుంది. కనుక దానిని జలప్రక్రియ, తైలప్రక్రియలు చేసి ఆహారంగా వాడవచ్చును. యంత్రం వాతావరణంవల్ల దెబ్బ తినకుండా అమర్చే లైనింగును ఎన్నో విధాల వాడవచ్చును.

అంబేద్కర్: యంత్రోత్పత్తికి కావలసిన సామగ్రి మనదేశంలోనే లభిస్తుందా?

శేఖర్: విదేశాలకు మనమే ఎగుమతి చేయొచ్చు.

రాజా: (వికటంగా) మరి మీయంత్రం పిల్లలనుకూడా పెడుతుందా?

శేఖర్: ఆహా! కనీసం రెండేళ్లకు ఒక పిల్లను పెడుతుంది.

(రాజాజీముఖాన కత్తి పోటు వేసినా నెత్తురు కనిపించనట్లు తయారవుతుంది. అంతా ఆశ్చర్యంతో నోరుతెరిచి చూస్తూ ఉంటారు)

రాజా: ! (బొంగురు గొంతుతో) మీ యంత్రం పేరేమిటి?

శేఖర్: (గంభీరంగా) "గమిడి గేద."

(ఆఁ! ఆఁ! అని కేకలు. ఉప్పెనగా నవ్వులు)

ముస్తీ: ప్రొఫెసర్ భాయ్! మీ యంత్రాన్ని మహర్షి విశ్వరథుడు-అంటే విశ్వామిత్రుడు - ఇంతకుముందే సృష్టించినట్లున్నాడే?

నేను: ముస్తీ భాయ్! ఈయన ఎవరనుకుంటున్నారు? విశ్వామిత్రుడి సంతతివాడయిన ఆంధ్రుడు.

కొన్నాళ్లకు ఆలిండియారేడియో ఈ విధంగా ప్రకటించింది:

"కేంద్రప్రభుత్వ ఆహార-వ్యవసాయ శాఖ అధ్వర్యాన దేశమంతటా విశ్వరథోత్సవం జరిగినది. అనేకచోట్ల మహిషామండలులు నెలకొల్పబడినవి. ప్రభుత్వపు ముద్రలో మహిషీవిగ్రహానికి స్థానం ఇచ్చే విషయమై పార్లమెంట్ సబ్‌కమిటీవారు నిన్నటినుంచీ తీవ్రంగా చర్చిస్తున్నారు."

★

అదీ - ఇదీ

ఫార్మోజాసమస్య:

ఇటీవల అమెరికన్ కాంగ్రెసుకు చెందిన విచారణ సంఘం ఎదట మెకార్థర్ తన కొరియన్ యుద్ధనీతిని సమర్థించుకుంటూ మొదటిసారిగా ఫార్మోజాపై తన అభిప్రాయాలు బైటపెట్టాడు.

"ఫార్మోజాను మనం బుద్ధిపూర్వకంగా గాని, బలవంతాన గాని వదిలిపెట్టినట్లయితే మనకు చాలా నష్టం. అది కమ్యూనిష్టుల చేతుల్లోవుంటే జపాను, ఫిలిప్పైను దీవుల పార్శ్వభాగాలు రక్షణరహితములై పోతాయి. మన పసిఫిక్ దీవుల "గొలుసు" నిరుపయోగమై, మన సరిహద్దులు కాలిఫోర్నియాతీరానికి నెట్టివేయబడతాయి."

ఈ ముక్కలన్నీ జనరల్ మెకార్థర్ ఇదివరకు, జపాన్‌పై దాడిచేసేంత సముద్రబలం కమ్యూనిస్టుసేనలకు లేదని ఖచ్చితంగా చెప్పాడు. ఈ పరస్పర విరుద్ధాభిప్రాయాలను సమన్వయించటానికి కతడు ప్రయత్నించకపోయినా అతని కొత్త వాదన శ్రోతలపై బాగా పనిచేసింది. ఉదాహరణకు సెనేటర్ మోర్స్ ఒక రహస్యం బైట పెట్టాడు.

"ఫార్మోజాసమస్యను ప్రపంచ న్యాయస్థానానికి తీసుకుపోతే కెయిరో ఒడంబడికప్రకారం మనం ఫార్మోజాను తిరోదకాలిచ్చుకోవలసి వస్తుంది. న్యాయశాసనరీత్యా మనం ఫార్మోజాసమస్యపై నెగ్గలేం. మనం ఫార్మోజాలో ఉన్నామూ అంటే, మన భద్రత, మన ప్రయోజనాలనుబట్టే ఉన్నాం. ఫార్మోజా కమ్యూనిస్టుహస్తగతమైతే మన ప్రయోజనాలు దెబ్బ తింటాయి."

కాంగ్రెస్ విచారణసంఘం ఎదట రక్షణమంత్రి జనరల్ జార్జిమార్షల్ సాక్ష్యమిస్తూ మెకార్థర్ కార్యక్రమానికి బదులు మరో స్పష్టమైన కార్యక్రమాన్ని అమలు చేయగలమని సెనేటర్లకు హామీ ఇచ్చినట్టు తెలుస్తున్నది...ముఖ్యంగా చైనాపై ఆర్థిక దిగ్బంధం ప్రయోగించాలని అమెరికా తన మిత్రదేశాలను ఒత్తిడి చేస్తున్నది. (దేశంలో ప్రతిపక్షం కళ్ళనీళ్లు తుడవటానికి) కమ్యూనిస్టువిమానాలు అధిక సంఖ్యలో కొరియాలో ప్రవేశిస్తే మంచూరియామీద ప్రత్యక్షదాడి చెయ్యటానికి సిద్ధంగా ఉంది. శాంతి కుదిర్చేటట్టుచేసే ప్రతిపాదనలను వేటినీ బహిరంగంగా చర్చించేందుకు జంకుతోంది.

అయితే ఈ కార్యక్రమం ఫలించకపోతే మిగిలేది మెకార్థర్ కార్యక్రమమే. మెకార్థర్ కార్యక్రమాన్ని అమలుచేసి తీరాలని అప్పుడు ప్రతిపక్షంచేసే ఒత్తిడిని అమెరికన్ ప్రభుత్వం తట్టుకోగలదా? మెకార్థర్ బాట ననుసరిస్తే ఎదురయ్యేది చైనాతో సంపూర్ణయుద్ధమూ, తత్ఫలితంగా మూడో ప్రపంచ యుద్ధమేగదా?

(న్యూ స్టేట్స్‌మన్ — మే 12)

ఖర్చెక్కువ:

కొరియా ద్వీపకల్పాని కడ్డంగా రేడియో ఆక్టివ్ తరంగాల బెల్టును నిర్మించాలన్న ఆలోచనను విరమించుకున్నట్టే. దానికి చాలా ఖర్చవుతుందని అమెరికన్ రక్షణ శాఖవారు అభ్యంతర పెడుతున్నారు. దాని స్థానే నరాలను బాధించేరకం విషవాయువును ద్వీపకల్ప మధ్యంలో నింపెయ్యాలని కొంతకాలంగా ఆలోచన జరుగుతోంది. (న్యూస్‌వీక్ — ఏప్రిల్ 30)

ఉద్యోగ ధర్మం

(14-వ పేజీ తరువాయి)

మార్చాడు, నళినీకాంతం. అందువల్ల యిప్పుడు కొంత పోరు తగ్గింది.

5

యాన్యువల్ యగ్జామినేషన్స్ అయిపోయినయ్. నళినీకాంతానికి ఇంగ్లీషు పేపర్లు వొచ్చినయ్, దిద్దేందుకు.

ఇక మాష్టర్లచుట్టూ పిల్లల తలిదండ్రులు తిరగడం అంతు లేదు. ఈ సమయాల్లోనే కొంత మాష్టర్ల జేబులు నిండేవి. సంవత్సరం పొడుగునా చదవకుండా అల్లరిచిల్లరగా విద్యార్థులు తిరిగేదున్నూ – పరీక్షల్లో బ్లాంక్ పేపర్సు పొచ్చివొచ్చేదున్నూ, తండ్రుల్ని తీసుకొని మాష్టర్లని ఆశ్రయించేది – ఇదే యిప్పటి విద్యార్థుల్లో అమల్లో వున్న దురాచారం. డబ్బుగల తలిదండ్రులు షడి యిస్తాం – పాలిక యిస్తాం అని మాష్టర్ల చుట్టూ తిరుగుతూ లంచాలు నేర్పుతారు. ఆపైన తమ కొడుకుల తెలివితక్కువతనానికీ, చదవని నేరానికీ పల్లెత్తుమాటకూడా అనరు. మాష్టర్లు అనేకరకాలైన మనస్తత్వాల్ని జీర్ణించుకొనివుంటారు. దయతలిచి మార్కులు వేసేవాళ్లు – డబ్బు తీసుకొని మార్కులు వేసేవాళ్లు – ముఖమాటంకొలదీ మార్కులు వేసేవాళ్లు – పై మూడు పద్ధతులకూ లొంగక నియమంప్రకారం ఖచ్చితంగా మార్కులు వేసేవాళ్లు. ఈ చివర రకంగా ఖచ్చితంగా మార్కులు వేసే మాష్టర్లని లోకం హర్షించదు. ఏమైనా ఆ రకానికి చెందినవాడే నళినీకాంతం.

నళినీకాంతంచుట్టూ మార్కులకోసం తిరుగుతున్నారు, విద్యార్థులూ, విద్యార్థుల తలిదండ్రులూ. ఇంకో తమాషా యేమిటంటే ఆ స్కూల్లో విద్య తక్కువ – పాఠాలు వల్లించేవాళ్లు తక్కువ – ప్రతివాడిలోనూ పేపర్లు దిద్దేది మన వూరు మాష్టర్లేగా? అన్న అలక్ష్యం బలిసిపోయింది. అందుచాతనే స్కూలు ఫైనలుపరీక్షలో ఆ స్కూల్లో ముగ్గురు నలుగురికంటె ఉత్తీర్ణులు కారు. నళినీకాంతం మార్కులుకోసం తనదగ్గరకు వొచ్చినవాళ్లని తక్కువగా మాట్లాడుతున్నాడు. విసుక్కుంటున్నాడు. అతనిదగ్గర వున్నది యింగ్లీషు పేపరు కనుక – ఎక్కువ మందికి 'ఫాట్' యింగ్లీషులోనే వుంటుంది కనుక అతనిదగ్గరకు మార్కులకోసం చాలా మంది వొస్తున్నారు. నళినీకాంతం ఒకే పట్టుదలతో వున్నాడు. 'నేను అనవసరంగా మార్కులు వేయను. నా ఉద్యోగధర్మంప్రకారం – మార్కులు వేస్తాను.' బ్రతిమాలేవాళ్లు బ్రతిమాలుతున్నారు. తిరిగి వెళ్లేవాళ్లు వెళ్లుతున్నారు. డబ్బులిచ్చేవాళ్లు డబ్బు ఆశ చూపిస్తున్నారు. కాని నళినీకాంతం లొంగటంలేదు.

'ఇదేమిటండీ – ఈ రామణ ధాడి!' అంటూంది నళినీకాంతం భార్య. 'నీకు తెలియదులే!' అంటాడు నళినీకాంతం.

ఒకరోజున చలపతి తండ్రీ, మాయమాధవుడి తండ్రీ వొచ్చారు – కొడుకుల మార్కులకోసం.

'నేను అధర్మంగా అర మార్కుకూడా వెయ్యటంలేదు.' అని అన్నాడు నళినీకాంతం.

'పోనీలెండి. ఎవరి సంగతో మనకు దేనికి? మా పిల్లవాడిసంగతి చూడండి. ఏవో తక్కువైన మార్కుల్ని వేసేయండి' అన్నాడు చలపతి తండ్రి. స్వవిషయంలోకొచ్చేటప్పటికి ఎంత పెద్దమనుష్యులైనా స్వార్థానికి దాసోహమనటం ఈ మనుష్యుల్లో అనాదినించీ పాతుకుపోయివుంది.

'క్షమించండి. నేను ఖచ్చితమైన మనిషిని. వొచ్చినదానికంటె ఒక్కమార్కు ఎక్కువ వెయ్యను.' అన్నాడు నళినీకాంతం.

'వెయ్యాలి. వెయ్యకపోతే యెట్లా?' అన్నాడు మాధవుడి తండ్రి నొక్కి పలుకుతూ.

'యేమైనా కానీండి. నేను అట్లా మార్కులు వేసే మనిషిని కాను' అన్నాడు నళినీకాంతం.

'మమ్మల్ని చూసైనా వెయ్యక తప్పదు' అన్నాడు చలపతి తండ్రి – ఆ వూరి పంచాయితీ బోర్డు ప్రసిడెంటు, ఆ స్కూలు వొచ్చేందుకు ముఖ్య కారకుడు, తన హోదాను ప్రకటిస్తూ.

'వెయ్యదలచుకోనప్పుడు ఒకళ్ల లావును చూసి వేసే మనస్తత్వం నాది కాదు.' అని గంభీరంగా అన్నాడు నళినీకాంతం.

'అంతేనా?' కోపాన్ని వ్యక్తంచేస్తూ అన్నాడు, మాయమాధవుడి తండ్రి, లక్షాధికారి.

'అవును' అని తొణకకుండా పలికాడు, నళినీ కాంతం.

వాళ్లిద్దరూ లేచిపోయారు. నళినీకాంతం తన వుద్యోగధర్మాన్ని తాను నిలబెట్టుకోగలిగినందుకు గర్వించాడు. వారంరోజుల్లో పేపర్లన్నీ దిద్దేశాడు. కాని ఒక్కడిని మినహాయించి అందరకూ పదిహేను మార్కులు లోపే. చిలిపి చలపతికి – నాలుగున్నర మార్కులూ, మాయమాధవుడికి మూడు మార్కులూ వొచ్చినవి. ఆ పేపర్లని హెడ్ మాష్టరుకు అందజేశాడు.

ఒక మధ్యాహ్నం బజారునించి వొస్తూంటే ఒక వ్యక్తి ముసుగుకప్పుకొని వొచ్చి, నళినీకాంతాన్ని నిలవేసి – 'నువ్వు అంత ఖచ్చితమైన మనిషివా?' అని చంపకేసి కొట్టాడు. దూరంగా అరుగులమీద కూచొన్న నలుగురూ పకాపకా నవ్వారు. ఆ నవ్విన వాళ్లలో మాయమాధవుడి తండ్రికూడా వున్నాడు.

నళినీకాంతానికి ప్రపంచమంతా మోసంతో నిండివున్నట్టు– అధర్మమే జయిస్తున్నట్టు కనపడింది.

6

స్కూలు తెరిచారు. ఇంగ్లీషులో నాలుగున్నరమార్కులు వొచ్చిన చలపతీ ప్యాసయ్యాడు. మూడు మార్కులు వొచ్చిన మాయమాధవుడూ ప్యాసయ్యాడు. నళినీకాంతం అపరిమితమైన ఆశ్చర్యపడ్డాడు. తను ఉద్యోగధర్మప్రకారం దిద్దినా యేమీ లాభం లేకపోయిందని తెలుసుకున్నాడు. చూడగా చూడగా అతనికి – తాను ఉద్యోగధర్మాన్ని నిర్వర్తించాలని అనుకొని ఆ ప్రకారమే సక్రమంగా పాఠాలు చెప్పి, సక్రమంగా పేపర్లు దిద్దితే – చివరకు మిగిలింది, – తన మాట కించిత్తు చెల్లకపోగా, చెంపదెబ్బలు, రాళ్ల దెబ్బలు.

నళినీకాంతానికి ఈ భావం వుదయించగానే కంపించిపోయాడు. నిజానికి ఈ లోకంలో తావులేనట్లు కనపడింది– తావు వున్నదని, తాను ఉద్యోగధర్మం ప్రకారం ప్రవర్తించటం ఎంత తెలివితక్కువతనమో, తెలిసివొచ్చింది.

వారంరోజుల్లో ట్రాన్స్‌ఫర్ వచ్చింది– నళినీకాంతానికి. ఆ ట్రాన్స్‌ఫర్‌ను తెప్పించిందెవరో కాదు. మాయమాధవుడితండ్రీ, చిలిపి చలపతి తండ్రీను. ఇటువంటి ఖచ్చితమైన మాష్టరు తమ స్కూల్లో వుండ తగడని. ఆ ట్రాన్స్‌ఫర్ ఫల్నాడు తాలూకాకి.

నళినీకాంతం భార్య గోలపెట్టింది. 'ఉద్యోగం మానుకోండి. మన వూళ్లో పొలం పుట్రా చూసుకొంటూ హాయిగా వుండొచ్చు. నామాట వినండి. పల్నాడులో బియ్యం దొరకవు. కూటికి వాచిపోవాల్సి వొస్తుంది. రోగాలపాలు కావాల్సి వొస్తుంది.'

నళినీకాంతం 'సరే' నన్నాడు. ★

డైరీ

(3-వ. పేజీ తరువాయి)

—ప్రపంచ బాంకు లండన్ మార్కెట్‌లో స్టెర్లింగ్ ఋణాలు తీసుకోగలదని లండన్ వార్త. అది సుమారు 5 మిలియన్ల పౌనులుండవచ్చని అంచనా వెయ్యబడింది.

—మోనాజైట్, మాంగనీస్ మొదలైన సరుకుతో చెల్లుబడిపెట్టే షరతుపైన 20 లక్షల ధాన్యాన్ని భారతదేశానికి ఋణమివ్వాలని అమెరికన్ సెనేట్ మొదటి తీర్మానాన్ని సవరణచేసింది.

—ఢిల్లీలో నేపాల్ ప్రభుత్వ సమాలోచనలు ముగిసినవనీ, రాణావర్గానికీ, కాంగ్రెస్ వర్గానికీ మధ్య సామరస్యం సాధించబడిందనీ ప్రకటించబడింది.

—అంతర్జాతీయ ద్రవ్యనిధిలోనుంచి ఋణం తీసుకున్న డాలర్ మొత్తాల పరంగా చెల్లుబడి ఇప్పుడు ప్రారంభించబోరని భారత పార్లమెంట్‌లో మంత్రి దేశముఖ్ ప్రకటించారు.

—భారతదేశంలోని నియోజకవర్గ విభజన గురించి రిపబ్లిక్ అధ్యక్షుని ఆజ్ఞ ప్రకటించబడింది.

—ఆచార్య వినోబాభావే నల్లగొండ జైల్లో కమ్యూనిస్టు నిర్బంధితుల్ని కలుసుకుని సమాలోచనలు జరిపారు.

గురువారం, మే 17 :

—రాయబారాలకు రాకుండా నూనెపరిశ్రమను స్వాధీనం చేసుకున్నట్లయితే "చెప్పరాని ఫలితాలు" కలగగలవని పర్షియా ప్రభుత్వాన్ని బ్రిటిష్ ప్రభుత్వం హెచ్చరించింది.

—ఒక్క వేటుతో అనేకమందిని హతం చెయ్యగల కొత్త ఆయుధాలు రెండింటిని కొరియాలో కమ్యూనిస్టులపై ప్రయోగిస్తున్నట్లు ఒక అమెరికన్ సైనికోద్యోగి తెలిపాడు.

—సింగపూర్‌లో సైనికాధికారుల రహస్య సమావేశానికి బర్మాలో విప్లవం భగ్నపరచబడలేదని నివేదించబడినట్లు సింగపూర్ వార్త.

—ఆచార్య కృపలానీ కాంగ్రెస్ సంస్థనుంచి నిష్క్రమించారు.

—ఎన్నికల సమయానికి 10 వేల టన్నుల న్యూస్‌ప్రింట్ దిగుమతి చెయ్యబడుతుందని మంత్రి హరికృష్ణ మెహతాబ్ పార్లమెంట్‌లో చెప్పారు.

—1951 లో మద్రాసు రాష్ట్రానికి భారత ప్రభుత్వం 5 లక్షల టన్నులే కాని 6 లక్షల టన్నుల ధాన్యం కేటాయించలేదని మద్రాసు ప్రభుత్వానికి తెలియపరచబడింది.

శుక్రవారం, మే 18 :

—చీనాకు యుద్ధవస్తువులు వేటినీ ఎగుమతి చేయరాదని నిషేధించే కమిటీ తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం 47 వోట్లతో ఆమోదించింది.

—చీనాకుగాని, ఇతర కమ్యూనిస్టు దేశాలకుగాని యుద్ధావసరవస్తువులు వేనినీ ఎగుమతి చెయ్యడంలేదని అధికారరీత్యా ప్రకటించినప్పుడే పశ్చిమ యూరప్ ప్రభుత్వాలకు, ఇతర రాజ్యాలకు ఆర్థికసహాయం ఇవ్వాలని అమెరికన్ సెనేట్ శాసించింది.

—దక్షిణ కొరియాను కమ్యూనిస్టుల అధీనంనుంచి విముక్తిపరచడమే ఏకైక లక్ష్యమని ఐక్యరాజ్యసమితి ప్రకటించాలని భారత ప్రతినిధి శ్రీ బి. యన్. రావు సూచించారు.

—కొరియా తూర్పురంగంలో కమ్యూనిస్టుల దాడి కాగలేక అమెరికన్ సైన్యాలు వెనక్కి తగ్గాయి.

—పర్షియా ప్రభుత్వాన్ని హెచ్చరించడంతోపాటు బ్రిటిష్ ప్రభుత్వం మధ్యధరా నౌకాదళానికి అదనపు బలాలను పంపింది.

—భారతవిద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ రెండుమాసాలపాటు యూరప్, టర్కీ, పర్షియా పర్యటించడానికి బయలుదేరారు.

శనివారం, మే 19 :

—కొరియాకు సైన్యాలు పంపవలసిందని భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలను అమెరికన్ ప్రభుత్వం కోరింది.

—ఐక్యరాజ్యసమితి కార్యాలయం మాన్‌హటన్ ద్వీపంలోని కొత్త భవనానికి మారింది. పాత కార్యాలయ భవనంలో ఇకనుంచి యుద్ధపరికరాలు తయారుచెయ్యబడతాయి.

—రాజ్యాంగ నిబంధనల సవరణలలో పత్రికా స్వాతంత్ర్యానికి సంబంధించిన సవరణగురించి అఖిలభారత పత్రికా సంపాదకుల స్థాయీసంఘం లిన అభిప్రాయాన్ని పండిట్ నెహ్రూకు నివేదించింది.

—1950 జూలైలో పఠాన్‌కోటలో డకోటా విమానం కూలిపోడానికి కారణం ఆ విమానం నిర్మాణంలో దోషంవల్లనని విచారణసంఘం నివేదించింది.

—అదనంగా ఇద్దరు కాంగ్రెస్ మంత్రుల్ని నియమించవచ్చునని భారత ప్రభుత్వపు స్టేట్‌శాఖ చేసిన సూచనను హైదరాబాద్ కాంగ్రెస్ కార్యవర్గం నిరాకరించింది.

ఆదివారం, మే 20 :

—జపాన్‌తో శాంతి ఒడంబడిక విషయమై రష్యన్ సూచనను అమెరికన్ ప్రభుత్వం నిరాకరించింది.

—పర్షియా నూనెపరిశ్రమసమస్యను పరిష్కర్త నియామకంవల్ల పరిష్కరించాలని బ్రిటిష్‌ప్రభుత్వం చేసిన సూచనను పర్షియా ప్రభుత్వం నిరాకరించింది.

—రాబట్టలేకపోయిన రాబడి పన్నులలో ఏ కొంతభాగాన్నైనా నయాన రాబట్టుకోవాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం కొన్ని ప్రత్యేక సదుపాయాలను ప్రకటించింది.

—బీహార్ ప్రభుత్వం విద్యాశాలల్లో విద్యార్థులను ప్రవేశపెట్టడానికి కులాలవారీ రిజర్వేషన్ పద్ధతిని మానుకుంది.

—శ్రీ టంగుటూరి ప్రకాశంగారు కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా నిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు టండన్‌గారికి లేఖ పంపారు. ★

గ్రంథస్వీకారం

అసావేరి

(పెద్దకథ)

కర్త: శ్రీ రావూరి భరద్వాజ.

ప్రకాశకులు: రోహిణి పబ్లికేషన్సు, మారీసుపేట, తెనాలి.

వెల: ముప్పావలా. ★

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్ర వాఙ్మయ చరిత్ర

సరికొత్త పద్ధతిని, సంగ్రహరూపంలో నడచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రల నన్నిటిని అవలోడనచేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.

★

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయధర్మమా అని ఒక్కఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికీ నవ నవోజ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

★

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు ప్రత్యేకము.


ఆంధ్ర గ్రంథ మాల,

పోస్టు బాక్సు నెం. **212**, మదరాసు

Regd. No. M 4479

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు



ఆరవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ
వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన
పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.



★

ఖద్దరు బైండు

వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

★

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras